www.andhrajyothy.com
వెల (Price): Rs. 6.50
హైదరాబాద్ సిటీ*
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 27
మంగళవారం | 13-5-2025
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి రా.12.36 తదుపరి విదియ; నక్షత్రం: విశాఖ ఉ.9.09 తదుపరి అనూరాధ; వర్జ్యం: మ.1.35-3.21; దుర్ముహూర్తం: ఉ.8.21-9.12, రా.10.15-10.58; అమృతఘడియలు: రా.12.14-2.01; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.47; సూర్యాస్తమయం: 6.35
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## టెస్ట్‌లకు విరాట్ గుడ్‌బై



అనుకున్నట్టే.. విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పేశాడు. కెప్టెన్ రోహిత్ శర్మ నాలుగు రోజుల కిందటే సంప్రదాయ క్రికెట్‌కు వీడ్కోలు పలకగా.. తాజాగా కోహ్లీ కూడా అతడిని అనుసరించాడు. ఇంగ్లండ్ టూర్ వరకైనా వీడ్కోలు నిర్ణయాన్ని వాయిదా వేసుకోవాలని కోహ్లీని బీసీసీఐ కోరింది. అతడిని ఒప్పించే ప్రయత్నం చేసింది. కానీ, తన నిర్ణయం మార్చుకోనని విరాట్ స్పష్టం చేశాడు. 2011లో టెస్టు అరంగేట్రం చేసిన కోహ్లీ మొత్తం 123 మ్యాచ్‌లాడి 9230 పరుగులు చేశాడు. ఇందులో 30 శతకాలున్నాయి. ఇక సారథిగా అద్భుత రికార్డు కోహ్లీ సొంతం. అతను సారథ్యం వహించిన 68 టెస్టుల్లో భారత్‌ను 40 సార్లు విజయ పథంలో నడిపి అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా నిలిచాడు. 11

# అణు బూచికి బెదరం

## అణ్వస్త్ర బెదిరింపులను సహించం

ఉగ్రవాదులు, వారికి ఆశ్రయమిచ్చే ప్రభుత్వాల్ని వేర్వేరుగా చూడం

నుదుట సిందూరాన్ని తుడిచే సాహసం చేస్తే వాటి ప్రధాన కార్యాలయాలనే తుడిచిపెట్టేశాం

సరిహద్దుల్లో దాడికి సిద్ధమైతే.. పాక్ గుండెలపైనే దాడులు చేశాం

భద్రతా బలగాల తెగువ, పరాక్రమం తిరుగులేనివి

ఉగ్రవాద స్థావరాలనే కాదు.. నైతిక స్థైర్యాన్నీ బదాబదలు చేశాం

మన దాడులతో పాక్‌కు ఊహకు కూడా అందనంత విధ్వంసం

అందుకే ప్రపంచ దేశాల్ని వేడుకుంది.. పరుగెత్తుకుంటూ వచ్చింది

మేడిన్ ఇండియా రక్షణ వ్యవస్థల సత్తా ప్రపంచానికి తెలిసింది

ఉగ్రవాదం, చర్చలు సహజీవనం సాగించలేవు..

ఉగ్రవాదం, వ్యాపారం ఒకే బాటలో పయనించలేవు..

రక్తం, నీళ్లు కలిసి ప్రవహించ లేవు..

జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

"ఆపరేషన్ సిందూర్ అనేది కేవలం ఒక్క పేరు మాత్రమే కాదు.. అది కోట్లాదిమంది భారతీయుల భావోద్వేగాలకు ప్రతీక. న్యాయం జరగాలని చేసిన దృఢమైన సంకల్పం. దీనినే ఈనెల ఆరేడు తేదీల్లో ప్రపంచం మొత్తం చూసింది.

మన దాడి పాకిస్థాన్ దుర్బలత్వాన్ని బయటపెట్టింది. భారతదేశ అధునాతన గగనతల రక్షణ వ్యవస్థల ముందు దాని క్షిపణులు, డ్రోన్లు కట్టె పుల్లల్లా తేలిపోయాయి. కేవలం 3 రోజుల్లోనే పాకిస్థాన్ ఊహకు అందనంత విధ్వంసం జరిగింది. భారత్ ప్రతి దాడులతో ఉద్రిక్తతలు చల్లారేందుకు పాక్ దారులు వెతుక్కుంది. తమకు ఊరట కల్పించాలంటూ ప్రపంచ దేశాలను వేడుకుంది.

పాకిస్థాన్ ప్రభుత్వం, సైన్యం ఎప్పటికప్పుడు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూనే ఉన్నాయి. పాక్ పతనానికి కూడా ఇటువంటి చర్యలే కారణమవుతాయి. ఉగ్రవాదానికి ఇలాగే చేయూత ఇస్తే ఏదో ఒక రోజు పాకిస్థాన్‌నే మింగేస్తుంది. పాకిస్థాన్ బయటపడాలంటే ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయాల్సిందే. శాంతికి ఇది తప్ప మరో మార్గం లేదు.

ఉగ్రవాదంపై పోరులో ఆపరేషన్ సిందూర్ ఇక నుంచి భారత సువ్యవస్థిత విధానం. ఉగ్రవాద వ్యతిరేక పోరాటాలకు ఈ ఆపరేషన్ సరికొత్త ప్రమాణాన్ని నిర్దేశించింది.

ఇది యుద్ధాల యుగం కాదు. అలాగే, ఉగ్రవాద శకమూ కాదు. సురక్షిత, అత్యుత్తమ ప్రపంచం కావాలంటే ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించరాదు."



న్యూఢిల్లీ, మే 12 (ఆంధ్రజ్యోతి): అణు బెదిరింపులకు భారత్ బెదిరేది లేదని, అణ్వస్త్ర బ్లాక్ మెయిలింగ్‌ను ఏమాత్రం సహించేది లేదని పాకిస్థాన్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తేల్చి చెప్పారు. అణ్వస్త్ర బూచిని చూపించి ఉగ్రవాద స్థావరాలను నిర్వహిస్తే కచ్చితమైన, నిర్ణయాత్మక దాడులు తప్పవని హెచ్చరించారు. ఉగ్రవాదులకు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారికి మధ్య ఏమాత్రం తేడా లేదని, ఉగ్రవాద నాయకులను, వారికి ఆశ్రయం ఇచ్చే ప్రభుత్వాలను భారత్ వేర్వేరుగా చూడదని పునరుద్ఘాటించారు. భారత సైన్యం హతమార్చిన ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాకిస్థాన్ సైనికాధికారులు హాజరయ్యారని, దీనిని ప్రపంచమంతా చూసిందని, ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదంలో పాకిస్థాన్ పూర్తిగా కూరుకుపోయిందని అనడానికి ఇది మరో నిదర్శనమని చెప్పారు. మన కుమార్తెలు, చెల్లెళ్ల నుదిటిపై సిందూరాన్ని

మిగతా 12వ పేజీలో...

### బ్రహ్మాస్త్రంలా దూసుకెళ్లిన మార్కెట్ 10

2,975 పాయింట్ల లాభంతో 82,429.90 వద్ద ముగిసిన సూచీ

16 లక్షల కోట్లు పెరిగిన సంపద.. ఒక్కరోజే 3400 తగ్గిన పసిడి ధర

## వాణిజ్య బెదిరింపులతో దారికి..!

యుద్ధం ఆపకపోతే వాణిజ్యం ఉండదని హెచ్చరించా

ఉన్నపళంగా కాల్పుల విరమణ పాటించాలని చెప్పా

భారత్-పాక్ అణుయుద్ధాన్ని నివారించా

లేకుంటే కోట్లాది మంది చనిపోయేవారు

భారత్, పాక్ ప్రధానులు పరిస్థితిని అర్థం చేసుకున్నారు

భారత్‌తో చర్చలు ప్రారంభించాం.. పాక్‌తోనూ త్వరలో..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు

ఆయన వ్యాఖ్యల్లో వాస్తవం లేదన్న ప్రభుత్వ వర్గాలు



న్యూయార్క్/వాషింగ్టన్, మే 12: భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలకు అడ్డుకట్ట వేసింది తానేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పేర్కొన్నారు. కాల్పుల విరమణ పాటించకపోతే.. తమ దేశంతో వాణిజ్యం ఆపేస్తానని హెచ్చరించానని, ఇరు దేశాల మధ్య అణుయుద్ధాన్ని నివారించానని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్ష కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత ఉపఖండంలో కొన్ని రోజులుగా

మిగతా 12వ పేజీలో...

### వాణిజ్య యుద్ధానికి విరామం!

ప్రతీకార సుంకాల తగ్గింపుపై అమెరికా, చైనా ఒప్పందం

ద్వైపాక్షిక దిగుమతులపై 115% టారిఫ్‌ల తగ్గింపు

90 రోజుల పాటు కొనసాగించాలని నిర్ణయం

ఇక నుంచి చైనాపై 30%.. అమెరికాపై 10% సుంకాలు

11

## వలసలపై బ్రిటన్ కఠిన వైఖరి

పౌరసత్వం పొందడానికి నిరీక్షణ సమయం 5 నుంచి 10 ఏళ్లకు పెంపు

అత్యున్నత ప్రమాణాలతో ఇంగ్లిష్ తప్పనిసరి

ప్రధాని స్టార్మర్ ప్రకటన 13

## సమాచార హక్కు కమిషనర్లుగా నలుగురు

పీవీ శ్రీనివాస్, అయోధ్యరెడ్డి, భూపాల్, పర్వీన్‌ల నియామకం

మూడేళ్ల పాటు పదవుల్లో.. 3

హరిప్రసాద్, కేఎల్‌ఎన్, వైష్ణవికి నో

రాములు స్థానంలో భూపాల్‌కు చాన్స్

గవర్నర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ.. ఆ వెంటనే ఉత్తర్వుల విడుదల

### గుజరాత్‌లో తెలంగాణ సీఎస్‌బీ పోలీసుల ఆపరేషన్

20 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు 14




### ప్రైవేటు బడులు, జూనియర్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణ

పేరెంట్స్, టీచర్స్ కమిటీలే వాటిని నిర్ణయించాలి

జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కమిటీలు

ప్రతీ స్కూల్లో పేదలకు 25% ఫ్రీ సీట్లు

విద్యారంగ సంస్కరణలపై సిద్ధమైన ముసాయిదా చట్టం

మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం భేటీ

పాల్గొన్న పాఠశాలలు, కళాశాలల యాజమాన్య సంఘాలు 14



కశ్మీర్‌లోని సాంబ జిల్లాలో పాక్ డ్రోన్లను తిప్పికొడుతున్న భారత గగనతల రక్షణ వ్యవస్థ

## సరిహద్దుల్లో సైన్యాన్ని తగ్గిద్దాం

డ్రోన్లు, క్షిపణుల దాడులు జరగొద్దు

కాల్పుల విరమణను పాటిద్దాం

భారత్-పాక్ డీజీఎంవోల భేటీలో నిర్ణయం

కాసేపటికే భారత్ భూభాగంలో పాక్ డ్రోన్లు

సమర్థంగా కూల్చేశామన్న భారత సైన్యం

ఎలాంటి ఆందోళన అవసరం లేదని వెల్లడి

సాంబ, హోషియార్‌పూర్‌లో బ్లాకౌట్

పాక్ వైమానిక స్థావరాలకు చావుదెబ్బ

11 ఎయిర్‌బేస్‌లపై భీకర దాడులు

'ఆపరేషన్ సిందూర్'పై డీజీఎంవోల వెల్లడి

కిరానా హిల్స్‌పై దాడి చేయలే: ఏకే భారతి

న్యూఢిల్లీ, మే 12: నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ) వెంబడి ఉద్రిక్త పరిస్థితులను తగ్గించాలని భారత్-పాక్‌కు చెందిన మిలటరీ ఆపరేషన్ల డైరెక్టర్ జనరల్స్(డీజీఎంవో) నిర్ణయించారు. సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఇరువురు డీజీఎంవోలు హాట్‌లైన్‌లో దాదాపు 45 నిమిషాలపాటు సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు. నిజానికి మధ్యాహ్నం 12 గంటలకే వీరి భేటీ మొదలవగా.. కాసేపటికి సమావేశాన్ని సాయంత్రానికి వాయిదా వేశారు. ఈ సందర్భంగా

మిగతా 12వ పేజీలో...

## పోరు బందర్!

పాక్ డ్రోన్ల వెన్ను విరిచిన మచిలీపట్నం సరుకు

హైదరాబాద్‌లో జామర్ల తయారీ

బెంగళూరులో రాడార్లు, బందర్‌లో ఎలక్ట్రో ఆప్టిక్స్, తుదిరూపు

శత్రుదేశానికి డేంజర్ బెల్ మన డీ4



డీ4 వ్యవస్థ

గతంలో యుద్ధం అంటే యుద్ధ విమానాలు, ట్యాంకులు, శతఘ్నులు, యుద్ధ నౌకలే ఎక్కువగా కనిపించేవి. కానీ రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నుంచీ డ్రోన్ల పాత్ర చాలా ప్రధానంగా మారిపోయింది. తాజా భారత్-పాక్ యుద్ధంలో డ్రోన్ల వినియోగం పతాక స్థాయికి చేరింది. రెండు వైపుల నుంచి డ్రోన్లు, ఎగిరే బాంబులు (లాయిటరింగ్ మ్యూనిషన్లు) వందల, వేల సంఖ్యలో దాడులకు దిగాయి. అలాగే ప్రత్యర్థి డ్రోన్ల

మిగతా 13వ పేజీలో...



నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో మిస్‌వరల్డ్ పోటీదారులు

## సాగర్‌లో సుందరీమణుల సందడి

### బుద్ధవనాన్ని సందర్శించిన అందగత్తెలు

బుద్ధుడికి మిస్ వరల్డ్ పోటీదారుల నివాళి, బౌద్ధభిక్షువుల ఆశీర్వచనం

బుద్ధపీఠం వద్ద ప్రార్థనలు, ధ్యానం

నేడు చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్

రేపు ఓరుగల్లుకు అందాలభామలు

వరంగల్ కోట, వేయిస్తంభాల గుడి, రామప్ప ఆలయం సందర్శన

నల్లగొండ/హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన వివిధ దేశాల సుందరీమణులు సోమవారం నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్‌ను సందర్శించారు. పర్యాటక క్షేత్రమైన సాగర్‌లో ప్రపంచశాంతికి నెలవైన బుద్ధవనాన్ని చూసి ఆనందపరవశులయ్యారు. సాగర్ జలాశయాన్ని చూసి తన్మయం చెందారు. ఆసియా దేశాలకు చెందిన 22 మంది అందాల భామలు ప్రత్యేక బస్సులో సోమవారం సాయంత్రం 4:55 గంటలకు నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని విజయవిహార్ అతిథి గృహానికి చేరుకున్నారు. వారికి జిల్లా అధికార యంత్రాంగం

మిగతా 14వ పేజీలో...

## 'సెకీ' సీఎండీ గుప్తాపై కేంద్రం వేటు

మరో నెల గడువు ఉండగానే తొలగింపు

కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ కార్యదర్శి సారంగికి అదనపు బాధ్యతలు



రామేశ్వర్ ప్రసాద్ గుప్తా

న్యూఢిల్లీ, మే 12: భారత సౌర శక్తి కార్పొరేషన్ (సెకీ) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రామేశ్వర్ ప్రసాద్ గుప్తాను కేంద్రం తొలగించింది. ఆయన స్థానంలో కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ కార్యదర్శి సంతోష్‌కుమార్ సారంగికి సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ సోమవారం నిర్ణయం తీసుకుంది. కొత్త సీఎండీని నియమించేవరకు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు సారంగి అదనపు బాధ్యతలు నిర్వహించేందుకు కాంపిటెంట్

మిగతా 13వ పేజీలో...



సొనాటా సాఫ్ట్‌వేర్ ఏఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్; చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా, మంత్రి శ్రీధర్‌బాబు

## 3లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం

రాష్ట్రంలో లక్షకుపైగా ఉద్యోగాలు సృష్టించాం

సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్ రంగాలకు ప్రోత్సాహం

ఆర్థిక అభివృద్ధి కోసం పరిశ్రమలకు మద్దతు

నానక్‌రాంగూడలో సొనాటా ఏఐ కేంద్రాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

గవర్నర్‌తో సీఎం భేటీ.. రాష్ట్రంలో పరిస్థితులు, శాంతి భద్రతల గురించి వివరణ

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి 2023 డిసెంబరు నుంచి ఇప్పటివరకు కొత్తగా రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, లక్షకు పైగా ఉద్యోగాలు సృష్టించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. దేశీయంగా, అంతర్జాతీయంగా పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. మూడు దశాబ్దాలుగా హైదరాబాద్‌లోని బేగంపేట కేంద్రంగా ఉన్న సొనాటా సాఫ్ట్‌వేర్ కంపెనీ ఐటీ కారిడార్‌కు విస్తరించింది. నానక్‌రాంగూడలోని వంశీరాం సువర్ణదుర్గ టెక్ పార్క్‌లో 2లక్షల చదరపు అడుగుల్లో కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు

మిగతా 2వ పేజీలో...

ఢిల్లీ తెలంగాణ భవన్‌లో పీవీ నరసింహారావు విగ్రహం?.. న్యూఢిల్లీ మునిసిపల్ కౌన్సిల్ ప్రతిపాదన 2

## అప్పీళ్లన్నీ ఆదాయ వనరులే

ఒక్కో దానికి రూ. 15-20 లక్షలు లంచం

బినామీలు, హవాలా ఖాతాల్లోకి మళ్లింపు

ముంబై సంస్థ నుంచి 2.5 కోట్ల ఫ్లాట్ గిఫ్ట్

ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ జీవన్‌లాల్ అవినీతి బాగోతం

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ నిర్మాణ, ఇంజనీరింగ్ సంస్థ షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీ నుంచి రూ.70 లక్షలు లంచం తీసుకున్న అభియోగంపై అరెస్టయిన ఆదాయ పన్ను కమిషనర్ లావుడ్య జీవన్‌లాల్ కేసులో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుతం ఆదాయ పన్ను శాఖ కమిషనర్‌గా ఉన్న ఆయన ఐటీ అప్పీల్ యూనిట్ 7, 8కి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. కార్పొరేట్ సంస్థల అప్పీళ్లను పరిష్కరించేందుకు ఎక్కడికక్కడ మధ్యవర్తులను ఏర్పాటు చేసుకుని జీవన్‌లాల్ లంచాలు వసూలు చేసినట్లు సీబీఐ విచారణలో తేలింది. లంచంగా తీసుకున్న స్థిరాస్తులను బినామీల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలను తన వద్ద భద్రపర్చుకున్నట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. ప్రాథమికంగా ఆయన అక్రమ సంపాదన రూ.కోట్లలో

మిగతా 14వ పేజీలో...

## రైతులు కోర్టుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు

» రెవెన్యూ ఆఫీసుల్లోనే సమస్యలకు పరిష్కారం: పొంగులేటి

హైదరాబాద్, మే12 (ఆంధ్రజ్యోతి): రైతులు ఏ కోర్టు చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ కార్యాలయాల్లోనే వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం దార్శనికతతో భూభారతి చట్టం తెచ్చిందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ఈ చట్టం సులువైన మార్గం అని చెప్పారు. భూభారతి చట్టం ప్రయోగాత్మకంగా అమలు చేసిన తొలి దశ నాలుగు మండలాలకు సంబంధించిన జిల్లాల కలెక్టర్లతో సోమవారం సచివాలయం నుంచి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని నారాయణపేట, ఖమ్మం, కామారెడ్డి, ములుగు జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలని.. ఈ నెలాఖరు నాటికి పరిష్కారం చూపాలని సూచించారు. సోమవారం నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు తహసీల్దార్లకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. మరోవైపు.. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎప్పటికప్పుడు అర్హుల జాబితాలను ఆయా జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులకు పంపించి ఆమోదం తీసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 47 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అందుబాటులో ఉందని మంత్రి పొంగులేటి తెలిపారు. వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానం అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమల్లోకి తెస్తామన్నారు.

## ఎరువుల సరఫరాలో సమస్యలు రావొద్దు:తుమ్మల

హైదరాబాద్, మే12 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఖరీఫ్ సీజన్‌కు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సచివాలయంలో వ్యవసాయాధికారులతో సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. వచ్చే ఖరీఫ్ సన్నాహాలు, విత్తనాల సరఫరా, ఎరువుల నిల్వలు తదితర కీలక అంశాలపై అధికారులతో ఆయన చర్చించారు. యూరియా, విత్తనాల సరఫరాలో రైతులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులు, అగ్రికల్చర్- హార్టికల్చర్ యూనివర్సిటీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ప్రతినిధులు 2025-26 ఖరీఫ్ కోసం 3.31 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను ఇప్పటికే భద్రపరచిన విషయాన్ని మంత్రికి వివరించారు. మరో 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. మరో 1,000 రైతు వేదికల్లో దృశ్యశ్రావణ మాధ్యమాలను ఏర్పాటు చేయాలని, జూన్ 2 వరకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభమయ్యేలా వాటి పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

## గ్రూప్-1పై తప్పుడు ఆరోపణలు.. క్షమించండి

» బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేందర్ గౌడ్ లేఖ

హైదరాబాద్, మే12 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్షలపై తాను చేసిన ఆరోపణలపై క్షమాపణలు కోరుతున్నట్టు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేందర్ గౌడ్ తెలిపారు. ఫలితాల ప్రకటన అనంతరం ఆయన మార్చి 11న నగరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో గ్రూప్-1 పరీక్షల తీరుపై ఆరోపణలు చేశారు. ఫలితాల్లో అవకతవకలు జరిగాయని, రీవాల్యుయేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆధారాలు చూపాలని, లేనిపక్షంలో పరువు నష్టం దావా వేస్తామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆయనకు నోటీసులు పంపింది. దీంతో ఆయన క్షమాపణలు చెప్పారు. అవకతవకలు జరిగాయంటూ కొందరు ఫెయిలైన అభ్యర్థులు పేర్కొన్న మాటలను నిజ నిర్ధారణ చేసుకోకుండా తాను పేర్కొన్నానని తెలిపారు. తన తప్పును ఒప్పుకోవడంతో నరేందర్ గౌడ్‌పై పరువు నష్టం దావా, క్రిమినల్ కేసుల ప్రతిపాదనను పబ్లిక్ సర్వీసు కమిషన్ వెనక్కి తీసుకుంది.

## బ్రాండెడ్ మెడిసినా..? జర భద్రం..!!

» ఔషధాల కొనుగోలులో అప్రమత్తత అవసరం

» కవర్లపై క్యూఆర్ కోడ్ స్కాన్‌తో కల్తీ గుర్తించవచ్చు

» 18005596969కు ఫిర్యాదు చేయవచ్చు: డీసీఏ

హైదరాబాద్, మే 12(ఆంధ్రజ్యోతి): నిత్యం వినియోగించే 300 రకాల బ్రాండెడ్ ఔషధాల కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి(డీసీఏ) ప్రజలకు సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా డీసీఏ అధికారులు నిర్వహించిన దాడుల్లో 5 రకాల ఔషధాల్లో నాణ్యత లేనట్లు గుర్తించారు. వాటిని తదుపరి పరీక్షల కోసం పంపారు. ఔషధాల కవర్లపై క్యూఆర్ కోడ్ ఉంటుందని, దాన్ని స్కాన్ చేస్తే, తయారు చేసిన కంపెనీ వివరాలు, తయారీ తేదీ, ఎక్స్‌పైరీ తేదీ వివరాలు తెలుస్తాయన్నారు. సరిగ్గా అవే వివరాలు ఆ ఔషధాల కవర్‌పైన కూడా ఉండాలని, వివరాలు సరిపోలకపోతే నకిలీ ఔషధంగా గుర్తించాలన్నారు. నకిలీ అని తేలితే టోల్ ఫ్రీ నంబరు 18005596969కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచించారు.

## ఔషధాలు, రక్తం, బెడ్‌లు సిద్ధంగా ఉంచుకోవాలి

» ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు సర్కారు సూచన

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి) : భారత్- పాకిస్థాన్‌ల మధ్య ఇటీవల నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఔషధాలు, రక్తం వంటి అత్యవసరమైనవి అందుబాటులో ఉంచుకునేలా సన్నద్ధం కావాలని సర్కారు సూచించింది. ఈమేరకు సోమవారం సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా, రాష్ట్ర విపత్తు ప్రతి స్పందన, అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి వైద్య ఆరోగ్య శాఖ, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రెండూ కూడా అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు పడకల లభ్యత, తగినంత మందులు, వినియోగ వస్తువులు, పవర్ బ్యాకప్ మొదలైన వాటిని సంసిద్ధంగా ఉంచుకోవాలని సూచించింది.



వెంకట్ గరికపాటిని సన్మానిస్తున్న కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, కిశోర్‌కుమార్, రంగరాజన్

## అలరించిన అన్నమయ్య సంకీర్తనా గానం

» రవీంద్రభారతిలో ఘనంగా పదకవితా పితామహుడి జయంత్యుత్సవం

» వెంకట్ గరికపాటి రాసిన గ్రంథాల ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీ/రవీంద్రభారతి, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త విశారద వెంకట్ గరికపాటి 108 మంది గాయకులతో కలిసి నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనా గానం ప్రేక్షకుల్ని మైమరిపించింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పదకవితా పితామహుడు అన్నమయ్య 617వ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా వెంకట్ గరికపాటి రాసిన శ్రీరామాభిరామం, రాజీవనేత్రాయ రాఘవాయ వ్యాఖ్యాన గ్రంథాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు కె.ఐ.వరప్రసాదరెడ్డి వెంకట్ గరికపాటి, కళాకారులను సత్కరించి అభినందించారు. అన్నమయ్య సంకీర్తనల సాహితీ విలువలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి వెంకట్ గరికపాటి చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ కిశోర్ కుమార్ మాట్లాడుతూ.. నలభై ఏళ్లుగా అన్నమయ్య సేవలో వెంకట్ నిమగ్నమయ్యారని.. 24 పుస్తకాలు రచించడం గొప్ప విషయమని ప్రశంసించారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్, రామాచారి తదితరులు వెంకట్ గరికపాటిని సన్మానించారు.

3లక్షల కోట్ల

# పెట్టుబడులు తెచ్చాం

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. నూతన ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొనాటా సాఫ్ట్‌వేర్ ఏఐను ఉపయోగించి పర్యావరణ వ్యవస్థలను రూపొందించడం గర్వకారణమన్నారు. హైదరాబాద్ మహానగరం సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)కి హబ్‌గా మారిందని పేర్కొన్నారు. అలాగే ఏఐ-రెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకూ హైదరాబాద్ కేంద్రంగా మారిందని తెలిపారు. మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటీ దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లోని తమ క్యాంపస్‌లను విస్తరిస్తున్నాయన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం పనిచేస్తూనే.. పరిశ్రమలకు మద్దతు ఇస్తూ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తోందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని సముద్ర ఓడరేవుతో అనుసంధానించేందుకు ఇక్కడ డ్రైపోర్ట్ నిర్మిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీలో ఏఐ నగరం, యంగ్ ఇండియా స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీలు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### ప్రతీ కంపెనీ హైదరాబాద్‌కు బ్రాండ్ అంబాసిడర్

ప్రపంచంలోనే గొప్ప ఈవెంట్లలో ఒకటిగా పేరు పొందిన మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లో జరుగుతుండడం మనందరికీ గర్వకారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మరిన్ని ప్రపంచ ఈవెంట్లను తెలంగాణలో నిర్వహించడానికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ కార్యాచరణ ద్వారా ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాలు, మౌలిక సదుపాయాలు, సంక్షేమం సమతుల్యంగా సాగుతోందని, ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో, హైదరాబాద్‌ను అత్యద్భుత నగరంగా మార్చడంలో అందరి సహకారం కోరుతున్నామని చెప్పారు. ఇక్కడి ప్రతీ కంపెనీ హైదరాబాద్‌కు బ్రాండ్ అంబాసడర్లుగా మారాలని, మన విజయాలను ప్రపంచానికి చూపాలని ఆయన అన్నారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భేటీ అయిన సీఎం రేవంత్

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఏఐ, మెషిన్ లెర్నింగ్ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో ప్రపంచంలోనే తెలంగాణను లీడర్‌గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. తెలంగాణను ఏఐ లీడర్‌గా మార్చేందుకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించామని చెప్పారు. ఏఐ సిటీకి శ్రీకారం చుట్టామని, ఈ సిటీలో భాగస్వామయ్యేందుకు మైక్రోసాఫ్ట్ లాంటి టెక్ దిగ్గజ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయని పేర్కొన్నారు. ఏఐలో ప్రపంచ స్థాయి నిపుణులను తయారు చేసేందుకు జూన్ లేదా జులై నెలలో ఏఐ యూనివర్సిటీని ప్రారంభించబోతున్నామన్నారు. పౌర సేవలను ఏఐతో అనుసంధానించి ప్రజల ముంగిట చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆన్‌లైన్‌లోనూ నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి అనుబంధంగా డిజిటల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నామని ఆయన ప్రకటించారు. సొనాటా సాఫ్ట్‌వేర్ సీఈవో, ఎండీ సమీర్ ధిర్ మాట్లాడుతూ.. ఏఐ టెక్నాలజీకి కేంద్రంగా కొత్త కార్యాలయం నిలుస్తుందని తెలిపారు. నూతన కార్యాలయంలో దాదాపు ఐదు వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండలి అధ్యక్షుడు గుత్తా సుఖేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ

రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఉదయం భేటీ అయ్యారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు, దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో గవర్నర్‌తో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిస్థితులు, శాంతిభద్రతల గురించి గవర్నర్‌కు ముఖ్యమంత్రి వివరించారు. సుమారు 20 నిమిషాలపాటు జరిగిన ఈ సమావేశంలో జాతీయస్థాయి అంశాలు, రాష్ట్రంలో పరిస్థితులు, ఇతర కీలక అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. కాగా ప్రపంచ సుందరీమణులకు ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రభుత్వం తరపున ఇచ్చే విందులో గవర్నర్‌ను పాల్గొనాల్సిందిగా సీఎం ఆహ్వానించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు హాజరుకావాలని కూడా గవర్నర్‌ను రేవంత్ ఆహ్వానించారు. సీఎంతోపాటు మంత్రి శ్రీధర్ బాబు కూడా గవర్నర్‌తో సమావేశమయ్యారు.





## మార్చి నెలలో వాణిజ్య పన్నుల వృద్ధి 6%

» భవిష్యత్తులోనూ ప్రణాళికతో ముందుకెళ్లాలి

» క్యాబినెట్ సబ్ కమిటీ భేటీలో డిప్యూటీ సీఎం

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): గడిచిన సంవత్సరం మార్చి నెలతో పోలిస్తే.. 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చి నెలలో వాణిజ్య పన్ను వసూళ్లలో 6 శాతం మేర వృద్ధి నమోదైందని, ఇది మంచి పరిణామమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదాయ వనరుల సమీకరణపై క్యాబినెట్ సబ్ కమిటీ సచివాలయంలో భట్టి అధ్యక్షతన సమావేశమైంది. ఇందులో కమిటీ సభ్యులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. గడిచిన ఏడాది(2023-24) మార్చి లో వసూలైన జీఎస్టీ, వ్యాట్ కంటే ఈసారి మార్చిలో రూ.600 కోట్ల వృద్ధి ఉంటుందని అంచనా వేయగా.. రూ.500 కోట్ల ఆదాయం ఖజానాకు సమకూరిందని తెలిపారు. అంటే 6 శాతం వృద్ధి నమోదైందని అన్నారు. ఆదాయ పెంపు విషయంలో భవిష్యత్తులోనూ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎక్సైజ్ శాఖ ద్వారా ఆదాయాన్ని పెంచే క్రమంలో ఎక్కడైనా లీకేజీలుంటే.. వాటిని గుర్తించి సరి చేయాలని ఆదేశించారు. అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్ల విక్రయాల్లో ప్రగతి కనిపిస్తున్నప్పటికీ.. వ్యవసాయ భూములు, ఓపెన్ ప్లాట్ల విక్రయాల్లో ఆశించినంత వేగం కనిపించడం లేదన్నారు. దీనికి కారణాలను విశ్లేషించి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రుల బృందం అధికారులను ఆదేశించింది. గిరిజన ప్రాంతాల్లోని సొసైటీల ద్వారా ఇసుక అమ్మకాలు చేపట్టాలని, అర్హులైన వారిని గుర్తించి ట్రైబల్ సొసైటీలలో సభ్యులుగా చేర్చాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు సూచించింది. జిల్లా కేంద్రాల్లోని విలువైన భూములను గుర్తించి, వాటిని సంరక్షించే బాధ్యతలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. భవన నిర్మాణ అనుమతుల విషయంలో హెచ్ఎండీఏ వేగం పెంచాలని చెప్పింది.

# మిగులు విద్యుత్తు రాష్ట్రంగా అభివృద్ధి చేస్తాం

» విద్యుత్తు ఉద్యోగుల సమస్యల పరిష్కరించడానికి నేను ముందుంటా!

» లైన్మెన్ నుంచి సీఎండీ వరకు ఒకే యూనిఫామ్: భట్టి



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): విద్యుదుత్పత్తిలలో తెలంగాణ స్వయం ఉత్పత్తిదారుగా ఉండటమే కాకుండా మిగులు విద్యుత్తు రాష్ట్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాభవన్‌లో దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీఎస్ఎస్‌పీడీసీఎల్) ఆపరేషన్, మెయింటెనెన్స్ సిబ్బందితో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యుత్తు ఉద్యోగులు రాష్ట్రాన్ని తమ కుటుంబం అనే భావనతో పనిచేస్తుండటంతోనే ప్రభుత్వం నిరంతరంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయగలిగిందని ఆయన తెలిపారు. "కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుదుత్పత్తి ఉండదన్నవారి దుష్ప్రచారానికి చెంపపెట్టులా మార్చిలో 17,162 మెగావాట్ల డిమాండ్ వచ్చినప్పటికీ ఒక్క క్షణం కూడా అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేయడం గర్వకారణం" అని భట్టి వ్యాఖ్యానించారు. విద్యుత్తు ఉద్యోగులు, సిబ్బందికి అభినందనలు తెలుపుతూ, వారిసేవలను గుర్తించి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యుత్తు రంగ సిబ్బందికి నిఫ్ట్‌తో ప్రత్యేకంగా డిజైన్ చేయించి యూనిఫామ్ ఇవ్వాలని ప్రభుత్వం యోచన చేస్తోందని వెల్లడించారు. "లైన్మెన్ నుంచి సీఎండీ వరకు ఒకే తరహా డ్రెస్ ఉండేలా చర్యలు తీసుకుంటాం. మనందరం ఒకే కుటుంబమన్న భావన కలిగించేందుకు ఇది ఉపయోగపడుతుంది" అని పేర్కొన్నారు. విద్యుత్తు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. మౌలిక రంగానికి అధిక ప్రాధాన్యమిచ్చి రీజినల్ రింగ్ రోడ్, మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్తు ఉద్యోగుల సమస్యల పరిష్కరించడానికి తానే ముందుంటానని చెప్పారు.

# ఇండియా అంటే.. ఇందిర!

## వాజపేయి అంతటివాడే.. అపరకాళి అన్నారు

» అమెరికా ఒత్తిడిని లెక్కచేయకుండా.. పాక్‌పై యుద్ధం చేసిన వీరనారి

» ప్రస్తుత యుద్ధం కంటే నాడు ఇందిర చేసిన యుద్ధంపైనే ఇప్పుడు చర్చ జరుగుతోంది

» రాహుల్ నాయనమ్మ చరిత్ర అలాంటిది

» బీజేపీవాళ్లకు ఆ కుటుంబంపై ఏడుపు

» ఈటల రాజేందర్ పెద్ద నసగాడు..

» అందుకే కేసీఆర్‌బయటికి పంపారు

» నేను 19 ఏళ్లకే కౌన్సిలర్‌ను అయ్యాను

» అప్పుడు ఈటల చదువుతుండొచ్చు!

» ఇప్పుడు తన పర్సనాలిటీ పెద్దదని ఫీలైతే ఎట్లా?

» నాది ఈటల లాగా హైబ్రీడ్ రాజకీయం కాదు.. నాటు రాజకీయం: తూర్పు జగ్గారెడ్డి





హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): "ఇండియా అంటేనే ఇందిర. ప్రస్తుత యుద్ధ వాతావరణంలో.. పార్టీలకు అతీతంగా అందరూ ఆమెను జ్ఞాపకం చేసుకుంటున్నారు. ఒక రకంగా.. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధం కంటే 1971లో పాకిస్థాన్‌తో ఇందిరాగాంధీ చేసిన యుద్ధం గురించే ఇప్పుడు ఎక్కువగా చర్చ జరుగుతోంది" అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి అన్నారు. 1971 యుద్ధ సమయంలో విపక్షాలు సైతం మెచ్చుకునేలా ఇందిర నిర్ణయాలు తీసుకున్నారని, ఆమె ధైర్యాన్ని యావత్ ప్రపంచం మెచ్చుకుందని తెలిపారు. అప్పట్లోనూ ఆ యుద్ధాన్ని ఆపాలని అమెరికా ఒత్తిడి చేసిందని, అయినా లెక్క చేయకుండా యుద్ధం కొనసాగించిన వీరనారి ఇందిర అని కొనియాడారు. తమ దేశ ప్రజలకు సంబంధించిన నిర్ణయంలో తలదూర్చొద్దంటూ అమెరికాకు ఇందిర స్పష్టం చేశారని, దాంతో పాక్ ప్రధాని తలవంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వాజపేయి అంతటి నాయకుడే.. పార్లమెంటు సాక్షిగా ఇందిరా గాంధీని అపరకాళితో పోల్చారని గుర్తు చేశారు. గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇందిరాగాంధీ ఏదైనా సభకు వస్తున్నారంటే.. 3 రోజుల ముందే జనం అక్కడ ఉండేవారని తెలిపారు. తన చిన్నతనంలో.. ఇంట్లోని పూజగదిలో దుర్గామాత ఫొటో పక్కన ఇందిరమ్మ ఫొటోనూ పెట్టి తన తల్లి పూజ చేసేవారని గుర్తు చేసుకున్నారు. రాహుల్‌గాంధీ నాయనమ్మ చరిత్ర అలాంటిదన్నారు. కానీ, ఇప్పటి బీజేపీ ప్రభుత్వం అమెరికా వద్దంటే పాకిస్థాన్‌తో యుద్ధాన్ని ఆపేసిందని ఎద్దేవా చేశారు. బీజేపీ వారికి రాహుల్ కుటుంబంపై ఏడుపు ఎక్కువ, చేతలు తక్కువ అని విమర్శించారు. ఈటల రాజేందర్ బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు పెద్ద నసగాడు అని, అందుకే ఆయనను కేసీఆర్ బయటికి పంపించాడని జగ్గారెడ్డి అన్నారు. "ఈటల రాజేందర్.. రండ అంటూ మాట్లాడారు. ఆ పదానికి అర్థమేంటో చెబితే.. దానికి సమాధానమిస్తాను. 19 ఏళ్లకే సంగారెడ్డి మునిసిపల్ కౌన్సిలర్‌ను అయ్యాను. అప్పుడు ఈటల రాజేందర్ చదువుకుంటూ ఉండొచ్చు. ఇప్పుడు తన పర్సనాలిటీ పెద్దదని ఫీలైతే ఎలా?" అని వ్యాఖ్యానించారు. బీజేపీలో సైతం ఈటల తన కంటే చిన్నపిల్లవాడన్నారు. తన సంగతి తెలియాలంటే కిషన్‌రెడ్డిని, వెంకయ్యనాయుడును, భగవంత్‌రెడ్డిని అడగాలని సూచించారు. ఈటల లాగా తనది హైబ్రీడ్ రాజకీయం కాదని, నాటు రకమని చెప్పారు.

## ఢిల్లీ తెలంగాణ భవన్‌లో పీవీ విగ్రహం?

» న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపాదన..

» ఢిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ ఆమోదం!



న్యూఢిల్లీ, మే 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో దివంగత మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు విగ్రహం ఏర్పాటుకు మార్గం సుగమమైనట్టు తెలిసింది. పీవీ విగ్రహం ఏర్పాటుకు న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డీఎంసీ) ప్రతిపాదన చేయగా.. ఇటీవల జరిగిన సమావేశంలో ఢిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ ఆమోదం తెలిపినట్టు సమాచారం. తెలంగాణ భవన్‌లోని ప్రతిపాదిత స్థలంలో ఏర్పాట్లపై పలు సూచనలు కూడా చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కలిపి ఒకే అధికారిక భవన సముదాయం ఉంది. ఈ ప్రాంగణంలో ఉన్న ఆంధ్ర రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం పక్కనే.. పీవీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని.. దానికి స్థలం ఇవ్వాలని కోరుతూ పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ 2024 ఏప్రిల్‌లో ఎన్‌డీఎంసీకి లేఖ రాసింది. ఎన్‌డీఎంసీ ఆ ప్రతిపాదనను ఢిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్‌కు పంపింది. దీనిపై మార్చి 27న ఢిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. సమావేశం మినిట్స్‌ను పరిశీలిస్తే.. 'తెలంగాణ భవన్‌లో పీవీ నరసింహారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ఎన్‌డీఎంసీ పంపిన ప్రతిపాదన ఆమోదించబడింది. ప్రతిపాదిత స్థలాన్ని సిద్ధం చేయాలి. రాత్రిపూట ప్రత్యేకంగా లైటింగ్ ఏర్పాటు చేయాలి" అని పేర్కొన్నట్టు వెల్లడించాయి. నిజానికి ఢిల్లీలో పీవీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, టాల్కటోరా రోడ్డుకు ఆయన పేరు పెట్టాలని కోరుతూ.. పీవీ కుటుంబ సభ్యులు 2013లో అప్పటి ప్రధాని మన్మోహన్‌కు లేఖ రాశారు. కానీ ముందుకు సాగలేదు. కేసీఆర్ సర్కారు హయాంలోనూ తెలంగాణ భవన్‌లో పీవీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కుటుంబ సభ్యులు లేఖ రాశారు. అయినా అమల్లోకి రాలేదు. ఇప్పుడు ముందడుగు పడింది. ఢిల్లీలోని అశోకా రోడ్డులో తెలంగాణ భవన్ నూతన భవనానికి స్థల పరిశీలన, నమూనాల ఖరారు పూర్తయ్యాయి. ఈ క్రమంలో పాత భవనంలో పీవీ విగ్రహ ఏర్పాటు ఏమిటనే ప్రశ్న వస్తోంది. నూతన భవన నిర్మాణ పనుల్లో భాగంగానే పీవీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కుటుంబ సభ్యులు కోరారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తామని తెలిపారు. మరోవైపు ఈ అంశానికి సంబంధించి తమకు ఎటువంటి సమాచారం లేదని తెలంగాణ భవన్ అధికారులు పేర్కొన్నారు.

## త్వరలో ఫీజు రీయింబర్స్‌మెంట్

» వెంటనే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు

» తెలంగాణ ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి

» డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సమ్మె విరమణ

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి) : పెండింగులో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలంటూ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం గత 40 రోజులుగా చేస్తున్న సమ్మెకు తెర పడింది. బకాయిలు చెల్లించకుంటే త్వరలో జరగనున్న పరీక్షలను బహిష్కరిస్తామని యాజమాన్యాలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. డిగ్రీ, పీజీ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, వెంటనే బకాయిలు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారని బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని ఆయన సోమవారం తన కార్యాలయంలో కళాశాలల యాజమాన్యాల సంఘం సభ్యులతో నిర్వహించిన సమావేశంలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతో సమ్మె విరమిస్తున్నామని సంఘం తెలిపింది. త్వరలో జరగనున్న అన్ని విశ్వవిద్యాలయాల పరీక్షల నిర్వహణకు పూర్తి సహకారం అందిస్తామని తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు.



పరిగిలో 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పక్కన స్పీకర్ ప్రసాద్


## 4 రీజినల్ క్యాన్సర్ స్క్రీనింగ్ కేంద్రాలు!

» ప్రతి జిల్లాకు క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనం: దామోదర

పరిగి, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యం పట్ల ప్రజల్లో విశ్వాసం కలిగే విధంగా వైద్యసేవల విస్తరణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులను మరిచిపోయే విధంగా ప్రభుత్వాసుపత్రులను ఆధునీకరించి, డాక్టర్లు, సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మొదటగా 100 ఆస్పత్రులను మోడల్‌గా ఎంపిక చేసి, వాటి రూపురేఖలను మార్చేందుకు బ్రాండింగ్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రెండో విడతలో అన్నీ ఆధునీకరిస్తామని చెప్పారు. 30 వేల జనాభాకు ఒక పీహెచ్‌సీ, 5 వేల జనాభాకు ఒక సబ్‌సెంటర్ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా పరిగిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల నుంచి 100 పడకల ఆస్పత్రికి అప్‌గ్రేడ్ చేసేందుకు రూ.27 కోట్లతో నిర్మించనున్న నూతన భవన నిర్మాణానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి దామోదర శంకుస్థాపన చేశారు. వికారాబాద్‌లో రూ.30 కోట్లతో నిర్మించిన 300 పడకల ప్రభుత్వాస్పత్రిని ప్రారంభించారు. అనంతరం సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో ఏడాదిలో 6,956 నర్సింగ్ అధికారుల పోస్టులు భర్తీ చేశామని, త్వరలో మరో 2,300 పైగా పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ ప్రక్రియ మరో నెలరోజుల్లో ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలో కొత్తగా నాలుగు దిశల్లో నాలుగు రీజినల్ క్యాన్సర్ స్క్రీనింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, అదే విధంగా ప్రతి జిల్లాకు క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనం సమకూర్చే విధంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. రాష్ట్రంలో హైవేలపై కొత్తగా 100 ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

# 'ఆంధ్రజ్యోతి లక్కీడ్రా' కారు విజేతకు చెక్కు అందజేత

» సైకిల్ పక్కనపెట్టి కారులో వెళ్తా: విజేత


కోటేశ్వరరావుకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పక్కన 'ఆంధ్రజ్యోతి' బీఎం హరికృష్ణ

నెల్లూరురూరల్, మే12(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' పాఠకులకు కార్ అండ్ బైక్ రేసుకు సంబంధించి రాష్ట్రస్థాయి లక్కీడ్రాలో కారును గెలుచుకున్న ఏపీలోని నెల్లూరు నగరవాసి జొన్నాదుల కోటేశ్వరరావుకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం చెక్కు అందజేశారు. గత నెల 9న విజయవాడలో జరిగిన బంపర్‌డ్రాలో కోటేశ్వరరావును అదృష్టం వరించింది. రైల్వే శాఖలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఆయన 20 ఏళ్లుగా 'ఆంధ్రజ్యోతి' పాఠకుడిగా ఉంటున్నారు. 'కార్ అండ్ బైక్' రేసులో రాష్ట్రస్థాయి విజేతగా నిలిచిన కోటేశ్వరరావు కారును గెలుచుకున్నారు. నెల్లూరులోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి పాల్గొని కోటేశ్వరరావుకు కారుకు సంబంధించి నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 'ఆంధ్రజ్యోతి' నాడు, నేడు ప్రజల పక్షాన నిలిచే నిజాయితీ గల సంస్థ అని కొనియాడారు. అధికార పక్షమా, ప్రతిపక్షమా అన్న తేడా లేకుండా ఎవరు తప్పులు చేసినా విమర్శించగల పాత్రికేయ లక్షణం ఈ యాజమాన్యం సొంతమని తెలిపారు. సమాజం పట్ల కూడా తన బాధ్యతను గుర్తెరిగి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కారును గెలుచుకున్న కోటేశ్వరరావును అభినందించారు.

**'ఆంధ్రజ్యోతి' రోజూ చదువుతా: కోటేశ్వరరావు**

'కొన్నేళ్లగా నేను 'ఆంధ్రజ్యోతి' చదువుతున్నా. ఈ పత్రిక చదవకపోతే సమాజంలో ఏం జరుగుతోందో వాస్తవాలు తెలియవు. 'ఆంధ్రజ్యోతి'లో నిజాయితీతో కూడిన వార్తలుంటాయి. రైల్వే ఉద్యోగిగా ఉన్న రోజుల్లో ఎక్కడున్నా ఈ పత్రికను చదివేవాడిని. నా జీవితం ఇప్పటి వరకు సైకిల్‌తో సాగింది. ఇక నుంచి సైకిల్‌ను పక్కన పెట్టేసి 'ఆంధ్రజ్యోతి' ఇచ్చిన కారులో నేను, నా కుటుంబం వెళ్తాం. ఈసంతోషం మరువరానిది' అంటూ కోటేశ్వరరావు ఆనందం వ్యక్తం చేశారు.

## గిరిజనుడిని హత్య చేసిన మావోయిస్టులు

» ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఘటన

చర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్‌లోని మారేడుబాకలో సోమవారం మావోయిస్టులు దారుణానికి పాల్పడ్డారు. ఆ గ్రామానికి చెందిన బండారి నాగ(45)ని కత్తులతో పొడిచి హత్య చేశారు. ఈ హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. గత ఏడాది నాగ తమ్ముడు బండారి తిరుపతిని కూడా మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య చేశారు. ఇదిలా ఉండగా ఈ నెల 8న కర్రెగుట్టల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 19మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇందులో ఇప్పటి వరకు 9 మందిని గుర్తించి వారి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

## రుణమాఫీ కాని రైతుల సమస్యలు పరిష్కరించండి

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలులో కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకోవడం వల్ల 40% మంది రైతులకు రుణ మాఫీ కాలేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నరసింహం పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో మంత్రి తుమ్మలను వారు కలిసి రుణమాఫీ కాని రైతుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు 110 దేశాల నుంచి వచ్చిన సుందరాంగులకు నీరా కేఫ్‌లో నీరా తాపి, తాటి ముంజలు తినిపించడం రాష్ట్ర గీత పనివారికి దక్కిన గౌరవం, గుర్తింపుగా భావిస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ పేర్కొన్నారు.

## తుది దశకు కాళేశ్వరం కమిషన్ విచారణ

» 15న రాష్ట్రానికి జస్టిస్ పీసీ ఘోష్ రాక

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలపై ఏర్పాటైన 'కాళేశ్వరం కమిషన్' విచారణ తుది అంకానికి చేరుకుంది. కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ 15న రాష్ట్రానికి రానున్నారు. అయితే, తుది విచారణకు ఎవరెవరిని పిలవాలన్న విషయమై 16న నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. ఇప్పటికే జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ), విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తు నివేదికలు కాళేశ్వరం కమిషన్ వద్దకు చేరుకున్నాయి. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లను విచారణకు పిలుస్తామని ఇప్పటికే కమిషన్ సంకేతాలిచ్చింది. ఈనెల నాలుగోవారంలో రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ తన నివేదికను సమర్పిస్తారని సమాచారం.

## కరాచీ బేకరీపై దాడితో మాకు సంబంధం లేదు

» బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

ఇటీవల కరాచీ బేకరీపై జరిగిన దాడికి బీజేపీకి సంబంధం లేదని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ వాళ్లే దాడి చేశారని మంత్రి సీతక్క చేసిన ఆరోపణలను ఖండించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, బీజేపీని బద్నాం చేసేలా దుష్ప్రచారం చేయడం సబబు కాదని హితవు పలికారు. ఇళ్లపై, దుకాణాలపై దాడులు చేసే సంస్కృతి తమది కాదని, కాంగ్రెస్ పార్టీనే అలాంటి చర్యలు చేస్తుందని ఎద్దేవా చేశారు. అవగాహన లేకుండా మాట్లాడొద్దని, తమ పార్టీ నాయకుల ఇళ్లపై దాడులు చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.

## ఉగ్ర మూలాలను పెకలించి వేయాలి: నారాయణ

హుజూర్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద మూలాలను కూకటివేళ్లతో పెకలించి వేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. పాకిస్థాన్‌లో ఉన్న ముస్లింలందరూ ఉగ్రవాదులు కాదని, మతాన్ని హింసకు వాడుకోవడం ఆటవిక సంప్రదాయమని చెప్పారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో ఎన్నికలప్పుడే ఉగ్రవాదులు దాడులు చేసి అమాయకులను బలి తీసుకోవడం, ఆ ఘటనలను బీజేపీ వాడుకోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఉగ్రవాద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం మోదీ ప్రభుత్వానికి ఇష్టం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో కమ్యూనిస్టుల మద్దతుఉన్న పక్షమే అధికారంలోకి వస్తుందన్నారు. ఎన్టీఆర్ నాటి నుంచి చంద్రబాబు, వైఎస్ఆర్, కేసీఆర్, రేవంత్‌రెడ్డి వరకు కమ్యూనిస్టుల పాత్రను గుర్తించి పొత్తులు పెట్టుకున్నారన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు టేబుళ్ల సరఫరా టెండర్ల రద్దు

» గుడ్లు, కందిపప్పు, 'ఎగ్ ర్యాక్' సరఫరా టెండర్లలోనూ అధికారుల నిర్లక్ష్యం

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు టేబుళ్ల సరఫరా కోసం మహిళా శిశు సంక్షేమ శాఖలో ఆధ్వర్యంలో జారీ చేసిన టెండర్లను సోమవారం రద్దు చేశారు. రాష్ట్రంలో 35,781 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఒక్కో టేబుల్‌కు ప్రభుత్వం రూ.4 వేల చొప్పున ధర నిర్ణయించగా రూ.28 కోట్ల అంచనా వ్యయంతో 70 వేల టేబుళ్ల సరఫరాకు అధికారులు గత నెల 23న ప్రకటన జారీ చేశారు. అయితే, ప్రకటనలోని నిబంధనలను నాలుగు సార్లు మార్పు చేశారు. ఈ నెల 9న ఒంటి గంట వరకు ఇ- ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కొటేషన్లు కోరారు. అదే రోజున టెక్నికల్ బిడ్ తెరిచి.. ఫైనాన్షియల్ బిడ్‌ను సోమవారానికి వాయిదా వేశారు. సోమవారం ఉదయం ఫైనాన్షియల్ బిడ్ ఓపెన్ చేస్తారని గుత్తేదారులు కమిషనర్ కార్యాలయానికి చేరుకున్న తర్వాత వాయిదా వేసినట్లు ప్రకటించారు. అనంతరం సాంకేతిక ఇబ్బందుల నేపథ్యంలో టెండర్‌ను రద్దు చేసినట్లు కమిషనర్ క్రాంతి వెస్లీ 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. అయితే.. టెక్నికల్ బిడ్‌లో ఎవరు ఎంత కోట్ చేశారనేది అధికారులకు ముందే తెలియడంతో వాళ్లకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు టెండర్ దక్కలేదనే ఉద్దేశంతోనే రద్దు చేశారని తెలంగాణ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అసోషియేషన్ నాయకులు విలేకరుల సమావేశంలో ఆరోపించారు.

**సరైన మార్గదర్శకాల్లో విఫలం**

అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లను నిల్వ చేసే ర్యాక్‌ల సరఫరా కోసం రూ.12 కోట్ల అంచనాతో గత నెల 23న ప్రకటన జారీచేశారు. అందులోనూ రెండుసార్లు టెండర్ నిబంధనలు మార్చారు. సోమవారమే టెండర్ తెరవాల్సి ఉండగా.. ఈ నెల 26 వరకు వాయిదా వేశారు. అలాగే, గుడ్లు, కంది పప్పు సరఫరా కోసం టెండర్ల నిర్వహణలోనూ సరైన మార్గదర్శకాలు రూపొందించడంలో ఆ శాఖ అధికారులు విఫలమయ్యారు.

## సమాచార హక్కు..

# నలుగురు కమిషనర్ల నియామకం

**పీవీ శ్రీనివాస్,అయోధ్యరెడ్డి, భూపాల్, పర్వీన్‌లకు గవర్నర్ ఆమోదముద్ర.. వీరి పదవీ కాలం మూడేళ్లు**

» హరిప్రసాద్, కేఎల్ఎన్, వైష్ణవి పేర్లను తిరస్కరించిన రాష్ట్ర గవర్నర్

» రాములు స్థానంలో భూపాల్‌కు చాన్స్

» గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ.. ఆ వెంటనే ఉత్తర్వుల విడుదల


పీవీ శ్రీనివాస్


అయోధ్యరెడ్డి


భూపాల్


పర్వీన్

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాలకు సంబంధించిన నలుగురిని రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లు(ఎస్ఐసీ)గా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నియమించారు. జర్నలిస్టులు పీవీ శ్రీనివాసరావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, న్యాయవాదులు దేశాల భూపాల్, మొహిసినా పర్వీన్‌లను ఎస్ఐసీలుగా నియమించేందుకు సోమవారం ఆమోదముద్ర వేశారు. ఆ వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు కమిషనర్ల నియామక ఉత్తర్వులను జారీచేశారు. పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు లేదా వయసు 65 ఏళ్లు నిండే వరకు వారు రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లుగా కొనసాగుతారు. ఇప్పటికే రాష్ట్ర సమాచార హక్కు ప్రధాన కమిషనర్‌గా ఐఎఫ్ఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డిని నియమించిన విషయం తెలిసిందే. ఆర్‌టీఐ రాష్ట్ర కమిషనర్లుగా ఏడుగురిని నియమించాలని ప్రభుత్వం మొదట్లో నిర్ణయించింది. పీవీ శ్రీనివాసరావు, కప్పర హరిప్రసాద్, వైష్ణవి, కేఎల్ఎన్ ప్రసాద్, బోరెడ్డి అయోధ్యరెడ్డి, రాములు, మొహిసినా పర్వీన్.. ఇలా ఏడుగురి పేర్లను ప్రతిపాదిస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఫైలును పంపించింది. ఇందులో కొంత మందిపై గవర్నర్‌కు ఫిర్యాదులు రావడంతో.. ప్రభుత్వం నలుగురి పేర్లను ఖరారు చేసింది. ముగ్గురిని గవర్నర్ తిర్కరించగా.. ఒకరి స్థానంలో మరొకరికి అవకాశం కల్పించారు. కప్పర హరిప్రసాద్ తన దరఖాస్తులో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) ప్రచార కార్యదర్శి అని పేర్కొనడంతో ఆయనను తిరస్కరించినట్లు తెలిసింది. సాధారణంగా న్యాయశాస్త్రం, శాస్త్ర సాంకేతికం, సామాజిక సేవ, జర్నలిజం, మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో నిష్ణాతులను ఆర్‌టీఐ రాష్ట్ర కమిషనర్లుగా నియమిస్తారు. కప్పర హరిప్రసాద్ తాను కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అని పేర్కొనడంతో.. పార్టీ అనుబంధ వ్యక్తిగా భావించి, ఆయన పేరును తిరస్కరించినట్లు సమాచారం. వైష్ణవికి సామాజిక సేవానేపథ్యం లేనందున తిరస్కరించారు. కేఎల్ఎన్ ప్రసాద్ కోదాడలో ఎన్నికల్లో పోటీ చేశారని, అందుకే తిరస్కరించారని రాజ్‌భవన్ వర్గాల ద్వారా తెలిసింది. న్యాయవాది రాములు పేరు పరిశీలనకు వచ్చినా.. ఆయన స్థానంలో మరో న్యాయవాది, కొడంగల్‌కు చెందిన దేశాల భూపాల్‌కు అవకాశం కల్పించారు. ఇలా ముగ్గురి పేర్లను రాజ్‌భవన్ తిరస్కరించగా.. రాములు స్థానంలో భూపాల్‌కు అవకాశమిచ్చింది. వాస్తవానికి ఆర్‌టీఐ కమిషనర్ల నియామకానికి సంబంధించిన ఫైలును పక్షం రోజుల కిందటే ప్రభుత్వం రాజ్‌భవన్‌కు పంపించింది. ఫిర్యాదుల నేపథ్యంలో నియామకాల్లో ఆలస్యం జరిగింది. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశంలోని యుద్ధ వాతావరణ నేపథ్యంలో రాష్ట్రంలో శాంతి భద్రత పరిస్థితిని గవర్నర్‌కు వివరించారు. ఇదే సందర్భంలో ఆర్‌టీఐ కమిషనర్ల గురించి చర్చించారు. సీఎం రేవంత్‌రెడ్డి వివరణ ఇచ్చిన కొంత సేపటికే.. ఆర్‌టీఐ కమిషనర్ల నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి.

# ఎంపీ ఈటల ఇంటి వద్ద ఉద్రిక్తత

**సీఎంపై అనుచిత వ్యాఖ్యలతో ఆయన ఇంటి ముట్టడికి యూత్ కాంగ్రెస్ పిలుపు**

» పలువురు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

» కొట్లాడితే ధీరుడితోనే కొట్లాడాలి

» కార్యకర్తల సమావేశంలో ఈటల ఘాటు వ్యాఖ్యలు


యూత్ కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మేడ్చల్ ప్రతినిధి, హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఇంటి వద్ద సోమవారం ఉదయం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రెండు రోజుల క్రితం బాచుపల్లిలో సీఎంపై ఈటల చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం ఆయన ఇంటి ముట్టడికి యూత్ కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో తెల్లవారుజామునే బీజేపీ, బీజేవైఎం శ్రేణులు పెద్దఎత్తున మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పూడూరు పరిధి ఓఆర్ఆర్ పక్కన ఉన్న ఈటల ఇంటి వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం పోలీసులు పలువురు యూత్‌కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుని సమీప పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎంపీ ఈటల... సీఎం రేవంత్‌రెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'కొట్లాడితే ధీరుడితో కొట్లాడాలి.. రండలతో ఏం కొట్లాడుతాం.. రేవంత్ రెడ్డి సీఎం కాకముందే తడిబట్టలతో భాగ్యలక్ష్మి ఆలయం వద్దకు పిలిస్తే ధీరుడనుకున్న... కాని ఇలా ఏడుస్తడు అనుకోలేదు.. ఏడ్చేవాళ్లను ఏం అంటారో మీ అందరికీ తెలుసు' అని ఈటల వ్యాఖ్యానించారు. కాగా ఈటల.. లెఫ్ట్ వింగ్ నుంచి బీజేపీ రైట్‌వింగ్‌లోకి వెళ్లే సరికి మెదడు చెడినట్టుందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డిని తిడితే బీజేపీలో ఆయనకు పదవులొస్తాయని భ్రమపడుతున్నారని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టానుసారం మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఊరుకోరంటూ ఎంపీ ఈటల రాజేందర్‌ను టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ త్వరలోనే మూడు ముక్కలు, నాలుగు చెక్కలు కాబోతుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. పార్టీ నుంచి కవిత, హరీశ్‌రావులను బయటికి పంపాలని కేటీఆర్ చూస్తున్నాడన్నారు.

## ధాన్యం తూర్పార పడుతూ.. వడదెబ్బతో కుప్ప కూలిన అన్నదాత

» కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశిపైనే మృతి

» మహబూబాబాద్ జిల్లా పోచంపల్లిలో ఘటన


గుగులోతు కిషన్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): పంటను అమ్ముకుందామని కొనుగోలు కేంద్రానికి వెళ్లిన రైతు వడదెబ్బతో కుప్పకూలాడు. ఐదు రోజులైనా పంటను కొనుగోలు చేయకపోవడంతో అక్కడే పడిగాపులు కాస్తూ ఎండదెబ్బతో ధాన్యం రాశిపైనే మృతిచెందాడు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచంపల్లిలో సోమవారం ఈ ఘటన జరిగింది. గంట్లకుంట గ్రామ శివారు రామోజీతండాకు చెందిన (60) రెండున్నర ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. ఈ నెల 8న వరి పంటను కోసి ధాన్యాన్ని పోచంపల్లిలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో పోశాడు. అయితే, తేమ ఉందని ఆదివారం వరకు కొనుగోలు చేయలేదు. సోమవారం ఉదయం ధాన్యాన్ని తూర్పార పడుతున్న కిషన్ ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురై మృతి చెందాడు.

**అందాల పోటీల్లో మునిగితేలుతున్న సీఎం: కేటీఆర్**

వడదెబ్బకు తాళలేక రైతులు ధాన్యం కుప్పలపై చనిపోతుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి అందాల పోటీల్లో మునిగితేలుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం వర్షాలతో కళ్లముందే కొట్టుకుపోవడం, మరోవైపు మండుతున్న ఎండలను తట్టుకోలేక రైతులు బలవుతున్నారని పేర్కొన్నారు. పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టి, రుణమాఫీ పేరిట మోసం చేసి, చివరికి పంటను కూడా కొనకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వడదెబ్బతో చనిపోయిన కిషన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎంకు సోయి ఉంటే కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

**ములుగు కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా**

ములుగు కలెక్టరేట్ ఎదుట మొక్కజొన్న రైతులు సోమవారం ధర్నా చేశారు. వెంకటాపురం, వాజేడు మండలాల్లో పలు కంపెనీలతో ఒప్పందం చేసుకుని మొక్కజొన్న సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. పరిహారం కోసం రెండు నెలలుగా ఆందోళనలు చేస్తున్నారు. కేంద్ర స్థాయిలో సర్వే చేయించిన ప్రభుత్వం.. పరిహారం విషయాన్ని తేల్చకపోవడంతో రైతులు మళ్లీ రోడ్డెక్కారు. ఎకరాకు రూ.లక్షన్నర పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ సంపత్‌రావుకు వినతి పత్రం అందజేశారు.

**వడదెబ్బతో ముగ్గురి మృతి**

వడదెబ్బతో సోమవారం ముగ్గురు మృతి చెందారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ శివారులోని డబుల్‌బెడ్‌రూం కాలనీలో నివాసముంటున్న వెంగళి మల్లేశ్ (54), మాసాయిపేట మండలం పోతాన్‌పల్లి గ్రామానికి చెందిన దుర్గం బాలయ్య (44), జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వడ్డిచర్లకు చెందిన గండి పోచెల్లమ్మ(68) ఎండదెబ్బకు అస్వస్థతకు గురై చనిపోయారు.

## భూమి నిస్సారం.. పునాది బలహీనం

» సీతారామ ప్రాజెక్టు పియర్ కూలడానికి కారణమిదేనని నిపుణుల కమిటీ నివేదిక

» గైడ్ వాల్స్.. ప్రొటెక్షన్ పనులు చేపట్టాలని సూచన

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం కాలువకు మద్దతుగా నిర్మించిన పియర్ కూలి పోవడానికి దాని పునాదులు బలహీనంగా ఉన్నాయని, అక్కడ భూమి నిస్సారంగా ఉండటమే కారణమని నిపుణుల కమిటీ తేల్చింది. ఈ పథకం నాలుగో ప్యాకేజీలో ములకలపల్లి మండలం పూసుగూడెం పరిధిలో ప్రధాన కాలువ 48.309 కిలో మీటర్ వద్ద సూపర్ పాసేజ్‌కు మద్దతుగా నిర్మించిన పియర్ (పిల్లర్) కూలిపోయిన ఘటన గత నెలలో వెలుగు చూసింది. దీని విషయమై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణంలో నాణ్యత పాటించరా..? 'కట్టుడు.. కూలుడేనా..?' అంటూ మండి పడ్డారు. ఈ నేపథ్యంలో పియర్ కూలిపోవడానికి కారణాలపై విచారణకు సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) చీఫ్ ఇంజినీర్ వి. మోహన్ కుమార్ నేతృత్వంలో నలుగురు అధికారులతో ఈఎన్‌సీ (జనరల్) జి. అనిల్ కుమార్ కమిటీని నియమించారు. ఈ ప్రాజెక్టులోని అన్ని కాంపోనెంట్ల నిర్మాణ ధృడత్వంపై నివేదిక అందజేయాలని ఆ కమిటీని ఆదేశించారు. దీంతో మోహన్ కుమార్ కమిటీ తొలుత ప్రమాదం జరిగిన పియర్‌ను పరిశీలించి.. అది కూలిపోవడానికి అక్కడ భూమి బలహీనం (నిస్సారం)గా ఉండటంతోపాటు పునాదులూ సరిగా లేకపోవడమే కారణమని గుర్తించింది. మున్ముందు ఇటువంటి ఘటనలు జరుగకుండా కన్సల్టెంట్ సలహా మేరకు ప్రత్యేక భూభౌతిక పరీక్షలు చేపట్టాలని సిఫారసు చేసింది. అవుట్‌లెట్ వైపు వింగ్ వాలు పక్కన గల గట్టు క్షీణించిందని, ఏ సమయంలోనైనా కూలిపోవచ్చునని పేర్కొంది. ఇప్పటికే పనులు దాదాపు పూర్తయినందున గైడ్ వాల్‌లు, ప్రొటెక్షన్ పనులు చేపట్టాలని సూచించింది. పియర్ పునరుద్ధరణకు డిజైన్లు అందజేయాలని సూచించింది. పియర్‌కు ఎగువన, దిగువన వర్షపు నీరు కిందకెళ్లడంతో పునాది బలహీన పడిందని పేర్కొంది. గత ఫిబ్రవరి 28 నుంచి మార్చి 15 వరకూ ప్రధాన కాలువ పూర్తి సామర్థ్యంతో నీరు ప్రవహించడం వల్ల పియర్ ఎడమ వైపు కూలిందని మోహన్ కుమార్ కమిటీ పేర్కొంది.

## ఏసీబీ అదుపులో సూర్యాపేట డీఎస్పీ, పట్టణ సీఐ

» ఓ కేసులో రూ.25 లక్షలు ఇవ్వాలని ఓ స్కానింగ్ సెంటర్ వైద్యుడికి డిమాండ్

» ఏసీబీకి వైద్యుడి ఫిర్యాదు.. కేసు నమోదు


డీఎస్పీ పార్థసారథి, సీఐ వీరరాఘవులు

సూర్యాపేటక్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు స్కానింగ్ సెంటర్ వైద్యుడిపై నమోదైన కేసులో రిమాండ్‌కు తరలించకుండా ఉండేందుకు నగదు డిమాండ్ చేసిన సూర్యాపేట డీఎస్పీ, పట్టణ ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. సూర్యాపేటలోని ఓ ప్రైవేటు స్కానింగ్ సెంటర్‌తోపాటు వైద్యుడిపై సూర్యాపేట ఐఎంఏ ప్రతినిధుల ఫిర్యాదుతో ఏప్రిల్ 29న పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో రిమాండ్‌కు పంపకుండా ఉండాలంటే డీఎస్పీ పార్థసారథి, పట్టణ సీఐ వీరరాఘవులు రూ.25లక్షలు ఇవ్వాలని వైద్యుడిని డిమాండ్ చేశారు. దీంతో ఆ వైద్యుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. డబ్బులు అడిగినట్టు ఆధారాలు చూపడంతో డీఎస్పీ, సీఐలపై కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నారు. వారిని మంగళవారం కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చందర్ తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

» దుబ్బాకలో ఓ చేనేత కార్మికుడి బలవన్మరణం

జఫర్‌గఢ్/గూడూరు/దుబ్బాక, మే 12 (ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చలేని దుస్థితిలో ఇద్దరు రైతులు, ఓ చేనేత కార్మికుడు సోమవారం ఆత్మహత్య పాల్పడ్డారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్‌కు చెందిన కాలువ రాజు(40) మూడెకరాల భూమిలో పంటల సాగు కోసం అప్పులు చేశాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు రాజును ప్రశ్నించారు. మనస్తాపం చెందిన రాజు పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పొనుగోడు గ్రామానికి చెందిన బానోత్ హచ్య (50) అప్పులు తెచ్చి మిర్చి, వరి పంటలను సాగు చేయగా దిగుబడి సరిగ్గా రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక పొలంలో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మరో ఘటనలో.. దుబ్బాకకు చెందిన చేనేత కార్మికుడు గొరిటాల బాల్‌రాజ్(55) చేనేత సహకార సంఘంలోను, మాస్టర్ వీవర్ వద్ద పని చేశాడు. అయితే, ఇటీవల ఉపాధి లేకపోవడం, అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో సోమవారం ఇంట్లో ఉరేసుకున్నాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

భారత్-పాకిస్థాన్‌ల మధ్య నాలుగు రోజులపాటు సాగిన సాయుధ సంఘర్షణ పూర్తిస్థాయి యుద్ధంగా మారకముందే ముగిసింది. ఘర్షణ ఆగిపోవడం, హింసకు తెరపడడం సంతోషమే అయినా అది జరిగిన తీరు మాత్రం తీవ్ర చర్చకు, అనుమానాలకు దారి తీసింది. పాక్ ఉగ్రవాదులు, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఏప్రిల్ 22న పహల్గాంలో భారత టూరిస్టులను వారి భార్యాబిడ్డల ముందు దారుణంగా కాల్చిచంపిన సంఘటన ప్రపంచాన్ని కుదిపేసింది. లష్కరే తోయిబా నుంచి విడివడిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ అనే నిషేధిత సంస్థకు చెందిన ఈ టెర్రరిస్టులకు పాక్ అన్ని రకాల సహాయ సహకారాలు అందించినట్లు భారత్ ప్రాథమిక దర్యాప్తులో బయటపడింది. దీనిపై అట్టుడికిన భారత్ మే 7న పాకిస్థాన్, ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై లాంగ్‌రేంజ్ ఆయుధాలతో దాడులు చేసింది. దానికి పాక్ ఊరుకోకుండా ఎదురుదాడికి దిగడంతో భారత్ కూడా స్పందించి గట్టిగా తిప్పికొట్టింది. భారత్ దాడుల్లో పాక్ సైన్యానికి బలమైన ఎదురుదెబ్బలు తగలడంతో పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్ అణ్వస్త్ర నేషనల్ కమాండ్ అథారిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఇది అణు యుద్ధానికి దారితీస్తుందనే ఆందోళన మొదలైంది.

ఆ దశలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నుంచి అకస్మాత్తుగా కాల్పుల విరమణ ప్రకటన వెలువడింది. ఆ తర్వాత కాసేపటికి కాల్పుల విరమణను ధ్రువీకరిస్తూ భారత్ కూడా ప్రకటన విడుదల చేసింది. "నిర్దేశిత లక్ష్యాలేవీ సాధించకుండా, పాక్ నుంచి ఎలాంటి హామీలూ పొందకుండా కాల్పుల విరమణకు అంగీకరించడం ఏమిటి? అది కూడా ట్రంప్ దీనిని ప్రకటించడం ఏమిటి?" అంటూ వివిధ వర్గాల నుంచి వచ్చిన ప్రశ్నలు ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. కొందరు బీజేపీ మద్దతు దారులు సైతం ఈ విషయంలో మోదీ ప్రభుత్వాన్ని విమర్శించారు. పైగా ఒప్పందాన్ని ఉల్లంఘించి పాక్ రెండు గంటల్లోనే భారత్‌పై దాడికి దిగడంతో ఈ విమర్శలు మరింత తీవ్రమయ్యాయి. చివరికి కాల్పులు

## యుద్ధం, శాంతి...

ఆగిపోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తోను, పాక్ ప్రధాని షరీఫ్‌తోను అమెరికా విదేశాంగ మంత్రి రూబియో గత శుక్రవారం చర్చలు జరిపారు. దీంతో కాల్పుల విరమణ కోసం అమెరికా ప్రయత్నాలు చేస్తోందని అందరూ భావించారు. అయితే ఆ తర్వాత కాసేపటికే అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ భారత్, పాక్ వివాదంతో అమెరికాకు సంబంధం లేదని, తాము అందులో జోక్యం చేసుకోబోమని ప్రకటించారు. ఇది జరిగిన కొన్ని గంటల్లోనే తమ మధ్యవర్తిత్వం వల్ల రెండు దేశాలూ కాల్పుల విరమణకు అంగీకరించినట్లు శనివారం ట్రంప్ ప్రకటన వచ్చింది. 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమలులోకి వచ్చిందని భారత్ చెప్పిన కాసేపటికే పాక్ ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. దీంతో ఏం జరుగుతోందనే ఆందోళన అందరిలో కలిగింది. కానీ తుదకు అన్నీ సర్దుకున్నాయి.

ఘోరమైన ఉగ్రవాద దాడి మనస్సుల్ని కాలుస్తున్నప్పుడు కాల్పుల విరమణ అందరికీ సంతృప్తి కలిగించకపోవచ్చు. కానీ ఈ యుద్ధం ద్వారా భారత్ కొన్ని లక్ష్యాలను నెరవేర్చుకుందనే చెప్పాలి. తొలిరోజు దాడుల్లోనే పాక్‌లోని అనేక ఉగ్రవాద శిబిరాల్ని, వారి మౌలిక సదుపాయాల్ని భారత్ ధ్వంసం చేసింది. పలువురు కీలకమైన ఉగ్రవాదుల్ని మట్టుబెట్టింది. అలాగే అణ్వస్త్ర దాడి చేస్తామనే బెదిరింపుల్ని లెక్క చేయబోమని, పాక్ మరోసారి ఉగ్రవాద దాడికి పాల్పడితే యుద్ధమే మా సమాధానమని పాక్‌కే కాదు, ప్రపంచానికి కూడా గట్టి సందేశం ఇచ్చింది. పుల్వామా ఉగ్రదాడి తర్వాత జరిగిన బాలాకోట్ దాడులు ఆరేళ్లపాటు పాక్ భారీ ఉగ్రదాడులకు పాల్పడకుండా నిరోధించగలిగాయి. ఇప్పుడు భారత్ మరింత తీవ్రంగా స్పందించడంతో ఉగ్రవాదాన్ని ప్రేరేపించే విషయంలో భవిష్యత్తులో పాక్ ఒకటికి పదిసార్లు ఆలోచించుకోక తప్పదు. పాక్ యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడినా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో వాటిని కూల్చడం ద్వారా భారత్ తన సత్తా చాటింది. భారత్ కూడా కొన్ని యుద్ధ విమానాలను కోల్పోయినట్లు వార్తలు వస్తున్నప్పటికీ యుద్ధంలో కొన్ని నష్టాలు సర్వసాధారణమే.

ఏ యుద్ధమైనా శాంతితోనే ముగియాలి. ఇది కూడా అంతే! యుద్ధం చేసే సైనికుడికే శాంతి విలువ తెలుస్తుంది. "మంచి యుద్ధమూ, చెడు శాంతీ ప్రపంచంలో లేవు" అన్నాడు బెంజమిన్ ఫ్రాంక్లిన్. గతంలో దీనిని చెడు యుద్ధంగా భావించిన బీజేపీ వ్యతిరేకులు తాజా కాల్పుల విరమణ మంచిది కాదనడం, గతంలో ఇది మంచి యుద్ధమన్న బీజేపీ మద్దతుదారులు ఇప్పుడు కాల్పుల విరమణ మంచిదేననడం మాత్రం ఇందులో ఓ వైచిత్రి.

## ఈ పోటీలు ఫక్తు వ్యాపారం!

మిస్ వరల్డ్ 72వ అందాల పోటీలు హైదరాబాద్ నగరంలో జరుగుతున్నాయి. మన దేశంలో ఇదివరకు 1996లో, 2024లో ఈ పోటీలు నిర్వహించారు. ఇది ముచ్చటగా మూడోసారి.

ప్రపంచవ్యాప్తంగా ఇంతవరకు జరిగిన అందాల పోటీలను పరిశీలిస్తే వీటి వెనుక పెట్టుబడిదారీ మార్కెట్ ప్రయోజనాలు ఎలా పనిచేస్తాయో అర్థమవుతుంది. అందాల సంస్కృతిని స్త్రీలపై రుద్దటం ద్వారా ఆయా దేశాల్లో సౌందర్య సాధనాలకు సంబంధించిన మార్కెట్‌ను పెంచటమే ఈ పోటీల లక్ష్యం. ఇదే విధంగా పలు కార్పొరేట్ సంస్థలు దక్షిణాఫ్రికా, లాటిన్ అమెరికా, మెక్సికో దేశాలలో లాభాల పంట పండించుకున్నాయి. వెనిజులా, జమైకా, ఫిలిప్పీన్స్ లాంటి దేశాలైతే అందాల సుందరులను ఉత్పత్తి చేసే పరిశ్రమలుగా మారిపోయాయి. అందాల పోటీల్లో పలు కిరీటాలు దక్కించుకున్న మన దేశం కూడా ఈ వ్యాపారానికి ముఖ్యమైన గమ్యంగా మారింది.

ఈ పెట్టుబడిదారులు ఏ దేశాల్లో ఐతే వ్యాపారాన్ని విస్తరించాలని భావిస్తారో ఆ దేశాల స్త్రీలే అందాలరాణులుగా ఎంపికై కిరీటాలు దక్కించుకుంటారు. ఈ కారణం వల్లనే అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాల కంటే వర్ధమాన దేశాలే ఎక్కువగా అందాల కిరీటాలను గెలుచుకుంటాయి. ఎందుకంటే, పాశ్చాత్య ప్రపంచంలో సౌందర్య సాధనాల వినియోగం ఇప్పటికే గరిష్ఠ స్థాయికి చేరుకుంది. ఈ దేశాలలో సౌందర్య, చర్మ సంరక్షణ ఉత్పత్తులు, బ్రాండ్ల మార్కెట్ ఇక పెద్దగా పెరిగేందుకు ఆస్కారం లేదు. ఉదాహరణకి– ప్రపంచానికే ఫ్యాషన్ రాజధానిగా పేరున్న ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగరంలో ఇప్పటివరకు ఇద్దరు మహిళలు మాత్రమే మిస్ యూనివర్స్ కిరీటాన్ని పొందారు. ఫ్యాషన్ ప్రపంచాన్నే శాసించే యూరప్, అమెరికా దేశాల మహిళలు చాలా తక్కువ సార్లు కిరీటాలు గెలుచుకున్నారు. దీని అర్థం న్యాయ నిర్ణేతలకు ఆ దేశాల వారు అందంగా కనిపించటం లేదని కాదు కదా! వెనిజులా దేశం ప్రపంచ సుందరి పోటీలలో ఏడుసార్లు విజేతగా నిలిచింది. కానీ 2013 తర్వాత వెనిజులాలో రాజకీయ సంక్షోభం ముదిరింది. ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమయింది. సౌందర్య సాధనాల పరిశ్రమ పూర్తిగా దెబ్బతిన్నది. అందుకే– ఆ దేశం 2013లోనే చివరిసారి అందాల కిరీటాన్ని గెలుచుకున్నది!




మన దేశం విషయానికే వస్తే– 1992 వరకు భారతదేశంలో అందాల సుందరీమణులే లేరు! 1990లో సరళీకృత ఆర్థిక విధానాల తర్వాత దేశంలో బహుళ జాతి కంపెనీలకు ప్రవేశం మొదలైంది. ఆ కంపెనీలు ఎక్కడ ఆదేశిస్తే అందాల కిరీటాలు అక్కడికే తరలివెళ్తాయి. అక్కడికే అందాల పోటీల వేదికలు కూడా వెళ్తాయి. ఇందులో భాగంగానే 90వ దశకంలో ఇండియాలో అందాల పోటీలకు తెరలేచింది. అప్పటి నుంచి భారతీయ వనితలు వరుసగా కిరీటాలు దక్కించుకున్నారు. మార్కెట్ శక్తుల ప్రయోజనాలకు కొమ్ము కాసే పాలకవర్గాలు దీనిని భారత స్త్రీలందరూ గర్వించదగ్గ విషయంగా ప్రచారం చేశాయి.

ఇప్పుడు మన దేశం అంతర్జాతీయ కాస్మొటిక్ బ్రాండ్లకు సారవంతమైన మార్కెట్. వారి కాస్మోటిక్ ఉత్పత్తుల అమ్మకాలు పెంచుకోవడానికి ఇక్కడి యువ జనాభా గణాంకాలు సరిగ్గా సరిపోతాయి. ప్రపంచ సౌందర్య సాధనాల మార్కెట్ పరిమాణం 2019లో 380.2 బిలియన్ డాలర్లుగా ఉంది. 2027 నాటికి 463.5 బిలియన్ల డాలర్లకు చేరుకుంటుందని ఒక అంచనా. భారత దేశ సౌందర్య సాధనాల పరిశ్రమ మార్కెట్ విలువ డిసెంబర్ 2020లో 15 బిలియన్ డాలర్లకు మించి ఉంది. 2022 నుంచి ఇక్కడి సౌందర్య రంగం ఏటా 2.8శాతం వృద్ధి చెందుతున్నదని బహుళ జాతి కంపెనీల అంచనా. పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ, యువ జనాభా కలిగిన ఈ దేశం భవిష్యత్తులో సౌందర్య సాధనాల పరిశ్రమలో అగ్రగామిగా నిలబడుతుందని భావిస్తున్నారు.

దేశ, విదేశీ పర్యాటకులను ఆహ్వానించడానికీ, గొప్ప చేనేత వారసత్వాన్నీ, అద్భుతమైన పర్యాటక ప్రదేశాల్నీ, అరుదైన వంటకాల్నీ చాటడానికి ఈ అందాల పోటీలను ఎంచుకున్నాం అని పాలకులు ప్రచారం చేస్తున్నారు. కానీ మరే ఇతర అంతర్జాతీయ ఎగ్జిబిషన్లు, ఈవెంట్లు, సదస్సులు, కార్యక్రమాలను నిర్వహించినా ఇవే ప్రయోజనాలు నెరవేరుతాయన్నది జగమెరిగిన సత్యం. ఇందుకోసం సామ్రాజ్యవాద ప్రయోజనాలు చేకూర్చే ఈ పోటీలకు హైదరాబాద్‌ను వేదికగా మార్చాల్సిన అవసరం లేదు.

మానవాళి చరిత్రలో మేడం మేరీ క్యూరీ, హెలెన్ కెల్లర్, ఫ్లోరెన్స్ నైటింగేల్, సావిత్రిబాయి ఫూలే నుంచి నిన్న మొన్నటి మలాలా, కల్పనా చావ్లా, సునీత విలియమ్స్ దాకా సమాజం వారిని గొప్ప వ్యక్తులుగా గుర్తించింది కేవలం వారు సమాజానికి అందించిన సేవల ఆధారంగా మాత్రమే తప్ప, శారీరక సౌందర్యం ఆధారంగా కాదు! ఏ సమాజమైనా స్త్రీలను వారి శక్తియుక్తులు, వ్యక్తిత్వం, మేధస్సు, మానసిక పరిణతి, సామాజిక సేవ లాంటి గుణగణాల ఆధారంగా గౌరవించుకోవాలే తప్ప శరీర కొలతలు, అంగాంగ ప్రదర్శనల ద్వారా కాదు. అందాల పోటీల వలన మహిళలలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నది అబద్ధం. భౌతిక అందానికి ప్రాధాన్యత ఇవ్వడం కొద్దిమంది మహిళలలో ఆధిక్యతా భావాన్ని, మరికొద్దిమందిలో ఆత్మన్యూనతా భావాన్ని పెంచుతుంది.

**○ ఆర్.గంగాధర్**
అసోసియేట్ ప్రొఫెసర్, స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల

# అనుకున్నది సాధించాం, అప్రమత్తంగా ఉందాం!

భారత్-పాకిస్థాన్ తాజా యుద్ధస్థితి ఉభయ దేశాల భావి సంబంధాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తుందనడంలో సందేహం లేదు. ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాద దాడి యావద్భారతీయులను అమితంగా కలచివేసింది. ఆ హతులు అందరూ ఆసేతు హిమాచలంలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు. కశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులను భగ్నం చేసి, ఆ కేంద్ర పాలిత ప్రాంత పర్యాటక రంగ ఆధారిత ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసే కుతంత్రంతో జరిగిన ఉగ్రవాద దాడిపై సమస్త భారతీయుల ఆగ్రహావేశాలు, భావోద్వేగాలలో కేంద్ర ప్రభుత్వమూ పాలుపంచుకున్నది.

2016లో ఉరి, 2019లో పుల్వామా ఉగ్రవాద ఘాతుకాలు సంభవించినప్పుడు భారత్ శక్తిమంతమైన, ప్రభావదాయకమైన ప్రతిచర్యలు చేపట్టింది. భవిష్యత్తులోనూ ఎలాంటి ఉగ్రదాడులకైనా అటువంటి ప్రతిస్పందనలు ఖాయమని ఆ ప్రతి దాడులతో భారత్ స్పష్టం చేసింది. పహల్గాం పాశవికకాండకు మరింత కఠినమైన గుణపాఠాన్ని నేర్పాలని భారత్ దృఢంగా సంకల్పించుకున్నది. ఆ సంకల్పసాధనలో భాగంగా తొలుత భారత్‌లోని పాకిస్థానీ జాతీయుల వీసాలను రద్దు చేసింది; దశాబ్దాలుగా అమల్లో ఉన్న, పాకిస్థాన్‌కు ప్రాణాధారమైన సింధునదీజలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ నిర్ణయాలతోనే పహల్గాంపై తన ప్రతీకార చర్య ఎంత కఠినంగా ఉండేది భారత్ తేటతెల్లం చేసింది.

మే 7 ప్రాతఃకాలంలో ఆపరేషన్ సిందూర్ పేరిట ఎంపిక చేసుకున్న తొమ్మిది ప్రదేశాల (పాకిస్థాన్‌లో నాలుగు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఐదు)లోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత వాయుసేన క్షిపణి దాడులు నిర్వహించింది. పహల్గాం ఊచకోత అనంతరం పాకిస్థాన్ సాయుధ బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ మన సైనిక దళాలు ఎంచుకున్న నిర్దిష్ట లక్ష్యాలను కచ్చితంగా ధ్వంసం చేయడంలో సంపూర్ణంగా సఫలమయ్యాయి. పాకిస్తాన్ పంజాబ్ రాష్ట్రంలోని బహావల్‌పూర్ (జైషే మహమ్మద్ ప్రధాన కార్యాలయమున్న నెలవు), మురిద్కే (లష్కరే తయిబా ప్రధాన స్థావరమున్న ప్రదేశం) పట్టణాలపై జరిగిన ఆ మెరుపుదాడులు ఒక వాస్తవాన్ని తిరుగులేని రీతిలో వెల్లడించాయి. పాకిస్థాన్ ఆధారిత, ప్రేరేపిత ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా సరే వారిని శాశ్వతంగా మట్టుబెట్టి తీరాలన్న భారత్ దృఢసంకల్పాన్ని అవి విశాల ప్రపంచానికి, మరీ ముఖ్యంగా ఇస్లామాబాద్ పాలకులకు ఎటువంటి మినహాయింపులు లేకుండా చాటిచెప్పాయి.

తన భూభాగాలపై ఎటువంటి ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణించి, అందుకు ప్రతిస్పందనగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థల, బృందాల స్థావరాలను లక్ష్యంగా ప్రతిదాడులు జరుపుతామని ఆపరేషన్ సిందూర్‌తో భారత్ స్పష్టం చేసింది. భారత్-పాకిస్థాన్ సంబంధాల శబ్ద కోశంలో అదొక ప్రభావదాయక సూత్రంగా ఖాయమయింది. ఎటువంటి ఉగ్రదాడి అయినా యుద్ధచర్యే అన్న విషయాన్ని మోదీ సిద్ధాంతంగా భావించవచ్చు. పాకిస్థాన్ పట్ల మన దౌత్యనీతిలో ఒక కొత్త ఆలోచనకు, కచ్చితమైన ఆచరణకు మోదీ సిద్ధాంతం ప్రాతిపదికగా నిలుస్తుంది.




భారత భూభాగాలపై ఎటువంటి ఉగ్రదాడినైనా యుద్ధచర్యగా పరిగణించి, అందుకు ప్రతిస్పందనగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థలు, బృందాల స్థావరాలను లక్ష్యంగా ప్రతిదాడులు జరుపుతామని ఆపరేషన్ సిందూర్‌తో భారత్ స్పష్టం చేసింది. 'ఎటువంటి ఉగ్రదాడి అయినా యుద్ధ చర్యే' అన్న విషయాన్ని మోదీ సిద్ధాంతంగా భావించవచ్చు.

భారత్, పాకిస్థాన్‌ల మధ్య ప్రస్తుత జగడానికి పహల్గాంలో ఉగ్రవాద ఘాతుకమే ప్రధాన కారణం. ఆ దాడికి ప్రతి స్పందనగా మనం చేపట్టిన దాడులు చర్య–ప్రతిచర్య క్రమంలో కీలకమైనవి. భారత్ తన ప్రతిచర్యలను జయప్రదంగా నిర్వహించి, పాక్ మద్దతుతో చెలరేగిపోతున్న ఉగ్రవాదుల గర్హనీయమైన మానవతా వ్యతిరేక నేరాలను అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకువెళ్లడంలో సఫలమవ్వడం ఇస్లామాబాద్ పాలకులకు ఎంతైనా ఆగ్రహం తెప్పించింది. తత్ఫలితంగానే పాక్ సైనిక దళాలు భారత్‌పై తెగబడి దాడులు చేశాయి. కాల్పుల విరమణను సైతం ఉల్లంఘించి పరిస్థితులను మరింత విషమింపజేస్తున్నాయి. పాకిస్థాన్ ప్రేరిత ఉగ్రవాద మూకలు భవిష్యత్తులో పాల్పడే ఎటువంటి దాడులనైనా యుద్ధ చర్యలుగా పరిగణించి అందుకు అదే రీతిలో దీటుగా ప్రతిస్పందించడం ఒక సూత్రంగా ఇప్పుడు స్థిరపడింది.

పాకిస్థాన్ మరింత భారీగా నష్టపోయేలా యుద్ధ చర్యలను కొనసాగించాలని ప్రభుత్వ విమర్శకులు పలువురు వాదిస్తున్నారు. అయితే ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించడంలో భారత్ మౌలిక లక్ష్యం తమ భూభాగాలలో ఎటువంటి ఉగ్రదాడినైనా యుద్ధచర్యగా పరిగణించి తీరుతామని నొక్కిచెప్పడమేనన్న విషయాన్ని ఆ విమర్శకులు విస్మరిస్తున్నారు. భారత్ తన లక్ష్య సాధనలో సందేహాతీతంగా జయప్రదమయింది. ఇక యుద్ధ చర్యలకు స్వస్తిచెప్పి మన ఆర్థిక వ్యవస్థ సర్వతో ముఖాభివృద్ధి లక్ష్య సాధనపై దృష్టి కేంద్రీకరించాలి.

భారత్, పాకిస్థాన్‌ల మధ్య ప్రస్తుత సంఘర్షణను సైనిక వ్యవహారాల నిపుణులు జాగ్రత్తగా అధ్యయనం చేయవలసిన అవసరమున్నది. ఈ 'యుద్ధా'నుభవాల ప్రాతిపదికన మనం సరైన నిర్ణయాలు తీసుకోవాలి. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సైనిక బలాధిక్యత తిరుగులేని రీతిలో రుజువయింది. మన వాయుతల రక్షణ వ్యవస్థలు అన్నీ ప్రశస్తంగా పనిచేశాయి. మన వాయుసేన ఎదురులేని రీతిలో పాక్ వాయుతలంలోకి ప్రవేశించి ఎంపిక చేసుకున్న నిర్దిష్ట లక్ష్యాలను కచ్చితంగా తుదముట్టించడం జరిగింది. ఉగ్రవాదానికి ఊతమిస్తున్న వ్యవస్థలను ధ్వంసం చేయడమే భారత్ అసలు లక్ష్యమని, పాకిస్థాన్‌ను విస్తృతంగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించడం జరిగిందన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. త్రివిధ సాయుధ బలగాల మధ్య పటిష్ఠ సమన్వయంతో పాక్‌పై ప్రతి దాడులు జరిగాయి. మన సాయుధ బలగాలకు ఇదొక కొత్త అనుభవం. మన దేశ రక్షకులు ఇంతకు ముందు చూడని, పాల్గొనని వినూత్న యుద్ధ తంత్రమది. ఆపరేషన్ సిందూర్ మన సాయుధ బలగాలకు ఒక శుభశకునం. భావి యుద్ధాలు, త్రివిధ దళాలు విడివిడిగా కాకుండా ఒక ఏకీకృత కమాండ్ ఆధ్వర్యంలో జరిగే సమరాలుగా ఉంటాయి. త్రివిధ సాయుధ బలగాలను ఏకీకృతం చేయడమనే లక్ష్యాన్ని మన చీఫ్ డిఫెన్స్ స్టాఫ్ చాలా ప్రశస్తంగా పరిపూర్తి చేస్తున్నారు.

పహల్గాం ఉగ్రదాడిపై ప్రతి స్పందన, దాని లక్ష్యాలపై ప్రభుత్వం స్పష్టమైన అవగాహనతో ఉన్నందునే ఆపరేషన్ సిందూర్ విజయవంతమయింది. చర్య–ప్రతి చర్యాత్మక సంఘటనల నెదుర్కొనే విషయమై ప్రభుత్వం ఉక్కు సంకల్పంతో వ్యవహరించింది. పరిస్థితులు తీవ్రమయ్యేందుకు పాకిస్థాన్ తప్పక పూనుకుంటుందనే వాస్తవాన్ని మన పాలకులు విస్మరించలేదు. ప్రశాంత చిత్తంతో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అదే ప్రశాంత చిత్తంతో ప్రతి దాడుల పరిణామాలపై అధికారిక ప్రకటనలు చేశారు. సరళమైన మాటలతో ప్రభుత్వ నిర్ణయాలను ప్రకటించడం జరిగింది. ఒక మహా ఉద్రిక్త సమయంలో పరిస్థితులు అదుపుతప్పని రీతిలో భారత ప్రభుత్వ విధాన నిర్ణేతలు, ప్రతినిధులు వ్యవహరించడం ప్రపంచ దేశాలు గమనించాయి. పాకిస్థాన్ పాలకులకూ ఇది అవగతమై ఉంటుంది. సంగ్రహించి చెప్పాలంటే పహల్గాం ఉగ్రదాడి ఫలితంగా పాకిస్థాన్‌తో ప్రజ్వరిల్లిన సంఘర్షణల్లో భారత్ ప్రశస్తంగా వ్యవహరించింది. భారత్ వ్యతిరేక ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహించడాన్ని పాకిస్థాన్ మానదుగాక మానదు కనుక ప్రస్తుత యుద్ధచర్యల అనుభవాల నుంచి మనం భావి యుద్ధ వ్యూహాలను రూపొందించుకోవాలి. పాకిస్థాన్‌పై సైనికేతర ఒత్తిళ్లను కొనసాగించాలి.

దేశ సరిహద్దులను దాటి ప్రవహించే నదుల జలాల విషయంలో దేశీయ ప్రయోజనాలకు ప్రథమ, అగ్ర ప్రాధాన్యమిస్తూ నిక్కచ్చిగా నిర్ణయాలు తీసుకోవాలి. అలాగే ఉగ్రవాద సంస్థలకు నిధులను నిరోధించేందుకు ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటిఎఫ్) 'గ్రే జాబితా'లో పాకిస్థాన్‌ను మళ్లీ చేర్చాలి. ఉద్రిక్తతలు లేనప్పటికీ పాకిస్థాన్ సక్రమంగా వ్యవహరించేలా చేసేందుకు అటువంటి సైనికేతర ఒత్తిళ్లు తప్పనిసరి. ఈ విషయంలో భారత్ సంకోచాలకు తావులేని రీతిలో చర్యలు చేపట్టాలి. ఆఖరుగా ఓ ముఖ్యమైన మాట ఏమిటంటే, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రసర్పం మళ్లీ ఏ క్షణంలోనైనా బుసలు కొట్టవచ్చు. అది రేపు, లేదా ఎల్లుండే సంభవించవచ్చు, కొద్ది సంవత్సరాలలోనూ ఎదురుకావచ్చు. ఎప్పుడైనా సరే ఆ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఈ క్షణం నుంచే మనం సర్వసన్నద్ధంగా ఉండి తీరాలి.

**• గౌతమ్ బంబావాలె**
పాకిస్థాన్‌లో భారత మాజీ హై కమిషనర్
(ది ట్రిబ్యూన్)

## రెండేళ్లయినా కుదుటపడని 'మణిపూర్'!

మణిపూర్ విధ్వంసానికి రెండేళ్లు పూర్తయింది. ఈ విధ్వంసం ఎన్నో విషాదకర సంఘటనలకు, మానవతా సంక్షోభానికి సాక్ష్యంగా నిలిచింది. రెండు తెగల మధ్య అధికార పార్టీ వర్గీయుల ఆధిపత్యం కోసం సృష్టించిన విధ్వంసక క్రీడలో అమాయక ప్రజలు ఊచకోతకు గురైన మే 3వ తేదీ చరిత్రలో ఓ చేదు జ్ఞాపకంగా మిగిలిపోతుంది. ఒకప్పుడు ప్రశాంతంగా ఉండే ఈ రాష్ట్రం, ఇప్పుడు భయం, అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతోంది. తెగల మధ్య నెలకొన్న వైషమ్యాలతో ఎన్నో కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోగా, మరెన్నో జీవితాలు దెబ్బతిన్నాయి. ఈ ఘర్షణ సామాజిక నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేసి, రాష్ట్రాన్ని దీర్ఘకాలిక మానవతా సంక్షోభంలోకి నెట్టివేసింది. మెయితీ, కుకీ తెగల మధ్య మొదలైన ఘర్షణలు తారాస్థాయికి చేరి... ఇళ్లు, చర్చిలు, ఆస్తులు ధ్వంసమయ్యాయి. స్త్రీలపై అత్యాచారాలు జరిగాయి. మహిళలతోపాటు పిల్లలు సైతం హింసకు గురయ్యారు. 70వేల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులవగా, 260 మందికి పైగా మరణించారు. వందలాది ఇళ్లు, గ్రామాలకు గ్రామాలు బూడిదయ్యాయి. నిరాశ్రయులైన ప్రజలు ఇప్పటికీ కొండలు, లోయలలోని సహాయక శిబిరాల్లో మగ్గుతున్నారు. వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. అల్లర్లను నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి, ఒక తెగకు ప్రతినిధిగా వ్యవహరించారు. ఇంత విధ్వంసం జరిగినా ప్రధాని నరేంద్ర మోదీ ఆ రాష్ట్రం వైపు కన్నెత్తి చూడలేదు. ప్రతిపక్ష పార్టీలు, మానవహక్కుల సంస్థలు, సుప్రీంకోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తినా శాంతిని నెలకొల్పడానికి కేంద్రప్రభుత్వం ఇప్పటికీ చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు.

ప్రస్తుత పరిస్థితుల్లో శాంతి స్థాపన, బాధితులకు న్యాయం చేకూర్చడం అత్యంత ఆవశ్యకం. నిష్పక్షపాతంగా విచారణ జరిపి, హింసకు కారకులైన వారిని శిక్షించాలి. నిరాశ్రయులైన వారికి పునరావాసం కల్పించాలి. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సైతం ఈ ఏడాది మార్చి 22న రాష్ట్రంలో పర్యటించారు. జస్టిస్ బి.ఆర్ గవాయ్ నేతృత్వంలోని ఆరుగురు న్యాయమూర్తుల ప్రతినిధి బృందం మణిపూర్‌లోని సహాయ శిబిరాలను సందర్శించింది.

మణిపూర్‌లో కుకీ ఇతర ఆదివాసీ వర్గాలపై జరుగుతున్న హింసకాండను అదుపు చేయకపోగా ముఖ్యమంత్రి తన వర్గీయులను పూర్తిస్థాయిలో రెచ్చగొట్టి అగ్నికి ఆజ్యం పోసినట్లు అశాంతిని రగిలించారు. పరిస్థితి ఎంతవరకు వెళ్లిందంటే అత్యధిక బీజేపీ ఎమ్మెల్యేలే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయక తప్పలేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 13న మోదీ ప్రభుత్వం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించక తప్పలేదు. దీనిని బట్టి రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎంత దిగజారాయో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రపతి పాలన విధించాక కూడా శాంతి నెలకొనకపోగా, మరింతగా దిగజారింది. డబుల్ ఇంజన్ సర్కార్‌లు ఉన్నచోట్ల శాంతిభద్రతలు ఎంతగా దిగజారుతాయో మణిపూర్ స్పష్టమైన ఉదాహరణ.

పునరావాస కేంద్రాలలో మగ్గిపోతున్న ఆదివాసీ కుటుంబాలను స్వస్థలాలకు క్షేమంగా పంపించాలి. రాష్ట్రపతి పాలనను ఎత్తివేసి, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలను వెంటనే నిర్వహించాలి. ఆదివాసీలపై జరిగిన హత్యా ఘటనలపై పూర్తిస్థాయి న్యాయ విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలి.

**– ముప్పాళ్ళ భార్గవశ్రీ,** సీపీఐ ఎంఎల్ నాయకులు

# కులగణన ప్రతిష్ఠను కాజేసే కుట్రలు!

కేంద్ర కులగణన నిర్ణయం రాహుల్‌గాంధీ పోరాట ఫలితమే అని దేశమంతా కీర్తించింది. ఇది బీజేపీ నేతలకు మింగుడుపడక అడ్డగోలు వాదనలు చేస్తున్నారు. బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ మే 3న ఆంధ్రజ్యోతిలో 'చరిత్రాత్మకం... మోదీ కులగణన నిర్ణయం' పేరుతో రాసిన వ్యాసంలో అట్టడుగు వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మేలును పూర్తిగా వక్రీకరించారు.

కులగణన చేస్తామని 2024 లోకసభ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నది. 'జిత్‌నీ ఆబాదీ ఉత్‌నా హక్' (జనాభా ఎంతో అంత వాటా) అని రాహుల్‌గాంధీ మోదీ ప్రభుత్వానికి పక్కలో బల్లెంలా తయారయ్యారు. కులగణన వాదాన్ని బలపరిచారు. మోదీ మాత్రం కాంగ్రెస్ పార్టీ కులగణనను సమర్థించటాన్ని అర్బన్ నక్సలిజంతో పోల్చి విమర్శించారు. కులగణన హిందువుల మధ్య విభజన తెస్తుందన్నారు. "ముందు నీ కులమేంది? నీ మతమేంది?" చెప్పు అని బీజేపీ నాయకులు రాహుల్‌గాంధీని అవమానించారు. బీజేపీ నేతలు ఎంత అవమానపరిచినా రాహుల్ కులగణన వాదాన్ని వీడలేదు. దేశంలో ఆయనకు పెరుగుతున్న ఆదరణను చూసి కులగణనకు వ్యతిరేకంగా వెళితే బీజేపీ పార్టీకి భవిష్యత్‌లో జరిగే బిహార్, గుజరాత్ తదితర ఎన్నికల్లో పుట్టగతులుండవని గ్రహించి, కులగణన చేస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించింది.

కె. లక్ష్మణ్ గుర్తుపెట్టుకోవాల్సిన అంశం ఏమిటంటే ఈ దేశంలో తొలి బీసీ కమిషన్ వేసి, ఎస్సీ ఎస్టీ బీసీలకు ముమ్మాటికి న్యాయం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వాలే. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి వర్గీకరణను అమలుచేసిన తొలి ప్రభుత్వం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వమే. నిజంగా మీకు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే రాహుల్ గాంధీ చెప్పినట్లు 50శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేసి శాస్త్రీయంగా జనగణనతో పాటు కులగణన చేసి దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న వారి వాటాను వారికి పంచండి.



కులగణన ఘనత తమదేనని డాక్టర్ లక్ష్మణ్ తన వ్యాసంలో సొంత డబ్బా కొట్టుకున్నారు. భారతదేశంలో సామాజిక న్యాయానికి ఇప్పటికీ ఎప్పటికీ దిక్సూచి ఐన కాంగ్రెస్ పార్టీ పట్ల విషం కక్కారు. మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ 1953లో కాకా కాలేల్కర్ చైర్మన్‌గా 11 మంది సభ్యులతో తొలి బీసీ కమిషన్ వేశారు. 1951 జనాభా లెక్కల ప్రకారం 36.11కోట్ల జనాభా ఉంటే ఆ కమిషన్ కేవలం 11.5కోట్ల మంది నుండి సమాచారం సేకరించి నివేదిక రూపొందించింది. కమిషన్ వెనుకబడిన తరగతులను గుర్తించటంలో ఎటువంటి శాస్త్రీయ విధానాలు పాటించలేదని ఆ నివేదికను తోసిపుచ్చటం జరిగింది. ఇందులో నెహ్రూ తప్పు లేదు.

2011లో దివంగత డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వం జనాభా లెక్కల్లో భాగంగా సామాజిక, ఆర్థిక కులగణన (ఎస్.ఇ.సి.సి) చేసింది. నివేదిక వచ్చే సమయానికి 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కులగణన లెక్కలను బయటపెట్టాలని కాంగ్రెస్ ఎంపీలు నిలదీసినా మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రి మోదీకి 2024 పార్లమెంటు ఎన్నికల ముందు 2011 కులగణన లెక్కలు బయటపెట్టాలని లేఖ రాసినా ఎందుకు బయటపెట్టలేదో ఎంపీ లక్ష్మణ్ సమాధానం చెప్పాలి.

రేవంత్‌రెడ్డి సర్కార్ చేసిన కులగణనను లక్ష్మణ్ ఉద్దేశపూర్వకంగా తప్పుపడుతున్నారు. రెండు దశల్లో చేపట్టిన సర్వేలో 97.10 శాతం జనాన్ని సమీకరించి 57 ప్రశ్నలతో సమర్థవంతంగా సమాచారం సేకరించి తెలంగాణ కులగణనలో బీసీలు 46.25 శాతం అని లెక్కలు తేల్చారు. తరువాత బీసీ జాబితాలో చేర్చిన ముస్లిం జనాభా 10.8 శాతంగా లెక్కించారు. బీసీలను, ముస్లిం బీసీలను కలిపితే తెలంగాణలో మొత్తం బీసీల శాతం 56.33గా పేర్కొన్నారు. ఎస్సీలు 17.43శాతమని, ఎస్టీలు 10.45శాతమని ప్రకటించారు. మొత్తం ఓసీల జనాభా 13.31శాతం అని వెల్లడించారు. ఓసీ ముస్లింలు 2.48శాతం. ఓసీలు, ఓసీ ముస్లింలతో కలిపి తెలంగాణలో మొత్తం ఓసీల జనాభా 15.79శాతంగా స్పష్టం చేశారు. రేవంత్ సర్కార్ చేసిన సర్వేలో శాస్త్రీయత స్పష్టంగా ఉన్నది.

నిజానికి దేశంలో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించటానికి 1989–1990లో మాజీ ప్రధాని వి.పి.సింగ్ ప్రయత్నిస్తే 'మండల్ కమండల్' పేరుతో యాత్రలు చేసి, అల్లర్లు సృష్టించి వి.పి.సింగ్ ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకుని ప్రభుత్వాన్ని పడగొట్టిన సంస్కృతి బీజేపీది. ఈ సంగతి మర్చిపోయినట్టు రాజీవ్‌గాంధీ మీద ఆ నేరాన్ని డాక్టర్ లక్ష్మణ్ మోపారు. ఆ తరువాత ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పీవీ నరసింహారావు ప్రధానిగా దేశవ్యాప్తంగా ఓబీసీలకి 27 శాతం రిజర్వేషన్లు అమలు చేసింది నిజం కాదా లక్ష్మణ్ గారూ? 2006లో ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ వంటి కేంద్ర అత్యున్నతమైన విద్యాసంస్థల్లోను, కేంద్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లోను ఓబీసీలకి 27 శాతం రిజర్వేషన్లు అమలు చేసింది యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌లు అన్న సంగతి మర్చిపోతే ఎలా? బిహార్‌లో కులగణన అప్పటి ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలైన జేడీయూ, ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌ల సమక్షంలో 2022 నుండి ప్రారంభమై 2023లో నివేదిక బైటపెట్టింది. దీన్ని కూడా లక్ష్మణ్ బీజేపీ ఖాతాలో వేసుకోవడం విచిత్రం.

కె.లక్ష్మణ్ గుర్తుపెట్టుకోవాల్సిన అంశం ఏమిటంటే ఈ దేశంలో తొలి బీసీ కమిషన్ వేసి, ఎస్సీ ఎస్టీ బీసీలకు ముమ్మాటికి న్యాయం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వాలే. రాష్ట్రంలో బీసీలుగా ఉన్న లంబాడీలను 1975లో ఎస్టీ జాబితాలో చేర్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలే. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి వర్గీకరణను అమలు చేసిన తొలి ప్రభుత్వం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వమే. 42శాతం విద్య ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలుచేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది కాంగ్రెస్ రేవంత్‌రెడ్డి సర్కారే. నిజంగా మీకు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే రాహుల్‌గాంధీ చెప్పినట్లు 50శాతం రిజర్వేషన్లు పరిమితిని ఎత్తివేసి శాస్త్రీయంగా జనగణనతో పాటు కులగణన చేసి దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న వారి వాటాను వారికి పంచండి.

**• కోటూరి మానవతారాయ్**
టీపీసీసీ మాజీ ప్రధానకార్యదర్శి

## ఈపీఎస్ పెన్షన్ పెరిగేదెన్నడు?

ఈపీఎస్ కనీస పింఛన్‌ను వెయ్యి రూపాయల నుంచి 7500కు పెంచమని గత ఎనిమిదేళ్ళుగా ఎంతోమంది కేంద్ర ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేసినా ఇంత వరకు పెంచలేదు. పదేళ్ళ క్రితమే అనేక కమిటీలు కనీస పింఛన్‌ను మూడు వేలకు పెంచాలని సిఫారసులు చేసాయి. బీజేపీ నాయకుడు ప్రకాష్ జవదేకర్ 2013 ఎలక్షన్ మీటింగ్‌లో తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కనీస పెన్షన్ మూడు వేలు చేస్తామని వాగ్దానం చేశారు. ఆ తరువాత పట్టించుకోలేదు. అప్పట్లో కేంద్రమంత్రిగా ఉన్న బండారు దత్తాత్రేయ, తరువాత అనేక మంది పార్లమెంటు సభ్యులు ప్రతీ సభలోనూ ఈ విషయంపై మాట్లాడారు. మథుర ఎంపీ హేమమాలిని ప్రధాని మోదీని స్వయంగా కలిసి వివరించినా, చివరకు ప్రధాన మంత్రి నాగపూర్ సభలో నాలుగేళ్ళ క్రితం వాగ్దానం చేసినా... అన్నీ నీటిమీద రాతలుగానే మిగిలిపోయాయి. పెన్షన్‌దారుల్లో చాలా మంది ఇబ్బందులు పడుతూ బతుకులీడుస్తున్నారు. వీరంతా ఇంకా తమ కనీస పెన్షన్ 7500కు పెరుగుతుందని ఆశిస్తున్నారు. వికసిత భారత్ వీరి జీవితాలలో కూడా వికసించాలి కదా!

**–ఎన్.ఎస్.ఆర్.మూర్తి**

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
హైదరాబాద్
నగర వార్తలు
మంగళవారం 13 మే 2025



సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.2 కనిష్ఠం 27.5

# ఇదేం ఇంజనీరింగ్?

## రహదారులపై ఎక్కడికక్కడ నీరు

- నిర్మాణంలో ప్రమాణాలు కరువు
- పట్టించుకోని అధికారులు
- నీళ్లు వెళ్తాయా.. లేదా..? అన్నది పరిశీలించని ఇంజనీర్లు
- రోడ్లపై నీటితో స్థానికుల ఇబ్బందులు
- కొత్తగా నిర్మిస్తోన్న చోటా అదే దుస్థితి
- ఉన్నతాధికారుల ఉదాసీనతే కారణం
- కార్యాలయం నుంచి కాలు కదపని వైనం
- క్షేత్రస్థాయిలో ఇష్టారాజ్యంగా పనులు



కూకట్‌పల్లిలోని విజ్ఞాన్‌పురి, దీనబంధు కాలనీలో రహదారిపై ఇదీ పరిస్థితి. రోడ్డుపై వాలు (స్లోప్) లేకపోవడంతో ఎక్కడికక్కడ నీరు నిలుస్తోంది.

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు నిర్మించే, ఫ్లోరింగ్ (మార్బుల్/టైల్స్) చేసే మేస్త్రీలు నీళ్లు సాఫీగా వెళ్లేలా లెవల్ చూసుకుంటారు. తదనుగుణంగా నిర్మాణ పనులు చేపడుతారు. అయితే ఘనత వహించిన జీహెచ్ఎంసీలోని కొందరు ఇంజనీర్లకు ఈ స్థాయి పరిజ్ఞానమూ లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రహదారుల నిర్మాణంలో జరుగుతున్న లోపాలే ఇందుకు నిదర్శనం. నీరు నిలవడం వల్ల రహదారులూ పాడయ్యే ప్రమాదముంది. బల్దియాలోని ఇంజనీరింగ్(మెయింటెనెన్స్) విభాగం పనితీరు గాడి తప్పడమే ఇందుకు ప్రధాన కారణమని చెబుతున్నారు. ఉన్నతాధికారుల ఉదాసీనతతో పనులు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి.

### పర్యవేక్షణ ఏది?

గ్రేటర్‌లో రహదారుల నిర్మాణం, నిర్వహణను జీహెచ్ఎంసీలోని ఇంజనీరింగ్ మెయింటెనెన్స్ విభాగం చూసుకుంటుంది. ఈ విభాగానికి ఓ చీఫ్ ఇంజనీర్, జోన్ల వారీగా సూపరింటెండెంట్ ఇంజనీర్లు, సర్కిల్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇద్దరు/ముగ్గురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(డీఈఈ), డివిజన్ల వారీగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(ఏఈఈ)విధులు నిర్వర్తిస్తున్నారు. రహదారుల నిర్మాణం, ఇతరత్రా పనులు చేసే సమయంలో ఏఈఈలు దగ్గరుండి పర్యవేక్షించాలి. కీలకమైన పనులైతే డీఈఈ/ఈఈలూ క్షేత్రస్థాయిలో ఉండాలి. కానీ చాలా ప్రాంతాల్లో పనులు జరిగేటప్పుడు సంబంధిత అధికారులు కనిపించడం లేదు. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టానికి పనులు చేస్తున్నారు. వాస్తవంగా రహదారుల నిర్మాణం ఇండియన్



ఉప్పల్ సర్కిల్‌లోని రామంతాపూర్ శ్రీనివాసపురం కాలనీలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు ఇది. ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచి స్థానికంగా వాహనాల రాకపోకలు, పాదచారులకు ఇబ్బంది కలుగుతోంది.

మిగతా 6వ పేజీలో..

## డ్రోన్‌లపై నిషేధం



**హకీంపేట, దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ పరిధిలో..**

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల నేపథ్యంలో హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, దుండిగల్ అకాడమీ పరిధిలో డ్రోన్ల వినియోగంపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ నిషేధం విధిస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. విమానాశ్రయానికి 5 కిలోమీటర్ల పరిధిలో డ్రోన్లపై నిషేధం విధించినట్లు సీపీ అవినాష్ మహంతి వెల్లడించారు. అదేవిధంగా పారా గ్లైడర్స్, రిమోట్ కంట్రోల్డ్ మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను ఎగరవేయడంపై జూన్ 11వ తేదీ వరకు నిషేధం అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

**పాలీసెట్ పరీక్షా కేంద్రాల వద్ద..**

పాలీసెట్ పరీక్షను మంగళవారం (మే 13వ తేదీ) నిర్వహిస్తున్న నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కేంద్రాల వద్ద ప్రత్యేకంగా ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసులు తెలిపారు. పరీక్షా కేంద్రాల నుంచి 200 మీటర్ల వరకు ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమి గూడి ఉండకూడదని, జిరాక్స్, ఇంటర్‌నెట్ కేంద్రాలను మూసివేయాలని తెలిపారు. ఈ నిబంధన నేటి రాత్రి 6 గంటల వరకు ఉంటుందన్నారు.

## ఆర్టీఏ కార్యాలయానికి నాగార్జున

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు నాగార్జున డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకున్నారు. గడువు ముగియడంతో స్లాట్ బుక్ చేసుకున్న ఆయన సోమవారం ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయానికి వచ్చారు. ఫొటో దిగి డిజిటల్ సంతకం చేసిన ఆయనకు లైసెన్స్ అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జునతో ఆర్టీఏ, సిబ్బంది ఫొటోలు దిగారు. దీంతో అక్కడ సందడి వాతావరణం ఏర్పడింది.



డిజిటల్ సంతకం చేస్తున్న నాగార్జున

## కక్షతో హత్య

- తనను కాదని మరొకరితో పెళ్లి
- మహిళ భర్తను చంపిన యువకుడు
- గంజాయి మత్తులో ఘాతుకం



వెంకటరమణ(ఫైల్)



హత్య అనంతరం వసంతనగర్ రోడ్డులో పారిపోతున్న దుండగులు (సీసీ ఫుటేజీ)

హైదర్‌నగర్, మే12 (ఆంధ్రజ్యోతి): తనను కాకుండా వేరొకరిని పెళ్లి చేసుకుందన్న కక్షతో ఆ మహిళ భర్తను ఓ యువకుడు కత్తితో పొడిచి చంపేశాడు. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పు గోదావరి జిల్లా అడివిపూడి గ్రామానికి చెందిన మేడిశెట్టి జగదీష్ కుటుంబం కేపీహెచ్‌బీ కాలనీ సర్దార్ పటేల్‌నగర్‌లోని కేఎస్ఆర్ అయ్యప్ప ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా ఉంటోంది. జగదీష్ సోదరుడు దుర్గాప్రసాద్ కుటుంబం కూడా ఇక్కడే ఉంటోంది. దుర్గాప్రసాద్ మరదలు శ్రావణ సంధ్యను పెళ్లి చేసుకుంటానని, అదే గ్రామానికి చెందిన అయ్యప్పస్వామి అలియాస్ పవన్‌కుమార్ (27) ఎనిమిదేళ్ల క్రితం ఆమె తల్లిదండ్రులను సంప్రదించాడు. వారు తిరస్కరించి ఆమెకు వెంకటరమణ(30)తో వివాహం జరిపించారు. అప్పటి నుంచీ శ్రావణ సంధ్య, వెంకటరమణలపై పవన్‌కుమార్ కక్ష పెంచుకున్నాడు. వారం క్రితం శ్రావణ సంధ్య స్వగ్రామంలోని ఓ వివాహానికి వెళ్లింది. అప్పటి నుంచీ వెంకటరమణ భోజనానికి జగదీష్ ఇంటికి వస్తున్నాడు. నగరంలోనే ఉంటున్న పవన్ కుమార్ ఆదివారం అర్ధరాత్రి నలుగురు స్నేహితులతో వచ్చి జగదీష్ ఉండే అపార్ట్‌మెంట్ గేటు ముందు సిగరెట్లు, గంజాయి తాగుతూ అల్లరి చేశాడు. వారిని జగదీష్, వెంకటరమణ ప్రశ్నించగా వారిపై ఐదుగురు యువకులు దాడి చేశారు. వెంకటరమణను కత్తితో పొడిచి పారి పోయారు. అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. జగదీష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

## క్రెడిట్ కార్డుకు ఫైన్ పడిందని..


## రూ.1.80 లక్షలు స్వాహా



హైదరాబాద్ సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు వాడకపోవడం వల్ల ఫైన్ పడిందనే పేరుతో సైబర్ నేరగాళ్లు రూ.1.80 లక్షలు కొల్లగొట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగికి ఓ ఫోన్ వచ్చింది. 'మీ క్రెడిట్‌కార్డును చాలా కాలంగా వాడకపోవడం వల్ల ఫైన్ పడింది' అని చెప్పాడు. జరిమానా మాఫీ చేయిస్తానని నమ్మించి కార్డు నంబర్, సీవీవీ, ఓటీపీలూ తెలుసుకుని రూ.1.80లక్షలు కొట్టేశాడు. ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# 'అందాల' నగరం.. పర్యాటక శిఖరం

- మిస్ వరల్డ్ పోటీలతో ప్రపంచస్థాయికి
- చార్మినార్, చౌమహల్లాకు పెరగనున్న ఖ్యాతి
- నేడు సుందరీమణుల హెరిటేజ్‌వాక్
- భారీ భద్రతా ఏర్పాట్లు చేసిన యంత్రాంగం
- లాడ్‌బజార్ దుకాణదారులకు గుర్తింపుకార్డులు
- చౌమహల్లా ప్యాలెస్‌లో వెల్‌కమ్ డిన్నర్



చౌమహల్లా ప్యాలెస్

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర పర్యాటకం ప్రపంచస్థాయికి చేరింది. మిస్ వరల్డ్ పోటీలను పురస్కరించుకుని వివిధ దేశాల నుంచి వచ్చిన సుందరీమణులు నగరంలోని పలు ప్రాంతాలను సందర్శిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక ఆకర్షణ నెలకొంది. ముత్యాల నగరిగా పేరొందిన హైదరాబాద్‌లో అందాల భామలు పర్యటిస్తుండడం ఆసక్తిగా మారింది. పోటీల్లో భాగంగా చార్మినార్, లాడ్‌బజార్‌లో మంగళవారం హెరిటేజ్ వాక్ చేయనున్నారు. ఈమేరకు అధికారులు భద్రత ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 గంటలకు చౌమహల్లా ప్యాలెస్‌ను సందర్శించనున్నారు. అక్కడ మ్యూజికల్ కాన్సర్ట్‌తో పాటు వెల్‌కమ్ డిన్నర్ ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా, అందాల భామల పర్యటనను పురస్కరించుకుని చార్మినార్ కట్టడాన్ని ఇప్పటికే మువ్వన్నెల జెండా రంగుల్లో విద్యుత్ దీపాలతో అలంకరించారు. దాదాపు 116 మంది సుందరీమణులు ఆయా ప్రాంతాల్లో ఒకేసారి పర్యటించనున్న తరుణంలో ఆయా ప్రదేశాల విశిష్టతపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

### హైదరాబాద్ గ్లోబల్ ఐకాన్-చార్మినార్

దేశంలోని అత్యంత గుర్తింపు పొందిన నిర్మాణాలతో కూడిన జాబితాలో చార్మినార్ హైదరాబాద్ గ్లోబల్ ఐకాన్‌గా అవతరించింది. ఇది నగరంలోని ప్రాచీన చారిత్రక కట్టడాల్లో ఒకటిగా ఉంది. కుతుబ్‌షాహీ వంశానికి చెందిన 5వ పాలకుడు మహమ్మద్ కులీ కుతుబ్‌షా తన రాజధానిని గోలకొండ నుంచి హైదరాబాద్‌కు కొత్తగా ఏర్పడిన పట్టణానికి తరలించిన తర్వాత 1591లో చార్మినార్‌ను నిర్మించారు. ప్రతిమూల వద్ద ఒక అద్భుతమైన ఆకారంలో 56 మీటర్ల (సుమారుగా 184 అడుగులు) ఎత్తు గల మినార్ రెండు అంతస్తుల్లో ఉంటుంది. చార్మినార్‌కు చెందిన నాలుగు నిర్మాణాలు ప్రధాన నిర్మాణంతో కలిపి నిర్మించారు. పై అంతస్తుకు చేరుకునేందుకు

మిగతా 8వ పేజీలో..

**నాలుగు మహళ్ల సమూహమే..**

నగరంలో మరో అద్భుతమైన కట్టడం చౌమహల్లా ప్యాలెస్. 1750లో దీనిని రెండో నిజాం సలాబత్ జంగ్ నిర్మాణాన్ని ప్రారంభించినట్లు చరిత్రకారులు చెబుతుంటారు. ఐదో నిజాం నాసిర్ ఉద్దౌలా పాలనలో ముఖ్యంగా 1857-1869 మధ్యకాలంలో ప్యాలెస్ నిర్మాణం ముగిసినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. భవన సముదాయంలోని దక్షిణ ప్రాంగణంలో అఫ్జల్ మహల్, మహతాబ్ మహల్, తహ్నియత్ మహల్, ఆఫ్తాబ్ మహల్ నిర్మాణాలున్నాయి. ఉత్తరం వైపున బారా ఇమాం తోపాటు పొడవైన గదుల సమూహం, దాని ఎదుట నీటి కొలను కనిపిస్తుంటాయి. చౌమహల్లా కట్టడంలో మొగల్, పర్షియన్ నిర్మాణశైలిలోని గుమ్మటాలు దర్శనమిస్తుంటాయి. చౌమహల్లా ప్యాలెస్‌ను ప్రత్యేక చారిత్రక నిర్మాణంగా గుర్తిస్తూ 2010 మార్చి 15న యునెస్కో ప్రతిష్టాత్మకమైన ఆసియా పసిఫిక్ మెరిట్ అవార్డును ప్రదానం చేసింది. ఏడో నిజాం మనవడు ముకర్రంజా బహదూర్ ఆధీనంలోని ఈ భవనంలోకి 2005 నుంచి సందర్శకులకు అనుమతి ఇస్తున్నారు.



వివేకానందనగర్ రోడ్డుపై వర్షం నీరు

## పలు ప్రాంతాల్లో భారీ వర్షం

- కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో అత్యధికంగా 4.2 సెం.మీ
- ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు..
- జలమయమైన ప్రధాన రహదారులు

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపించాయి. కూకట్‌పల్లి, వివేకానందానగర్ ప్రాంతాల్లో వరదనీరు ప్రధాన రహదారులను ముంచేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రాత్రి 10 గంటల వరకు కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో అత్యధికంగా 4.2 సెం.మీ వర్షం కురిసింది. వివేకానందనగర్‌లో ఈదురుగాలులకు భారీ చెట్టు విరిగిపడింది. మరో రెండు రోజుల వర్షాలు కురిసే అవకాశముంటుందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు. మధ్యాహ్నం వరకు ఎండ ప్రభావం ఉన్నా సాయంత్రం వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు.

**వర్షపాతం వివరాలు (సెం.మీ)**

| ప్రాంతం | వర్షపాతం |
|---|---|
| బాలాజీనగర్ | 4.2 |
| హైదర్‌నగర్ | 3.3 |
| కూకట్‌పల్లి | 3.1 |
| బాలానగర్ | 3.0 |
| పాటిగడ్డ | 2.8 |
| కుత్బుల్లాపూర్ | 2.7 |
| బాచుపల్లి | 2.4 |
| వివేకానందనగర్ | 2.4 |

## జేఎన్‌టీయూ కాలేజీలో 500 సీట్లకు కోత

**అనుమతులు తెచ్చుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం**



హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీలో వచ్చే విద్యా సంవత్సరం (2025-26) నుంచి 500కు పైగా సీట్లకు కోత పడనుందా అంటే అవుననే అంటున్నారు యూనివర్సిటీ సిబ్బంది. ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సులకు సంబంధించి కొత్తగా ప్రవేశపెట్టే ప్రతి బ్రాంచ్‌కు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) నుంచి అనుమతి తీసుకోవాలని నిబంధనలు ఉన్నప్పటికీ వర్సిటీ ఉన్నతాధికారులు ఉదాసీన వైఖరిని అవలంబించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఒకవైపు ప్రైవేటు కళాశాలలు లెక్కకుమించి కొత్త కోర్సులు పెడుతుండగా, ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న కోర్సులు/బ్రాంచ్‌లలో సీట్లకు కోత పెట్టాలని వర్సిటీ ఉన్నతాధికారులు భావిస్తుండడాన్ని ఉద్యోగ సంఘాలు, విద్యార్థి సంఘాలు తప్పు పడుతున్నాయి.

### ప్రైవేటు కాలేజీలకు వెనువెంటనే అనుమతులు

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో కొత్తగా ప్రవేశపెట్టిన కోర్సులకు ఏఐసీటీఈ నుంచి వారంలోగా అనుమతులు లభిస్తుండగా, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశపెట్టిన కోర్సులకు ఏళ్లు గడుస్తున్నా అనుమతులు లభించడంలేదు. అనుమతుల కోసం ఏఐసీటీఈకి సరైన పత్రాలు సమర్పించడంలో అధికారులు వైఫల్యమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. గండిపేట్‌లోని ఒక పేరున్న ఇంజనీరింగ్ కళాశాల వచ్చే ఏడాదికి కొన్ని కోర్సుల్లో అదనపు బ్రాంచ్‌ల కోసం వారం కిందటే అనుమతి తెచ్చుకోగా, బాచుపల్లిలోని మరొక పెద్ద కళాశాలకు కూడా ఈ ఏడాది కొత్త కోర్సులను ప్రారంభించేందుకు దరఖాస్తు చేసిన స్వల్ప వ్యవధిలోనే అన్ని పర్మిషన్లు లభించడం విశేషం. ఏఐసీటీఈ అనుమతులు లేని కారణంగా జేఎన్‌టీయూ కాలేజీలో సీట్లకు కోతపెడితే.. లాభపడేది ఆ రెండు కాలేజీలేనన్న ప్రచారం జరుగుతోంది. పలు కోర్సుల్లో సీట్ల కోత విషయమై కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, 2009లో మొదలైన ఐడీపీ కోర్సులకు అనుమతులు ఇచ్చేందుకు ఏఐసీటీఈనే నిరాకరిస్తోందని చెప్పారు. మూడేళ్ల క్రితం ప్రారంభించిన బయోటెక్నాలజీ, జియో ఇన్ఫర్మాటిక్స్, సైబర్ సెక్యూరిటీ కోర్సులకు ఈ ఏడాదైనా అనుమతులు వచ్చేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.



రక్తం కొరత.. తలసీమియా

## బాధితుల అవస్థ

- నెగెటివ్ గ్రూప్ రక్తం కోసం తప్పని తిప్పలు
- వేసవిలో రక్తదాన శిబిరాలు నిర్వహించని స్వచ్ఛంద సంస్థలు

6

## చోరీ అయిన 310 సెల్‌ఫోన్లు స్వాధీనం

- బాధితులకు అందజేత

6



6

## ఫెయిలైన పిల్లలపై పట్టింపు ఏదీ?

- దుర్భరంగా గ్రేటర్ టెన్త్ విద్యార్థుల పరిస్థితి
- సర్కారు స్కూళ్లలో 8,266 మంది ఫెయిల్
- మరో 20రోజుల్లో సప్లిమెంటరీ పరీక్షలు

# ఒకే లేన్.. మిగతావన్నీ క్లోజ్!

- టోల్‌ప్లాజా లేన్ల మూసివేతతో ఇబ్బందులు
- ఔటర్‌పై వాహనదారుల ఇక్కట్లు
- ఫాస్టాగ్‌కు ఒకటి, క్యాష్‌కు మరొకటి మాత్రమే
- కారణాలు ఏంటంటే సమాధానం కరువు



బొంగులూరు ఇంటర్ ఛేంజ్‌లో ఫాస్టాగ్ లేన్లు మూసివేత

హైదరాబాద్ సిటీ, మే12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు టోల్ ప్లాజా వద్ద కేవలం ఒక ఫాస్టాగ్ లేన్‌ను, ఒక క్యాష్ లేన్‌ను మాత్రమే తెరిచి ఉంచుతున్నారు. మిగతా వాటిని మూసివేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలన్నీ ఒకే లేన్ వద్ద బారులు తీరాల్సి వస్తోంది. పదేళ్ల క్రితం 8లేన్లతో నిర్మించిన ఔటర్ రింగ్‌రోడ్డుపై 2018 వరకు నగదు టోల్ చెల్లింపులే జరిగాయి. చిల్లర కోసం వాహనదారులు వెయిట్ చేయాల్సి రావడం వల్ల ట్రాఫిక్ జామ్ అయ్యేది. దీంతో రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రయాణించిన దూరానికి మాత్రమే టోల్‌ఫీజు వసూలు చేసే సాంకేతిక వ్యవస్థను రూపొందించారు. ప్రపంచంలోని పలు అభివృద్ధి చెందిన దేశాల్లో మినహా ఎక్కడా ఈ విధానం లేదు. హెచ్ఎండీఏ ప్రయోగాత్మకంగా అమలు చేయగా అప్పుడప్పుడు సాంకేతిక సమస్యలు మినహా సత్ఫలితాలు వచ్చాయి.

### తాజాగా లేన్లు మూసివేత

ఔటర్ రింగు రోడ్డుపై బొంగులూరు ఇంటర్‌ఛేంజ్(ఎగ్జిట్-12) వద్ద ఇరువైపులా ఎంట్రీలో ఐదు టోల్ లైన్లు, ఎగ్జిట్‌లో ఐదు

మిగతా 6వ పేజీలో..

## రోడ్లు, పార్కులు కబ్జా

- హైడ్రాకు ఫిర్యాదుల వెల్లువ

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): లే అవుట్లలోని పార్కులు, రహదారులు, ఇతరత్రా ప్రజావసర స్థలాల అన్యాక్రాంతంపై హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో 61 ఫిర్యాదులు వచ్చాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు.

**ఫిర్యాదులు ఇలా..**


- నిజాంపేట మునిసిపల్ కార్పొరేషన్ పరిధి సాయిలక్ష్మి లే అవుట్‌లో 1800 చదరపు గజాల పార్కు స్థలం కబ్జాకు గురైనట్లు ఫిర్యాదు అందింది.
- లే అవుట్ మాయం చేశారని కూకట్‌పల్లి హైదర్‌నగర్‌లోని డైమండ్ హిల్స్ కాలనీ ప్లాట్ల యజమానులు ఫిర్యాదు చేశారు.
- హయత్‌నగర్ అనుమగల్‌లోని తిరుమల హౌసింగ్ కాలనీలో 2955 చ.గల జీహెచ్ఎంసీ పార్కును కబ్జా చేశారు.
- బాచుపల్లి మండలం నిజాంపేట కార్పొరేషన్ పరిధిలోని తుర్క చెరువు ఎఫ్‌టీఎల్ భూముల తోపాటు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ రంగనాథ్

# ఫెయిలైన పిల్లలపై పట్టింపు ఏదీ?

## గ్రేటర్‌లో టెస్త్ తప్పిన విద్యార్థుల పరిస్థితి దుర్భరం



- సర్కారు స్కూళ్లలో 8,266మంది ఫెయిల్
- మరో 3 వారాల్లో సప్లిమెంటరీ పరీక్షలు
- ప్రత్యేక తరగతుల నిర్వహణపై విద్యాశాఖ నిర్లక్ష్యం

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో పదో తరగతి ఫెయిలైన సర్కారు స్కూళ్ల విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ఆయా సబ్జెక్టుల్లో తప్పిన పిల్లలను చేరదీసి వారికి మనోధైర్యం కల్పించి సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయించాల్సిన విద్యాశాఖాధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరో మూడు వారాల్లో (జూన్ 3 నుంచి 13 వరకు) సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్న తరుణంలో టీచర్లను పాఠశాలలకు రప్పించి సంబంధిత సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సిన వారు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటున్నారని, ఈ పరీక్షల్లో కూడా తమ పిల్లలు ఉత్తీర్ణత సాధించే పరిస్థితి కనిపించడం లేదని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రత్యేక తరగతులు కరువు..

వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు మానసిక ధైర్యం కల్పించి వారిని సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధులను చేసి తిరిగి పాసయ్యేలా కృషి చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని స్కూళ్లు మినహా పాఠశాలల వారీగా ఎంతమంది విద్యార్థులు ఫెయిలయ్యారో జాబితాను తయారు చేసి, సబ్జెక్టు టీచర్లతో వారిని మళ్లీ పరీక్షలకు సిద్ధం చేయించాల్సి ఉంది. అయితే, ఇప్పటివరకు విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడం దారుణమని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫెయిలైన వారికి ప్రత్యేక తరగతులు ప్రారంభించినా, సర్కారు బడుల్లో ఆ ప్రయత్నాలు ఇంకా మొదలుకాలేదని పేర్కొంటున్నారు.

### ఎక్కువగా గణితం, సైన్స్, ఇంగ్లిష్‌లోనే..

2024-25 విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని మార్చిలో జరిగిన పదో తరగతి వార్షిక పరీక్షల్లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కలిపి మొత్తం 19,125 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఆయా జిల్లాల్లో మొత్తం ఉత్తీర్ణత పొందిన వారిలో ఎక్కువగా ప్రైవేట్, గురుకుల పాఠశాలల విద్యార్థులే ఉన్నారు. ప్రైవేట్ విద్యార్థులను మినహాయిస్తే గ్రేటర్‌లోని హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 8,266 మంది ప్రభుత్వ పాఠశాలల విదార్థులు ఫెయిలైనట్లు విద్యాశాఖ గణంకాలు చెబుతున్నాయి. ఇందులో చాలామంది గణితం, సైన్స్, ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, హిందీలో కూడా ఉత్తీర్ణత సాధించలేకపోయినట్లు తెలిసింది.



చెస్ ఆడుతున్న పటోళ్ల ఇంద్రారెడ్డి

## చెస్‌లో సత్తా చాటిన పట్లోళ్ల ఇంద్రారెడ్డి

బంజారాహిల్స్, మే 12 (ఆంధ్రజ్యోతి): యూరప్ బాస్నియాలో జరిగిన ఇంటర్నేషనల్ రాపిడ్ చెస్ టోర్నమెంట్లో సిల్వర్ మెడల్ 1804 చెస్ ఫిడే రేటింగ్స్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మనవడు పట్లోళ్ల ఇంద్రారెడ్డి సత్తాచాటాడు. ఇంటర్నేషనల్ రాపిడ్ చెస్ టోర్నమెంట్లో సిల్వర్ మెడల్ సాధించి 400 ఫిడే పాయింట్లను పెంచుకుని 1804 పాయింట్‌లతో ఫిడే రేటింగ్స్‌లో తన ప్రతిభను కనబరిచాడు. ఇంద్రారెడ్డి సిల్వర్ మెడల్ సాధించడం సంతోషంగా ఉందని ఏకాగ్ర చెస్ అకాడమీ సీఈఓ సందీప్ నాయుడు, చీఫ్ కోచ్ చైతన్య సురేష్ తెలిపారు. నానమ్మ సబితా ఇంద్రారెడ్డి అందిస్తున్న ప్రోత్సాహంతోనే ఆట ఆడుతున్నానని ఇంద్రారెడ్డి తెలిపారు.

## ఇదేం ఇంజనీరింగ్?

(5వ పేజీ తరువాయి)

రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) ప్రమాణాల ప్రకారం జరగాలి. ప్రధాన రహదారులైతే ఇరువైపులా డ్రైన్లలోకి వరద నీరు వెళ్లేలా కేంబర్ ఉండాలి. అంతర్గత సీసీ రోడ్లయితే సమీపంలోని వరద నీటి ప్రవాహ వ్యవస్థ/దిగువకు వెళ్లేలా నిర్మించాలి. పనులు జరుగుతున్న సమయంలో ఎప్పటికప్పుడు లెవల్స్ పరిశీలిస్తేనే ఇది సాధ్యం. ఇంజనీరింగ్ అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్లు చేసినవే పనులు, కార్మికులు వేసిందే రోడ్డు అన్నట్టుగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఉంటున్నాయి. కొందరు ఇంజనీర్లకు లెవల్స్ పరిశీలించాలన్న విషయమూ తెలియదని ఉన్నతాధికారొకరు పేర్కొన్నారు.

### సార్లు.. కార్యాలయాలు దాటరు

కేంద్ర/జోనల్ కార్యాలయాల్లోని ఉన్నతాధికారులు క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలి. పనులు జరుగుతోన్న తీరు పరిశీలించాలి. కానీ జీహెచ్‌ఎంసీలో ఆ పరిస్థితి లేదు. మెజార్టీ అధికారులు కార్యాలయాల నుంచి కాలు బయట పెట్టడం లేదు. దీంతో కొన్ని సర్కిళ్లలో ఏఈఈ, డీఈఈలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు పూర్తిస్థాయిలో విభాగంపై పట్టు రాకపోవడమూ ప్రస్తుత దుస్థితికి కారణంగా చెబుతున్నారు.

# హై రిస్క్ గర్భిణులకు క్లినికల్ అవగాహన అవసరం

## సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ బాలాంబ



హై రిస్క్ ప్రెగ్నెన్సీపై సీఎంఈ కార్యక్రమంలో వైద్యులు

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి కాలంలో హై రిస్క్ గర్భధారణలు పెరిగిపోతున్నాయని, ఈ నేపథ్యంలో వారికి సమయానుకూలమైన శిక్షణ, క్లినికల్ అవగాహన ఎంతో అవసరమని సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ బాలాంబ పేర్కొన్నారు. హైటెక్ సిటీలోని మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం హై రిస్క్ ప్రెగ్నెన్సీపై సీఎంఈ (కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్) కార్యక్రమం నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రులు ఈ రంగంలో ముందుండి మాతృ-శిశు ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహిస్తున్నందుకు అభినందించారు. సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ శాంతకుమారి మాట్లాడుతూ ఇలాంటి సీఎంఈల ద్వారా వైద్య నిపుణులు నైపుణ్యాలను మెరుగుపర్చుకొని సురక్షిత వైద్యం అందించగలుగుతారన్నారు. మెడికవర్ ఆస్పత్రి నవజాత శిశు, పిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ రవీందర్‌రెడ్డి పరిగే మాట్లాడుతూ హై రిస్క్ ప్రెగ్నెన్సీలో ఫలితాలు ప్రసవంతో ఆగవని, శిశువుకు తగిన నెయోనటల్ కేర్ చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ మీనాక్షి, డాక్టర్లు వరలక్ష్మి, రాగారెడ్డి, సింధూరి, రాధిక, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## హ్యాండ్లూమ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, మే12 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు వి.ఇందిర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డిప్లొమా కోర్సులకు మూడేళ్ల పాటు శిక్షణ ఇస్తారని, అడ్మిషన్ నోటిఫికేషన్-2025 గత నెల మొదటివారంలో విడుదలైందని తెలిపారు. నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో ఈ ఇనిస్టిట్యూట్ ఉన్నదని, ఇతర వివరాలకు హైదరాబాద్ జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులను సంప్రదించాలని కోరారు.



## పదో తరగతిలో ప్రతిభ

- రాజ్‌భవన్ పాఠశాల విద్యార్థులను సన్మానించిన గవర్నర్

బేగంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన రాజ్‌భవన్ పాఠశాల విద్యార్థులను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం అభినందించారు. రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో టెన్త్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులతో గవర్నర్ సంభాషించారు. ఈ ఏడాది జరిగిన పదోతరగతి పరీక్షల్లో రాజ్‌భవన్ పాఠశాల 97% ఉత్తీర్ణత శాతాన్ని సాధించింది. 574 మార్కులతో హైదరాబాద్ జిల్లాలో అగ్రస్థానం సాధించిన హాసినితోపాటు పాఠశాలలో 500 మార్కులకు పైగా సాధించిన మరో 21మంది విద్యార్థుల్ని గవర్నర్ ఈ సందర్భంగా సన్మానించారు. గవర్నర్ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, రాజ్‌భవన్ పాఠశాల ఉపాధ్యాయులు, రాజ్‌భవన్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





## లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ (గణిత శాస్త్రం) ఒక అంశంగా ఉండి కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, ఐటీఐ డ్రాఫ్ట్‌మన్ (సివిల్), డిప్లమా (సివిల్), బీటెక్ (సివిల్) లేదా ఇతర సమానమైన విద్యార్హతలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ ఫీజు ఓసీ అభ్యర్థులకు రూ.10,000, బీసీలకు రూ.5,000, ఎస్సీ, ఎస్టీలకు రూ. 2,500 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు మీసేవ కేంద్రాల ద్వారా మాత్రమే ఈనెల 17లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9848368659, 9440438475 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## ఆపరేషన్ కగార్‌ను కొనసాగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను కొనసాగించాలని ఏబీవీపీ తెలంగాణ ప్రాంత ప్రముఖ్ డాక్టర్ మాసాడి బాబురావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఏబీవీపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో 'మానవత్వమా? మావోయిస్టు మారణకాండనా?' అంశంపై ఓయూలోని ఆర్ట్స్ కాలేజీలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాసాడి బాబురావు మాట్లాడుతూ అభివృద్ధికి ఆటంకంగా మారిన మావోయిస్టులపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ప్రముఖ్ టి.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, స్టేట్ ఆల్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్, ఓయూ అధ్యక్షుడు దృహన్, రాష్ట్ర అధ్యకుడు జానారెడ్డి, వివిధ యూనివర్సిటీల విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## జూదం ఆడుతున్న 16 మంది అరెస్ట్

బేగంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): జూదం ఆడుతున్న 16 మందిని బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. బేగంపేట ఓల్డ్ ఆనంద్ థియేటర్ లైన్‌లోని విమల్‌నగర్‌లోని ఓ ఇంట్లో ఆదివారం సాయంత్రం మూడు ముక్కల జూదం ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. బేగంపేట ఎస్సై శ్రీధర్, ఇతర సిబ్బంది ఆకస్మికంగా దాడి చేశారు. రసూల్‌పురాకు చెందిన షేక్ యూసుఫ్(36) నిర్వహణలో జూదం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిర్వాహకుడితో పాటు మరో 16మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,91,975 నగదును, ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

### మద్యం తాగి దంపతులపై దాడి..

## యువకుడిపై కేసు నమోదు

బేగంపేట: మద్యంతాగిన ఓ యువకుడు దంపతులపై, అడ్డుకునేందుకు వచ్చిన మరో వ్యక్తిపై దాడి చేసిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం రసూల్‌పురాలోని చంద్రబాబునగర్‌లో ఉంటున్న సూర్య ఆదివారం సాయంత్రం తన బైకును ఇంటి పక్కన పార్క్ చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ మద్యం తాగుతున్న కిట్టు అనే యువకుడు సూర్యతో గొడవ పడి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీనిని అడ్డుకునేందుకు వచ్చిన అతని బంధువును కూడా తీవ్రంగా కొట్టాడు. ఈ అలికిడితో బయటకు వచ్చిన సూర్య భార్య విమలపై కూడా అతను దాడి చేశాడు. దీంతో బాధితులు బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు కిట్టూపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

## బాధ్యతతో పరిష్కరించాలి

- ప్రజావాణి ఫిర్యాదులపై జీహెచ్‌ఎంసీ కమిషనర్

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి బాధ్యతతో త్వరితగతిన వాటిని పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కమిషనర్ వినతులు స్వీకరించారు. మొత్తం 62 విన్నపాలు వచ్చాయి. ఫోన్ ఇన్‌ద్వారా 5 ఫిర్యాదులు వచ్చాయి.

### కలెక్టరేట్‌లో 121 దరఖాస్తులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై 121 మంది దరఖాస్తులు అందజేశారు. ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ ముకుంద రెడ్డి, అదనపు కలెక్టర్ కదిరివన్ పలని, జిల్లా అధికారులు జి. ఆశన్న, ఆర్. కోటాజీ, పవన్‌కుమార్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సెయిలింగ్‌లో హైదరాబాదీల సత్తా



సెయిలర్ లాహిరి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ జూనియర్ సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ సెయిలర్లు ఆరు పతకాలు కొల్లగొట్టారు. ముంబైలో జరిగిన ఈ పోటీల్లో రసూల్‌పురాకు చెందిన లాహిరి అండర్-16లో స్వర్ణం సాధించింది. తనూజ కామేశ్వర్-శ్రవణ్ జోడీ జూనియర్ డబుల్ హ్యాండర్ విభాగంలో పసిడి సాధించింది. అండర్-15 విభాగంలో బన్నీ స్వర్ణం, రిజ్వాన్ మహమ్మద్ రజతం, రవి కాంస్యం గెలిచారు. అండర్-15 బాలికల కేటగిరీలో చంద్రలేఖ కాంస్యం సాధించింది. ఈ సెయిలర్లందరూ రసూల్‌పురాలోని ఉద్భవ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు కావడం విశేషం. పతకాలు సాధించిన సెయిలర్లను హైదరాబాద్ యాచ్ క్లబ్ అధ్యక్షుడు, కోచ్ సుహీం షేక్ అభినందించారు.

## ఒకే లేన్.. మిగతావన్నీ క్లోజ్!

(5వ పేజీ తరువాయి)

టోల్ లైన్లు ఉన్నాయి. వాటిలో ఇప్పుడు ఒక ఫాస్టాగ్, ఒక క్యాష్ లేన్ల నుంచి మాత్రమే వాహనాలను అనుమతిస్తున్నారు. మిగతా లేన్లు మూసివేశారు. ఔటర్ రింగ్‌రోడ్డుపై ప్రయాణించే వాహనాల్లో 90 శాతం ఫాస్టాగ్ కలిగినవే ఉంటాయి. అవన్నీ ఒకే లేన్ గుండా వెళ్లాల్సి రావడంతో ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తుతున్నాయి.

### కారణాలేంటి?

ఫాస్టాగ్ లేన్లు ఎన్ని ఎక్కువగా ఉంటే టోల్‌ప్లాజాల వద్ద వాహనాల ఆగే సమయం అంత తగ్గుతుంది. శివారు ప్రాంతాలకు వెళ్లేవారిలో చాలా మంది ఔటర్ గుండా వెళ్లేందుకే ఆసక్తి చూపుతారు. ట్రాఫిక్ జామ్ నుంచి తప్పించుకునేందుకు వాళ్లందరూ ఔటర్ ఎక్కితే ప్రస్తుతం టోల్‌ప్లాజాల వద్ద ఆగిపోవాల్సి వస్తోంది. అయితే లేన్లు మూసివేయడానికి గల కారణాలను టోల్ ప్లాజాల సిబ్బంది చెప్పడం లేదు. సాంకేతిక సమస్యల వల్లే ఫాస్టాగ్ లేన్లు మూసేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/tEcQKUSలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

# తవ్వారు.. వదిలేశారు

## నాలుగు నెలలైనా సీసీ రోడ్డు నిర్మాణానికి నోచుకోని వైనం



సీసీ రోడ్డు కోసం తవ్విన రహదారి

- స్థానికులు, వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు
- శంషీర్‌గంజ్- రాజన్నబావి రహదారి దుస్థితి ఇదీ..

చాంద్రాయణగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి): శంషీర్‌గంజ్ -రాజన్నబావి ప్రాంతంలో సీసీ రోడ్డు వేసేందుకు రహదారిని తవ్వారు. రోడ్డు వేస్తారు ఇక రాకపోకలు సాఫీగా సాగుతాయని స్థానికులంతా సంబరపడిపోయారు. కాంట్రాక్టర్ వారి ముఖంపై ఉన్న చిరునవ్వు ఎంతో కాలం ఉండనివ్వలేదు. ఇప్పటికే నాలుగు నెలలు గడుస్తున్నాయి. అయినా తవ్విన రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అందులో గుండానే వాహనాలు ప్రయాణిస్తున్నాయి. కాలి నడకన వెళ్లే బాటసారులు తమ రోజూవారీ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇక రూట్‌లో రెండు పాఠశాలలున్నాయి ఉన్నాయి ప్రస్తుతం స్కూల్స్ సెలవులు కావడంతో ఎలాంటి ఇబ్బంది లేదు. ఒకవేళ స్కూల్స్ కొనసాగితే కనుక విద్యార్థుల కోసం వచ్చే బస్సులకు వాహనాలకు ఇబ్బందులు తప్పవు.

**గతంలో పరిస్థితి ఇదీ..**

శంషీర్‌గంజ్ రాజన్నబావి రహదారి రెండు సంవత్సరాలుగా రోడ్డు గుంతలమయంగా మారింది. స్థానిక నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి నిధులు మంజూరు చేయించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు సాగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



**చర్యలు తీసుకోవాలి**

శంషీర్‌గంజ్ నుంచి రాజన్నబావి వరకు మంజూరైన రోడ్డును వేయడంలో రాజకీయం చేస్తున్నారు. ఎమ్మెల్యే, కాంట్రాక్టర్ మధ్య జరిగిన చీకటి ఒప్పందానికి అధికారులు వత్తాసు పలుకుతున్నట్లు కనిపిస్తున్నది. ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి.

ఉదయ్‌కిరణ్‌రెడ్డి, బీజేపీ బహదూర్‌పురా నియోజకవర్గ కన్వీనర్



మాట్లాడుతున్న సభావత్ రాజునాయక్

## ఐటీ పార్కు ఏర్పాటు ఆలోచన విరమించుకోండి

- భూములు లాక్కుంటే సహించం
- పలు లంబాడా గిరిజన సంఘాలు

బర్కత్‌పుర, మే 12 (ఆంధ్రజ్యోతి) : శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లి తండాలో ఐటీ పార్కు ఏర్పాటు ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని పలు లంబాడా గిరిజన సంఘాలు నేతలు డిమాండ్ చేశారు. ఐటీ పార్కు పేరుతో గిరిజనుల భూములను లాక్కుంటే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధిత రైతులతో కలిసి ఆలిండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సభావత్ రాజునాయక్, ఆలిండియా ట్రైబల్ జేఏసీ చైర్మన్ రవీందర్ నాయక్, గిరిజన సంఘం అధ్యక్షుడు ఎం.ధర్మానాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడు రాంబాల్ నాయక్, ఓయూ జేఏసీ నేత రవిరాథోడ్, హైకోర్టు న్యాయవాది కె.శ్రీనివాసరావులు మాట్లాడారు. గోపన్నపల్లి తండాలోని సర్వేనంబర్ 127 నుంచి 168 వరకు గల 439 ఎకరాల 17 గుంటల భూమిని 72 గిరిజన కుటుంబాలు గత కొన్ని సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్నాయని తెలిపారు. ఈ భూమిలో ప్రభుత్వం ఐటీ పార్కు ఏర్పాటు చేయాలని యోచిస్తోదన్నారు. దీంతో గిరిజన కుటుంబాలు భూములు కోల్పోయి వీధినపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాధిత రైతులు ఎస్.కిషన్, ఎస్.గోపీనాయక్, హనుమంతు, ఎన్.పాండు, రాంచందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ నేతలు

## కనీస వేతనాలు ఇవ్వాలి

బర్కత్‌పుర, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యవసాయ మార్కెట్ శాఖలో పని చేస్తున్న దడువాయిలను స్కీమ్ వర్కర్స్‌గా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ నేతలు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వారు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ మార్కెట్‌లలో రైతులు తెచ్చిన ఉత్పత్తులకు తూకాలు వేసి ప్రభుత్వానికి రోజూవారి లెక్కలు తెలుపుతున్న దడువాయి హమాలీ కార్మికులకు సుప్రీం తీర్పు ప్రకారం కనీస వేతనాలు మార్కెట్ కమిటీ ద్వారా చెల్లించాలని కోరారు. ఇఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఎక్స్‌గ్రేషియా 5 లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షల రూపాయలు అందజేయాలన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని వారన్నారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్నగౌడ్, తెలంగాణ వ్యవసాయ మార్కెట్ దడువాయి హమాలీ యూనియన్ అధ్యక్షుడు సరసాని సురేందర్, ప్రధాన కార్యదర్శి ఎన్.రవికుమార్, కోశాధికారి బి.వీరన్నలు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న భయ్యాలాల్‌నగర్ వాసులు

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

మదీన, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న అన్నారు. అందిన ఫిర్యాదులను పరిశీలించి తక్షణమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగింది. కార్యక్రమంలో వీధిదీపాల సమస్యపై రెండు, ఇంజనీరింగ్ సమస్యపై రెండు, టౌన్‌ప్లానింగ్ సమస్యపై మూడు, పారిశుధ్య సమస్యపై రెండు, జనన, మరణ సర్టిఫికెట్ల సమస్యపై ఒకటి మొత్తం 10 ఫిర్యాదులు అందాయి. తమకు అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జోనల్ కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ సిటీ ప్లానర్ మహ్మద్ అబ్దుల్ మాజిద్, ఏఎంసీ రాజారావు పాల్గొన్నారు.

## రాజీవ్ వికాసంలో సిబిల్ స్కోర్ షరతు ఎత్తేయండి



ఎడ్ల పండరినాథ్

చాంద్రాయణగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసంలో సిబిల్ స్కోర్ అనే షరతు అవసరమా? అని బీజేపీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కన్వీనర్ ఎడ్ల పండరినాథ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన పథకంలో సిబిల్ స్కోర్ అనే షరతును విధించడం ద్వారా 40 శాతం దరఖాస్తులు ఇప్పటికే తిరస్కరణకు గురైనట్లుగా తెలుస్తోందన్నారు. ఎస్సీఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు ఉపాధి కల్పించేందుకు అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం ఒక పక్క ప్రకటిస్తూనే మరోపక్క లేనిపోని షరతులు విధించి వారి ఉపాధి అవకాశాలకు గండికొట్టాలని చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు బ్యాంకుల నుంచి రుణాలు పొందని యువతకు సిబిల్ స్కోర్ ఎలా వస్తుందని ప్రశ్నించారు. దీనిపై స్పందించి ఎలాంటి షరతుల్లేకుండా రుణాలు అందించాలని కోరారు.

## మిస్ వరల్డ్ పోటీలు ప్రపంచానికే తలమానికం



గౌరి సతీష్

గన్‌పార్క్, ఏప్రిల్ 13, (ఆంధ్రజ్యోతి): మన మహానగరం హైదరాబాద్‌లో నిర్వహిస్తోన్న 72వ ప్రపంచ సుందరీమణుల పోటీలు ప్రపంచానికే తలమానికమని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ అన్నారు. ఈ పోటీలతో మన నగర ఖ్యాతి ఎంతో పెరుగుతోందని, ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ బడా కంపెనీలు ముందుకొస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం నాంపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోని 110 దేశాలకు చెందిన సుందరీమణులు మిస్‌వరల్డ్ పోటీలో పాల్గొనడం అభినందనీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నగరంతోపాటు రాష్ట్ర పర్యాటకానికి ఎంతో వన్నె తెస్తాయని కొనియాడారు. భారత్ తరఫున నందిని గుప్తా మన దేశం గొప్పతనం, సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారని కొనియాడారు.

## శ్మశానవాటికలో సమస్యల పరిష్కారానికి నిధులు

- కాంగ్రెస్ ఓబీసీ సెల్ గ్రేటర్ ఉపాధ్యక్షుడు శ్యామ్‌రావు డిమాండ్

చాంద్రాయణగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి) : నల్లవాగు హిందూ శ్మశానవాటిక, ధోబీఘాట్‌లో సమస్యలు తిష్టవేశాయని కాంగ్రెస్ ఓబీసీ సెల్ గ్రేటర్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యామ్‌రావు ముదిరాజ్ వాపోయారు. సోమవారం దక్షిణ మండలం జోనల్ కార్యాలయంలో ఈఈ సలావుద్దీన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సమాధులపై స్థానికులు చెత్తాచెదారం వేస్తున్నారన్నారు. ఇనుప కంచె, ధోబీఘాట్‌లో సీసీ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలన్నారు. ఇప్పటికే మంజూరైన సీసీ రోడ్డు పనులను కూడా పూర్తి చేయాలని కోరారు. ఈఈని కలిసినవారిలో భాగ్యనగర్ బ్యాగరి సంఘం అధ్యక్షుడు పేరోజి సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఈఈ సలావుద్దీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాశమోని శ్యామ్‌రావు ముదిరాజ్

## జలమండలి అధికారులు ఏం చేస్తున్నారు?

- రోడ్లపై పారుతున్న మురుగు
- తాగు నీటికి కూడా ఇబ్బందులు
- ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలి



మైలార్‌దేవుపల్లిలో రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీటిని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రాజేంద్రనగర్, మే 12(ఆంధ్రజ్యోతి) : మైలార్‌దేవుపల్లి బస్తీలో సోమవారం బీఆర్‌ఎస్ మైలార్‌దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడు వెంకటేశ్ పర్యటించారు. ఉమ్మడి హనుమాన్ దేవాలయం పరిసరాలలో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లు పొంగి పారుతున్నాయని, అయినా అధికారులు, సిబ్బంది గానీ పట్టించుకోవడం లేదన్నారు. మైలార్‌దేవుపల్లి జలమండలి అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బస్తీలో ఎక్కడ బోరు నీరు రావడం లేదని, మంచినీటి సరఫరా కూడా అంతంత మాత్రంగానే ఉందని బస్తీ ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వేసవిలో నీటి సమస్యలున్న మైలార్‌దేవుపల్లి బస్తీకి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్ లు స్థానికంగా ఉన్నప్పటికీ మ్యాన్‌హోల్‌లు పొంగి పారుతుండటం సిగ్గుచేటన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నోముల రాము యాదవ్, యువత అధ్యక్షుడు అక్కెం రాఘవేందర్ యాదవ్, అరుణ్ ముదిరాజ్, చిరంజీవి, కొంపల్లి జగదీశ్, రాజు, అప్పో రాజు, భగవాన్ దాస్, రాజు, ప్రవీణ్, వెంకటరమణ, అశోక్ కుమార్, సందీప్, భాస్కర్, సునీల్, సరికొండ మల్లేశ్, భూదేవి, సరిత, అరుణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్షరకుమార్‌కు సేవా సృజన పురస్కారం




అక్షరకుమార్‌ను సత్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, మే 12 (ఆంధ్రజ్యోతి): షరతులు వర్తిస్తాయి అనే సినిమా దర్శకుడు అక్షరకుమార్‌కు సేవా సృజన పురస్కారం ప్రదానం చేశారు. రవీంద్రభారతిలో సోమవారం తెలంగాణ నర్సుల అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ పలువురు నర్సులను సత్కరించి అభినందించారు. ఇందులో భాగంగా దర్శకుడు అక్షరకుమార్ గతంలో నర్సింగ్ రంగంలో చేసిన సేవలకు గాను సేవా సృజన పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం మామిడి హరికృష్ణ మాట్లాడుతూ రోగుల సేవలో నర్సుల చేస్తున్న కృషి ఎనలేనిదని అన్నారు. నర్సింగ్ డే సందర్భంగా ఈ వృత్తిలో పనిచేస్తున్న పలువురు సత్కరించుకోవడం సంతోషకరమన్నారు.




చెక్‌ను అందజేస్తున్న జగన్‌మోహన్ గౌడ్

## పికెల్‌బాల్ విజేత రిషభ్-భాస్కర్ జోడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఏవీకే పికెల్‌బాల్ చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్‌లో రిషభ్ కుమార్-భాస్కర్ ద్వయం విజేతగా నిలిచింది. రెండ్రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు సోమవారం ముగిశాయి. అమెచ్యూర్ తెలంగాణ పికెల్‌బాల్ అసోసియేషన్ (ఏటీపీఏ) ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మహిళల డబుల్స్‌లో అనీష-దీప్తి జోడీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో రౌనక్-జీనా జంట టైటిళ్లు దక్కించుకున్నారు. విజేతలకు ఏటీపీఏ కార్యదర్శి జగన్‌మోహన్ గౌడ్, ఉపాధ్యక్షురాలు సుచరిత, ఏవీకే పికెల్‌బాల్ అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి వెంకట్ పతకాలు ప్రదానం చేశారు.



భూపాల్‌ను సన్మానిస్తున్న స్నేహితులు

## దేశాల భూపాల్‌కు అభినందనలు

రాజేంద్రనగర్, మే 12(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సమాచార కమిషనర్‌గా రాజేంద్రనగర్ ఇంద్రారెడ్డినగర్‌కు చెందిన న్యాయవాది దేశాల భూపాల్ నియామకం కావడంపై ఈ ప్రాంతవాసులు అభినందనలు తెలిపారు. సోమవారం ఆయన స్నేహితులు, స్థానికులు, జర్నలిస్టులు ఎస్.వీరాంజనేయులు, క్యాసారం శంకర్‌రావు, ఎం.బాలసుబ్రమణ్యం, యు. శ్రీకాంత్ కలిసి సంతోషం వ్యక్తం చేశారు. పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు డాక్టర్ కాటం శ్రీధర్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ వన్నెజ్ సుధాకర్‌లు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంఏ పొలిటికల్ సైన్స్‌తో పాటు ఉస్మానియా వర్శిటీ నుంచి ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు భూపాల్. కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కో కన్వీనర్‌గా పనిచేస్తున్నారు.




కేక్ కట్ చేస్తున్న సూపరిటెండెంట్ డాక్టర్ రజని రెడ్డి, తదితరులు

## నర్సుల సేవలు అనిర్వచనీయం

- ఆస్పత్రి సూపరిటెండెంట్ డా.రజని రెడ్డి

చార్మినార్, మే 12 (ఆంధ్రజ్యోతి) : నర్సుల సేవలు వేల కట్ట లేనివని పెట్లబుర్జ్ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరిటెండెంట్ డా. రజని రెడ్డి అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా పెట్ల బుర్జ్ ఆస్పత్రి నర్సులతో కలిసి ఆమె సోమవారం కేక్ కట్ చేశారు. రోగుల ఆరోగ్య పునరుద్ధరణలో నర్సుల పాత్ర కీలకమైందన్నారు. అనంతరం నర్సుల సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కొవిడ్ సమయంలో ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వహించిన తీరును మనం ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ఆస్పత్రులకు వచ్చే రోగులు కుటుంబ సభ్యులుగా భావించి మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బుద్ధుడి బోధనలు శాంతి, సామరస్యానికి ప్రతీక



వెంకటేష్‌చౌహాన్

బర్కత్‌పుర, మే 12 (ఆంధ్రజ్యోతి) : గౌతమ బుద్ధుడి బోధనలు ప్రపంచ శాంతి, సామరస్యానికి ప్రతీకలని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్‌చౌహాన్ పేర్కొన్నారు. బుద్ధ పూర్ణిమ సందర్భంగా బుద్ధుడి విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం బషీర్‌బాగ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలనకు గౌతముడి ఆదర్శలే మార్గదర్శనం అన్నారు. ఆయన బోధనలను నేటి యువత అనుసరించి శాంతియుత జీవనం గడపాలని కోరారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

- 15, 16వ తేదీల్లో హయత్‌నగర్‌లో నిర్వహణ
- రీజినల్ కోఆర్డినేటర్ నాగార్జునరావు

రాజేంద్రనగర్, మే 12(ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రీజినల్ కో ఆర్డినేటర్ కె. నాగార్జునరావు ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలలో గల గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 15,16 తేదీలలో హయత్‌నగర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 15న బాలురు, 16న బాలికలు ఉదయం 10 గంటల సమయంలో హాజరుకావాలని తెలిపారు. 10వ తరగతి మెమో, బదిలీ సర్టిఫికెట్, స్టడీ, కండక్ట్ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 95020-50715, 96034-31550, 90144-47896 నంబర్‌లలో సంప్రదించవచ్చని విజ్ఞప్తి చేశారు.

## రిహార్సల్స్‌లో హడలెత్తించిన శునకాలు


- త్వరలో హెరిటేజ్ వాక్ దృష్ట్యా కార్యక్రమం నిర్వహణ
- రెండు రోజుల వ్యవధిలో 45 శునకాలను పట్టుకున్న బృందాలు

చార్మినార్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మిస్ వరల్డ్ -2025 పోటీదారులు చార్మినార్‌లో హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నారు. దీంతో చార్మినార్, లాడ్ బజార్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న వీధి కుక్కలను పట్టుకునే పనిలో మూడు బృందాలు రంగంలోకి దిగాయి. ఆదివారం చార్మినార్ వద్ద జీహెచ్‌ఎంసీ డాగ్ క్యాచర్ సిబ్బంది రిహార్సల్స్ నిర్వహిస్తే వీధి కుక్కలు బెంబేలెత్తించాయి. పోలీసు బాస్‌లతో పాటు జీహెచ్‌ఎంసీ, టీఎస్‌ఎస్పీడీసీఎల్, పర్యాటక, ఏఎస్ఐ, జలమండలి తదితర ప్రభుత్వ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. అయితే చార్మినార్ సర్కిల్‌కు చెందిన వెటర్నరీ డాక్టర్ వసీం, డా శ్రీకాంత్ ఆధ్వర్యంలో బృందాలు రంగంలోకి దిగి ఆది, సోమవారాల్లో 45 కుక్కలను పట్టుకున్నాయి. రేబిస్ వ్యాక్సిన్ కూడా ఇచ్చాయి.



రక్తం కొరత.. తలసీమియా

# బాధితుల అవస్థ



- నెగెటివ్ గ్రూప్ రక్తం కోసం తప్పని తిప్పలు
- వేసవిలో రక్తదాన శిబిరాలు నిర్వహించని స్వచ్ఛంద సంస్థలు

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎండా కాలం రక్తం కొరతతో తలసీమియా బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలంలో రక్తదాన శిబిరాలు నిర్వహించడానికి ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం లేదు. ముఖ్యంగా నెగెటివ్ గ్రూప్ రక్తం దొరకడం కష్టంగా మారింది. ఏబీ, ఓ, బి, ఏ-గ్రూపుల నెగెటివ్ రక్తం కావాలంటే అవస్థలు తప్పడం లేదు.

బాధితులు 4,432 మంది

రాష్ట్రంలో దాదాపు 4,432 మంది తలసీమియా బాధితులున్నారు. వీరికి ప్రతీ నెలా రెండుసార్లు రక్తం మార్పిడి చేయాల్సి ఉంటుంది. పెద్ద పిల్లలకు రెండు యూనిట్లు, చిన్న పిల్లలకు ఒక యూనిట్ రక్తం ఇవ్వాలి. వయస్సు, బరువును బట్టి రక్తం ఎక్కించాలి. ప్రతీరోజూ 70 నుంచి 80 మందికి రక్తం అవసరమవుతుండగా, ప్రస్తుతం కేవలం 30 నుంచి 40 మందికి మాత్రమే లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు.

తరచూ రక్తం ఎక్కించాలి

జన్యుపరమైన లోపం వల్ల పిల్లల్లో ఎర్రరక్త కణాలు సరిగా వృద్ధిచెందని వారికి రక్తం ఎక్కించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇలాంటి వారికి పుట్టిన రెండు, మూడు నెలల నుంచే తలసీమియా లక్షణాలు కనిపిస్తాయంటున్నారు. రక్తహీనత, పెరుగుదల బాగా లేకపోవడం, కాలేయం, ప్లీహం వ్యాకోచించడం వంటివి ఉంటే ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తాయని చెబుతున్నారు. వీరికి తరచూ రక్తం ఎక్కించాలని, పరీక్షలు చేయించాలని వైద్యులు సూచిస్తున్నారు.

### దాతలు రక్తదానం చేయాలి

తలసీమియాతో బాధపడే ఒకరికి 15 నుంచి 20 రోజులకు ఒక యూనిట్ నుంచి రెండు యూనిట్ల రక్తం అవసరమవుతుంది. 14 ఏళ్ల లోపు పిల్లలకు ఒక యూనిట్, 15 ఏళ్లపైబడిన వారికి రెండు యూనిట్ల రక్తం అవసరం. కొంతమందికి రెండు వారాలకు ఒకటి నుంచి రెండు యూనిట్ల రక్తం ఇవ్వాలి. తలసీమియా బాధితులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలి. రక్తదానం చేయాలనుకున్న ఆసక్తిగల వారు తలసీమియా సికిల్ సెల్ సొసైటీ, రాఘవేంద్రనగర్, నేషనల్ పోలీస్ అకాడమీ చిరునామాలో సంప్రదించాలి. వివరాలకు 88885534913/9246534913/040-29880731 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు లేదా www.tscsindia.org వెబ్‌సైట్‌ను చూడవచ్చు.

- అలీమ్‌బేగ్, సంయుక్త కార్యదర్శి, తలసీమియా సికిల్ సెల్ సొసైటీ



తార్నాకలో పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కర్ణన్

## వారంలో ఆస్తిపన్ను సర్వే నివేదిక ఇవ్వండి

- అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ఆదేశం

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్నుకు సంబంధించి క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలు, జీఐఎస్ డేటా, స్కెచ్ ఆధారంగా పూర్తిస్థాయి నివేదిక వారంలో సమర్పించాలని అధికారులను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. సోమవారం సికింద్రాబాద్ జోన్‌లోని తార్నాక, చిలకలగూడ, పాటిగడ్డ, రసూల్‌పురా, ప్రకాష్‌నగర్‌లో అభివృద్ధి ప్రతిపాదిత ప్రాంతాలు, పురోగతిలో ఉన్న పనులను పరిశీలించారు. నిర్మాణ రంగ వ్యర్థాలు తరలించని వారికి జరిమానా విధించాలన్నారు. హెచ్-సిటీలో భాగంగా నిర్మించనున్న ఏటీసీ రోడ్డు మార్గాలు, రసూల్‌పురా వంతెన, పాటిగడ్డ ఆర్‌ఓబీ పనులకు భూసేకరణ పూర్తి చేయాలని సూచించారు. ప్రకాష్‌నగర్ ఐఓసీ బంక్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సమీపంలో వరద నీరు నిలిచే ప్రాంతాలను చూసిన ఆయన పూడికతీత పనులు వెంటనే చేపట్టాలని సూచించారు. జోనల్ కమిషనర్ ఎన్. రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న డీసీపీ

## చోరీ అయిన 310 సెల్‌ఫోన్లు స్వాధీనం

- బాధితులకు అందజేత

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న, చోరీ అయిన 310 సెల్‌ఫోన్లను సైబరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితులకు సెల్‌ఫోన్లను డీసీపీ (క్రైమ్స్) ఎల్‌సీ నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) పోర్టల్ ద్వారా చోరీ అయిన ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీసీఎస్ ఏసీపీ కె.శశాంక్ రెడ్డి, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, మాదాపూర్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్, శంషాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పవన్, బాలానగర్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజు, మేడ్చల్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ దాలి నాయుడు, సోషల్ మీడియా ఎస్‌ఐ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## అపార్ట్‌మెంట్‌లో పేకాట

- ఆరుగురి అరెస్ట్.. రూ. 83,920, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం

పేట్‌బషీరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 83,920, ఆరు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. కొంపల్లిలోని ఎన్‌సీఎల్ ఎమరాల్డ్ రెసిడెన్సీలో ఓ ఫ్లాట్‌లో పీబీఎస్ఎన్ రాజు, సి. నర్సింగరావు, ఎం. మనోహర్, జి. రాఘవరెడ్డి, పి. రాజు, జె. రవీందర్‌రెడ్డి పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు సోమవారం దాడిచేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఇంటిని కూల్చవద్దని వేడుకుంటున్న పేదలు

## ప్రభుత్వ భూముల్లో కట్టుకున్న ఆరు ఇళ్లు కూల్చివేత

బిట్స్ పిలానీ, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో కట్టుకున్న రేకుల ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. కాప్రా తహసీల్దార్ సుచరిత ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లో 2, లక్ష్మీనర్సింహ కాలనీలో 2, దివ్యాంగుల కాలనీలో 2 ఇళ్లను సోమవారం కూల్చివేశారు. కూలి నాలి చేసుకుని కట్టుకున్న ఇళ్లను కూల్చివేస్తే తాము ఎట్లా బతకాలంటూ బాధితులు రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. బాలాజీనగర్‌లో బుచ్చమ్మ ఇంటిని కూల్చివేస్తుండగా.. మా జీవితాలు ఆగమవుతాయని వేడుకుంది. అయినా ఇంటిని కూల్చివేయడంతో ఆమెకు అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. బుచ్చమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. ఇళ్ల కూల్చివేతలు ఆపకపోతే ప్రభుత్వంపై పోరాటం చేస్తామని జవహర్‌నగర్ ప్రజలు హెచ్చరించారు.



బుచ్చమ్మను ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు



## నాయిని ఆదర్శాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి

- ఎమ్మెల్సీ మధుసూదనాచారి

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): నాయిని ఆదర్శాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తాయని బీఆర్ఎస్ నేత, శాసన మండలి ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనా చారి పేర్కొన్నారు. మాజీ మంత్రి నాయిని నర్సింహా రెడ్డి జయంతి సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. నాయిని నరసింహారెడ్డి విలువలతో కూడిన రాజకీయాలు చేశారని, తెలంగాణ సాధనకు కేసీఆర్ వెంట మొదటి నుంచి నడిచిన వ్యక్తి అని కొనియాడారు. హైదరాబాద్ అనగానే గుర్తొచ్చే నాయకుల్లో నాయిని ఒకరని.. ప్రజలకు రాత్రి, పగలు అనే తేడా లేకుండా అందుబాటులో ఉండేవారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమ సాధనలో వైఎస్ మంత్రివర్గం నుంచి టీఆర్ఎస్ మంత్రులు వైదొలగాల్సి వచ్చినప్పుడు నాయిని అమెరికాలో ఉన్నా ఫ్యాక్స్ ద్వారా రాజీనామా లేఖ పంపారని తెలిపారు. కేసీఆర్ మనసులో నాయినిది సుస్థిర స్థానం అని మధుసూదనా చారి అన్నారు.

# ఒడిశా నుంచి తీసుకొచ్చి గోదాంలో నిల్వ

- 1.6 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం
- ఇద్దరు స్మగ్లర్ల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్‌లో అక్రమంగా నిల్వ చేసిన 1.6 క్వింటాళ్ల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్స్‌ను అరెస్ట్ చేశారు. సోమవారం నాంపల్లి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ, రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ పి. దశరథ్ వివరాలు వెల్లడించారు. మల్లాపూర్ ఎన్ఎఫ్‌సీ ప్రాంతంలో పాడుబడిన గోదాం వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాకు చెందిన రాంబాబు, హన్మకొండకు చెందిన కట్ల వివేక్‌రెడ్డిగా తేలింది. ఒడిశా నుంచి కారులో గంజాయి తీసుకొచ్చి గోదాములో నిల్వ చేసినట్లు అంగీకరించారు. పోలీసులు గోదాంలో తనిఖీ చేసి రెండు కిలోలు, కిలో ప్యాకెట్లు చేసి ఉన్న 1.6 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు దగ్గుమల్లి మధుకిరణ్ పరారీలో ఉన్నాడు. సమావేశంలో మల్కాజిగిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, ఏఈఎస్ ముకుందరెడ్డి, ఉప్పల్ ఎస్‌హెచ్‌ఓ బి. ఓంకార్, డీటీఎఫ్ సీఐ భరత్ భూషణ్, ఎస్సైలు నరేశ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పలు ప్రాంతాల్లో 12.230 కిలోల గంజాయి స్వాధీనం

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన ఎక్సైజ్ పోలీసులు ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి 12.230 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 6.50 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. చర్లపల్లి, రాంపల్లి ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన పోలీసులు మధ్యప్రదేశ్‌కు చెందిన హరికుశ్వాహ వద్ద 4 కిలోలు, ఒడిశాకు చెందిన బైనాథ్ బిశ్వాల్ వద్ద 6 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అదనపు కమిషనర్ ఖురేషీ

- నాందేడ్ నుంచి డీసీఎంలో గంజాయి తీసుకొస్తున్నారని ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. నగర శివారులో వాహనాన్ని తనిఖీ చేయగా 2.230 కిలోల గంజాయి లభించిందని ఎస్ఐ బాలరాజు తెలిపారు. డ్రైవర్ రాజును అరెస్ట్ చేశారు.

### 432 కిలోల నల్లబెల్లం పట్టివేత

నగరం నుంచి నాగర్‌కర్నూల్ ఎండబెట్ల గ్రామానికి నల్లబెల్లం తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. నిఘా పెట్టి నగర శివారులో వాహనాన్ని పట్టుకున్నారు. అందులో ఉన్న 432 కిలోల బెల్లం, 10 కిలోల ఆలం(పటిక)ను స్వాధీనం చేసుకుని డ్రైవర్ శివకుమార్‌ను అరెస్ట్ చేశారు.

# వ్యక్తి హత్య కేసులో ఐదుగురి అరెస్ట్

కత్తులు, ద్విచక్రవాహనం స్వాధీనం

పేట్‌బషీరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి సెంట్రల్ పార్కు కూరగాయల మార్కెట్‌లో వ్యక్తిని హత్య చేసిన ఐదుగురు నిందితులను పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు కత్తులు, ద్విచవాహనం స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి, అడిషనల్ డీసీపీ పురుషోత్తం ఏసీపీ రాముడు వివరాలు వెల్లడించారు. మేడ్చల్‌కు చెందిన సయ్యద్ సిద్దిక్, షేక్ అహ్మద్ మధ్య ఈ ఏడాది మార్చిలో మార్కెట్‌లో గొడవ జరిగింది. అహ్మద్‌పై సయ్యద్ సిద్దిక్ దాడి చేసి గాయపరిచాడు. అహ్మద్ ఫిర్యాదు మేరకు పోలీసులు సయ్యద్ సిద్దిక్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి సయ్యద్, అతడి కుటుంబ సభ్యులు కేసు వాపసు తీసుకోవాలని అహ్మద్‌పై ఒత్తిడి చేస్తున్నారు. కేసు వెనక్కి తీసుకోకపోతే చంపేస్తానని సయ్యద్ బెదిరించాడు. అతడితో ప్రాణాపాయం ఉందని షేక్ అహ్మద్ తమ్ముడు షేక్ రహ్మత్‌కు చెప్పాడు. నెల రోజుల నుంచి సయ్యద్ సిద్దిక్ కదలికలపై షేక్ అహ్మద్, షేక్ రహ్మత్, వీరి స్నేహితులు రాజ్‌కమల్, శశికుమార్, వరికుప్పల జంపన్న నిఘా పెట్టారు. ఆదివారం సెంట్రల్ పార్కులో జరుగుతున్న సంతలో సయ్యద్ సిద్దిక్ ఉన్నాడని తెలుసుకున్నారు. ఐదుగురూ అక్కడికి వెళ్లి సయ్యద్ సిద్దిక్‌ను కత్తులతో పొడిచి చంపేసి పారిపోయారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితులను సోమవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. వరికుప్పల జంపన్నపై శామీర్‌పేట, పేట్‌బషీరాబాద్, అల్వాల్, మహంకాళి పోలీస్‌స్టేషన్లలో ఆరు కేసులున్నాయని డీసీపీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి, స్వాధీనం చేసుకున్న కత్తులు

## గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

- 15, 16 తేదీల్లో కౌన్సెలింగ్

హయత్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో గల గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని రీజనల్ కో-ఆర్డినేటర్ కె. నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హయత్‌నగర్ కల్వంచ శాంతినగర్‌లోని బాలుర గురుకుల ప్రతిభా కళాశాలలో 15వ తేదీ ఉదయం 10 గంటలకు బాలురకు, 16న బాలికలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులు టీసీ, పదవ తరగతి మార్కుల మెమో, స్టడీ, కాండక్ట్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ, ఆధార్ జిరాక్స్, స్పోర్ట్స్, పీహెచ్‌సీ ధ్రువీకరణ పత్రాలు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, మూడు కలర్ ఫొటోలు తీసుకొని రావాలని కోరారు. వివరాలకు 9502050715, 9603431550 ఫోన్‌నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

కళాశాలల్లో అందుబాటులో ఉన్న కోర్సుల వివరాలు

| కళాశాల | అందుబాటులో ఉన్న కోర్సులు |
|---|---|
| జంగమ్మెట్ బాలికల కళాశాల | ఎంపీసీ, బైపీసీ |
| ఇబ్రహీంపట్నం బాలుర కళాశాల | ఎంపీసీ, బైపీసీ |
| కందుకూరు బాలుర కళాశాల | సీఈసీ, హెచ్ఈసీ |
| కొత్తూరు బాలుర కళాశాల | సీఈసీ, హెచ్ఈసీ |
| కుల్కచర్ల బాలుర కళాశాల | ఎంపీసీ, బైపీసీ |
| కొడంగల్ బాలుర కళాశాల | ఎంపీసీ, బైపీసీ |
| తాండూరు బాలికల కళాశాల | ఎంపీసీ, బైపీసీ |
| జిన్నారం బాలుర కళాశాల | ఎంపీసీ, బైపీసీ |
| నారాయణఖేడ్ బాలుర కళాశాల | ఎంపీసీ, బైపీసీ |
| కంది బాలుర కళాశాల | సీఈసీ, హెచ్ఈసీ |
| జహీరాబాద్ బాలికల కళాశాల | ఎంపీసీ, బైపీసీ |
| రాసుగుత్తి బాలికల కళాశాల | ఎంపీసీ, బైపీసీ |
| సిర్గాపూర్ బాలికల కళాశాల | ఎంపీసీ, బైపీసీ |

# ‘అందాల’ నగరం.. పర్యాటక శిఖరం

(5వ పేజీ తరువాయి)

149 మెట్లు ఉంటాయి. ఈ నిర్మాణాన్ని గ్రానైట్, సున్నపురాయి, మోర్టార్, పల్వేరైజ్డ్, పాలరాయితో తీర్చిదిద్దారు. చార్మినార్ నిర్వహణను ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) పర్యవేక్షిస్తోంది.

### లాడ్‌బజార్ గాజులకు ప్రత్యేక గుర్తింపు

చార్మినార్ నుంచి ఉన్న నాలుగు ప్రధాన దారుల్లో లాడ్‌బజార్ (చుడీబజార్) ఒకటి. లాడ్ అంటే లక్క అని అర్థం. దీనిని గాజులు తయారు చేసేందుకు ఉపయోగిస్తారు. దానిపై కృత్రిమ వజ్రాలు పొదిగి ఉంటాయి. లాడ్‌బజార్ కిలోమీటరు పొడవునా దుకాణాల వరుస ఉంటుంది. ఇందులో గాజులు, చీరలు, పెళ్లి వస్తువులు, అలంకరణ ఆభరణాలను విక్రయిస్తుంటారు. కుతుబ్‌షాహీ వంశం, నిజాంరాజుల కాలం నుంచి ఉన్న ఈ గాజుల మార్కెట్ చాలా పాతది. ఇక్కడ గాజులతోపాటు ముత్యాలు, ఆభరణాలు, కాటన్ దుస్తులు, దుపట్టాలు లభిస్తుంటాయి.

### నేడు చార్మినార్‌లో ట్రాఫిక్ మళ్లింపు

మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన సుందరీమణులు మంగళవారం నగరంలోని పలు ప్రాంతాలను సందర్శించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ పేర్కొన్నారు. మదీనా జంక్షన్, హిమ్మత్‌పురా, ఓల్గా జంక్షన్, మూసాబౌలి, చౌక్ మైదాన్ కమాన్, ఎటేబార్ చౌక్, షేర్ ఏ బైతుల్ కమాన్, లక్కడ్ కోట్ (పాత సీపీ ఆఫీస్ జంక్షన్) ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తామన్నారు. ట్రాఫిక్ మళ్లింపులు ఆర్టీసీ బస్సులకు కూడా వర్తిస్తాయని వెల్లడించారు. మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 11 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ కోసం 9010203626 ఫోన్ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.





నర్సుల దినోత్సవంలో పాల్గొన్న కేర్ ఆస్పత్రి నర్సులు, వైద్యులు

## ఆరోగ్య వ్యవస్థకు నర్సులు బలమైన స్తంభాలు

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య వ్యవస్థకు నర్సులు బలమైన స్తంభాలని కేర్ గ్రూప్ చీఫ్ మెడికల్ సర్వీసెస్ ఆఫీసర్ డాక్టర్ నిఖిల్ మాథుర్ అన్నారు. ఇంటర్నేషనల్ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సింగ్ సిబ్బంది సేవలకు కృతజ్ఞతగా వారం రోజులపాటు నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాలను బంజారాహిల్స్‌లోని కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. డాక్టర్ అమిత్ సింగ్, డాక్టర్ వీసీ అశోక్ త్రిభువన్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా నర్సుల అవసరం పెరుగుతోందని, ఆస్పత్రుల పనితీరుపై అవగాహన ఉన్న నర్సులు నాయకత్వ పాత్ర తీసుకోవాలన్నారు. నర్సులు పేషెంట్లకు సేవ చేయడమే కాకుండా ఆస్పత్రి పనితీరును మెరుగుపరచడం, బృందాల్ని నడిపించడం, మంచి ఫలితాలను తీసుకురావడంలో ముందుంటున్నారు. చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ విశాల్ మహేశ్వరి, వెస్ట్ సెంట్రల్ ఇండియా రీజనల్ సీఈఓ హరీష్ త్రివేది, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ వినోద్ రామన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు స్వరాజ్య వేదిక నేతలు

## కౌలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

నల్లకుంట, మే 12 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని రైతు స్వరాజ్య వేదిక నేతలు డిమాండ్ చేశారు. సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక నేతలు బి.కొండల్, విస్సా కిరణ్, కన్నెగంటి రవి, ఎస్.ఆశాలత తదితరులు మాట్లాడారు. 2011 సాగుదారుల గుర్తింపు కార్డుల చట్టాన్ని అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఉన్న కౌలు రైతులకు పంట, రైతు బీమా, నష్ట పరిహారం, బ్యాంకు రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన కౌలు రైతులు మంజుల, రమాకాంత్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## మజిల్ స్ట్రోక్‌తో బాధపడుతున్న వ్యక్తికి 9 శస్త్ర చికిత్సలు

మన్సూరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): మజిల్ స్ట్రోక్‌తో బాధపడుతున్న వ్యక్తికి నాసా ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆస్పత్రి న్యూరాలజీ క్లినికల్ డైరెక్టర్ నవీన్ కుమార్, అనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ రాకేష్ వివరాలు వెల్లడించారు. హయత్‌నగర్‌కు చెందిన ఫిజియోథెరపిస్టు డాక్టర్ తిరుపతికి కుడికాలు పాదం వీక్‌గా ఉండడంతో నాసా ఆస్పత్రి వైద్యులను సంప్రదించాడు. వైద్యులు పరీక్షించి రక్త సరఫరా నిలిచిపోవడం, లింబ్ ఎస్కిమియా (మజిల్ స్ట్రోక్)గా గుర్తించి 9 శస్త్రచికిత్సలు చేశారు. రోగి కోలుకోవడంతో 42 రోజుల తర్వాత డిశ్చార్జి చేశారు. తనకు పునర్జన్మనిచ్చిన నాసా ఆస్పత్రి వైద్యులను డాక్టర్ తిరుపతి, అతడి కుటుంబ సభ్యులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

## దరఖాస్తుదారులందరికీ రాజీవ్ యువ వికాసం సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

రాంనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కింద ఇచ్చే సబ్సిడీ రుణాలు దరఖాస్తుదారులందరికీ ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ పథకంలో అనేక షరతులు విధించి సంఖ్యను తగ్గించడానికి చేసే ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో 13 బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ యువతకు రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు నీల వెంకటేష్, మణికంఠ, రాజునేత, గొరిగె మల్లేష్, అంజి, పి.సతీష్, అనంతయ్య, సి.రాజేందర్, బాలయ్య, కౌశిక తదితరులు పాల్గొన్నారు.

## కత్తిపోట్లకు దారి తీసిన కరెంట్ బిల్లు

బోయిన్‌పల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లు విషయమై కిరాయిదారుల మధ్య జరిగిన గొడవ కత్తిపోట్లకు దారితీసింది. ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, ఎస్సై నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రవీందర్ కుమార్ మౌర్య రోజువారీ కూలీ(40). నాలుగేళ్ల నుంచి భార్య సీమ మౌర్యతో కలిసి న్యూబోయినపల్లి సీతారాంపురంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఆరు నెలల క్రితం అదే ఇంట్లోని మరో గదిని బీహార్‌కు చెందిన బికాస్(45) అద్దెకు తీసుకున్నాడు. బికాస్ వంట పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. రవీందర్ కుమార్ మౌర్య, బికాస్ నివసించే పోర్షన్లకు ఒకే విద్యుత్తు మీటర్ ఉంది. ఇంటి యజమాని సూచనల మేరకు ప్రతినెలా ఇరువురు విద్యుత్తు బిల్లును కలిసి చెల్లిస్తున్నారు. వేసవికాలం కావడంతో మే నెల బిల్లు ఎక్కువగా వచ్చింది. నేను ఒంటరిగా ఉంటున్నానని, ఎక్కువసేపు ఇంట్లో ఉండడం లేదని, సగం బిల్లు చెల్లించలేనని రవీందర్‌కుమార్ ఇంట్లో లేనప్పుడు బికాస్ అతడి ఇంటికి పలుమార్లు వెళ్లి సీమ మౌర్యకు చెప్పాడు. ఈ విషయం ఆమె భర్తకు చెప్పింది. తాను ఇంట్లో లేనప్పుడు తన ఇంటికి రావడం పద్ధతి కాదని రవీందర్‌కుమార్ బికాస్‌ను మందలించాడు. దీంతో ఇరువురి మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన బికాస్ కత్తితో రవీందర్‌కుమార్ మౌర్య చేయి, కాలిపై దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




ఆహారం ఆరోగ్యం

# అల్పాహారంలో పొరపాట్లు

ఉదయం సరైన అల్పాహారం తీసుకుంటే రోజంతా హుషారుగా ఉండడంతో పాటు శరీరం శక్తిని ఖర్చు చేసే వేగం (మెటబాలిజం) మెరుగుపడుతుంది. అయితే అల్పాహారం విషయంలో చేసే పొరపాట్లు మెటబాలిజంను మందగించేలా చేస్తాయి. కాబట్టి ఈ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం.

- ఉదయం అల్పాహారం తీసుకోకుండా ఉండకూడదు. అల్పాహారం తీసుకోకపోతే శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం మందగిస్తుంది. అంతేకాకుండా ఉదయం తినకపోవడం వల్ల మిగిలిన రోజంతా అతిగా తినే ప్రమాదం ఉంటుంది. దాంతో అధిక బరువు పెరుగుతారు.
- ఉదయాన్నే తీపి పదార్థాలు తినకూడదు. అలా తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగిపోయి శక్తి తగ్గుతుంది. దాంతో మెటబాలిజం నెమ్మదిస్తుంది.
- ప్రొటీన్ ఉన్న అల్పాహారం తినాలి. ప్రొటీన్ కడుపు నిండిన భావనతో పాటు కండరపుష్టికి తోడ్పడుతుంది. ఇది మెటబాలిజం మెరుగుదలకు సహాయపడుతుంది.
- అల్పాహారం ఆలస్యంగా తీసుకోకూడదు. అల్పాహారం ఆలస్యమైతే మెటబాలిజం నిర్వహణలో కీలక పాత్ర పోషించే శరీర జీవగడియారం దెబ్బతింటుంది.
- పీచు అందించే అల్పాహాలం తీసుకోవాలి. పీచు, పేగుల ఆరోగ్యాన్ని సంరక్షించడంతోపాటు మెటబాలిజంను మెరుగుపరుస్తుంది. క్యాలరీలను సమర్థవంతంగా ఖర్చు చేయడంలోనూ పీచు ముఖ్య పాత్ర పోషిస్తుంది.
- పరగడుపున కాఫీ తాగకూడదు. ఖాళీ కడుపుతో కాఫీ తాగితే కార్టిసాల్ పెరుగుతుంది. దీని వల్ల చక్కెర నియంత్రణకు ఆటంకం ఏర్పడుతుంది. దాంతో కాలక్రమేణా మెటబాలిజం మందగిస్తుంది.



మానసికం

# ప్యానిక్ అటాక్స్‌కు చెక్

అకస్మాత్తుగా గుండెల్లో రైళ్లు పరిగెత్తుతాయి. శ్వాస తీసుకోవడం కష్టమైపోతుంది. మాట పెగలదు. ఇవన్నీ ప్యానిక్ అటాక్స్ లక్షణాలు. అయితే కొన్ని చిట్కాలతో ఆ పరిస్థితి నుంచి బయటపడొచ్చు. అదెలాగంటే..

### శ్వాసతో...

- నెమ్మదిగా నాలుగు అంకెలు లెక్కబెడుతూ శ్వాస పీల్చుకోవాలి
- గాలి పీల్చుకున్న తర్వాత నాలుగు అంకెలు లెక్కబెట్టాలి
- తర్వాత నాలుగు అంకెలు లెక్కపెడుతూ శ్వాస వదలాలి
- పరిస్థితి మెరుగయ్యేవరకూ ఇలాగే శ్వాస తీసుకుని, వదులుతూ ఉండాలి

### చూపు, స్పర్శ, రుచి

- కంటికి ఎదురుగా కనిపించే ఐదు వస్తువుల పేర్లు చెప్పాలి
- నాలుగు వస్తువులను తాకాలి
- 3 శబ్దాలను వివరించాలి
- రెండు వాసనలను పసిగట్టాలి
- ఒక పదార్థాన్ని రుచి చూడాలి
- ఇలా చేయడం వల్ల ధ్యాస మరలి నెమ్మది చేకూరుతుంది

### భరోసా

ప్యానిక్ అటాక్స్ తాత్కాలికమైనవనీ, అవి వచ్చినంత వేగంగా మాయమై పరిస్థితి సర్దుకుంటుందనే విషయాన్ని గుర్తు పెట్టుకుని మనకి మనం ధైర్యం చెప్పుకోవాలి.



**మెడ నొప్పి వేధిస్తోందా? వీపు నొప్పి చంపేస్తోందా? అయితే ఆ బాధలకు, తప్పుడు శరీర భంగిమలే కారణం కావచ్చు. శరీరాన్ని అసౌకర్యానికి లోను చేసే శరీర భంగిమలు, వాటి పర్యవసానాల గురించి వైద్యులు ఏమంటున్నారో తెలుసుకుందాం!**

# శరీర భంగిమలతో భంగపాట్లు

సాధారణంగా మెడ, వెన్ను, నడుము నొప్పులను ఆ ప్రదేశాల్లోని ఎముకలకే ఆపాదిస్తూ ఉంటాం. అక్కడి కీళ్లలో సమస్య ఉన్నట్టు, అవి అరిగిపోయినట్టు భావిస్తాం. కానీ నిజానికి ఎముకలకు దన్నుగా ఉండే కండరాలు బలహీనపడినప్పుడే ఇలాంటి నొప్పులు మొదలవుతాయి. ప్రత్యేకించి అస్తవ్యస్థ భంగిమల్లో శరీరాన్ని ఇబ్బందికి గురి చేసే వారిలో ఇలాంటి నొప్పులు సర్వసాధారణం. ఎక్కువ గంటల పాటు ఒకే చోట కూర్చుని కంప్యూటర్ పని చేయడం, రోజులో గంటల తరబడి ఫోన్లు ఉపయోగించడం లాంటి అలవాట్లన్నీ ఈ కోవకు చెందినవే! ఇలాంటి అలవాట్లతో తలెత్తే నొప్పులు, వాటి పర్యవసానాల నుంచి విముక్తి పొందాలంటే, మన శరీర భంగిమలను సరి చేసుకోవాలి.

- ఎక్కువ గంటల పాటు కూర్చుని పనులు చేసేవాళ్లు గంట గంటకూ లేచి ఒకట్రెండు నిమిషాలు నడుస్తూ ఉండాలి
- తాగే నీళ్లు కుర్చీకి దూరంగా పెట్టుకుంటే, తరచూ లేచి నడిచే పని కల్పించుకున్నట్టు అవుతుంది
- వ్యాయామంతో శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలి

### తప్పుడు భంగిమలతో...


మన శరీరాన్ని నిర్దిష్టమైన భంగిమలో ఉంచడానికి తగ్గట్టుగానే మన కండరాలు నిర్మితమై ఉంటాయి. నడిచేటప్పుడు కొన్ని కండరాలు చురుగ్గా మారితే, కూర్చున్నప్పుడు మరికొన్ని కండరాలు చురుగ్గా పని చేయడం మొదలుపెడతాయి. మరీ ముఖ్యంగా మన వెన్నుపాము... మెడ, వీపు, నడుము దగ్గర భిన్నమైన కోణాలతో కూడిన వంపును కలిగి ఉంటుంది. ఆ వంపులకు తగ్గట్టు అక్కడి కండరాలు కూడా పనిచేస్తూ ఉంటాయి. కాబట్టి వెన్నులోని వంపులకు తగ్గట్టు శరీరాన్ని ఉపయోగించుకున్నంత కాలం ఎలాంటి సమస్యలూ, నొప్పులూ తలెత్తవు. ఎప్పుడైతే ఆయా వంపులకు భిన్నంగా శరీరాన్ని అసౌకర్యానికి లోను చేస్తామో, అప్పటి నుంచి నొప్పులు వేధించడం మొదలుపెడతాయి.

### వెన్ను వంపు సమస్య

వెన్నులో నొప్పులను అక్కడి కీళ్లు, డిస్కులకే ఆపాదిస్తూ ఉంటాం. కానీ ఇవి రెండూ పనిచేయాలంటే కండరాలు కూడా బలంగా ఉండాలి. సాధారణంగా వెన్నులో ఎలాంటి సమస్య తలెత్తినా దాన్ని డిస్క్ సమస్య, ఎముకల్లో సమస్య లేదా స్పాండిలోసిస్‌గా భావిస్తూ ఉంటారు. దాంతో వైద్యులను కలిసి ఎమ్మారై చేయించుకున్నప్పుడు దాన్లో కూడా ఎముక, డిస్క్ మినహా కండరాల పరిస్థితి కనిపించదు. కానీ ఎక్కువ సందర్భాల్లో అసలు సమస్య కండరాల్లో ఉండే అవకాశం ఎక్కువ. కాబట్టి ఎముకను, డిస్క్‌నూ పట్టి ఉంచే కండరాల ఆరోగ్యం గురించి అంచనా వేయాలి. ఎక్కువ కాలం పాటు ఒకే కోణంలో వంగి కూర్చోవడం వల్ల, వెన్నులో వెన్నుపూసకు దన్నుగా ఉండే కండరాలు ఒత్తిడికి లోనై పటుత్వాన్ని కోల్పోతాయి. దాంతో కండరాల తోడ్పాటు లోపించిన వెన్ను పూసల మధ్య జాగా తరిగిపోయి, క్రమేపీ వెన్ను ముందుకు వంగిపోతుంది. కండరాల ఆసరా లోపించిన కీళ్లు కూడా త్వరగా అరిగిపోతాయనే విషయం గుర్తు పెట్టుకోవాలి. ల్యాప్‌టాప్‌ను ఒళ్లో పెట్టుకుని ముందుకు వంగిపోయి పని చేసే వాళ్లుంటారు. డెస్క్‌టాప్ మానిటర్ దగ్గరకు తలను ముందుకు చాపి పని చేసుకునే వాళ్లుంటారు. దాంతో సరైన కోణాల్లో శరీరాన్ని పట్టి ఉంచే కండరాలు అలసిపోయి, బలహీనపడిపోయి, శరీర భంగిమలు క్రమం తప్పుతాయి.

### మెడ, వెన్ను నొప్పుల వెనక...

ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో మెడ, వెన్ను నొప్పులను ఎదుర్కొంటూ ఉంటారు. ఈ నొప్పులే వీడకుండా వేధిస్తున్నా, భంగిమతో పని లేకుండా నిరంతరం మెడ, వెన్ను, నడుము నొప్పులు బాధిస్తున్నా వాటిని శరీర భంగిమ సమస్యలుగా అనుమానించాలి. వీటిని సరిదిద్దడం కోసం మందులు, కైరోప్రాక్టర్ అనే ప్రత్యామ్నాయ చికిత్సా విధానం, ఫిజియోథెరపీల మీద ఆధారపడడానికంటే ముందు, శరీర భంగిమ మీద దృష్టి పెట్టడం అవసరం. మెడ, వెన్ను సమస్యల విరుగుడు మన లోనే ఉంది. శరీర భంగిమల పరంగా చేస్తున్న తప్పును సరిదిద్దుకుంటే నొప్పులు కచ్చితంగా అదుపులోకొస్తాయి. మెడ, వెన్నులో ఎముకల కీళ్లు అరిగే పరిస్థితి స్పాండిలోసిస్. ఇది పైబడే వయసు ఫలితంగా తలెత్తవచ్చు. ఎముకలను దన్నుగా ఉండే కండరాల పటుత్వం లోపించిన ఫలితంగా మెడ, వెన్నులోని కీళ్లు అరిగి చిన్న వయసులోనే లంబార్ స్పాండిలోసిస్, సర్వైకల్ స్పాండిలోసిస్‌లు వేధించవచ్చు.



### వ్యాయామంతో కండర దన్ను

యవ్వనంలో ఉన్నప్పుడు చాలా వరకూ కండరాలు శక్తిమేరకు సామర్థ్యాన్ని కనబరుస్తూ శరీరాన్ని చురుగ్గానే ఉంచుతాయి. కానీ వయసు పైబడే కొద్దీ అస్తవ్యస్థ భంగిమలతో కండరాలను ఒత్తిడికి లోనుచేసిన ఫలితం నొప్పుల ద్వారా బయల్పడుతూ ఉంటుంది. అయితే వ్యాయామం చేసే వారిలో ఈ సమస్యలు తక్కువ. కండరాలను బలపరిచే వ్యాయామాలతో తప్పుడు భంగిమలతో అలసిపోకుండా ఉండేలా కండరాలను బలోపేతం చేసుకోవచ్చు. వ్యాయామం లోపిస్తే, కండరాలు, ఎముకలు బలహీనపడిపోతాయి. అలాంటప్పుడు వాటి సామర్థ్యం లోపించి, చిన్నపాటి పనులకే డస్సిపోయి, అసౌకర్యాన్ని కలిగించడం మొదలుపెడతాయి. కాబట్టి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోజుకు కనీసం అరగంట పాటైనా వ్యాయామం చేయాలి. బరువులెత్తే వ్యాయామాలతో ఎముకలు బలపడతాయనే విషయం గుర్తు పెట్టుకోవాలి.

### ఏది ఒప్పు - ఏది తప్పు?

- శరీర భంగిమల్లో ఏది ఒప్పో, ఏది తప్పో తెలుసుకోవడం అవసరం. అవేంటంటే..
- **కంప్యూటర్ పని:** వీపు కుర్చీకి పూర్తిగా ఆనించి, నిటారుగా కూర్చోవాలి. తుంటి ఎముక, మోకీలు సమాంతరంగా ఉండాలి. కంటి చూపు, మానిటర్‌కు సమాంతరంగా ఉండాలి. అలాగే మోచేయి, ముంజేయి డెస్క్‌కు సమాంతరంగా ఉండేలా చూసుకోవాలి.
- **నిలబడడం:** కొందరు నడుము పైభాగాన్ని ముందుకు వంచి నిలబడతారు. ఇంకొందరు వెనక్కి వంచి నిలబడతారు. కొందరు భుజాలను ముందుకు వంచేస్తారు. నిజానికి ఇవేవీ సరైన శారీర భంగిమలు కావు. నిలబడేటప్పుడు శరీర బరువు రెండు కాళ్ల మీద సమంగా పడేలా చూసుకోవాలి. వెన్ను, మెడ నిటారుగా ఉండాలి. ఎక్కువ సమయం నిలబడవలసి వచ్చినప్పుడు, శరీర బరువును ఒక కాలి పైనుంచి మరో కాలి పైకి తరచూ మారుస్తూ ఉండాలి.
- **బరువులు ఎత్తడం:** బరువు ఎత్తగానే నడుము పట్టేస్తుందంటే, బరువును లేపే పద్ధతిలో తప్పు ఉందని అర్థం చేసుకోవాలి. నడుము పైభాగాన్ని వంచి, బరువును చేతులతో పైకి లేపే ప్రయత్నం చేస్తే, వెన్ను మీద ఒత్తిడి పడుతుంది. అలాకాకుండా మోకాళ్లను వంచి, కిందకు కుంగి బరువును లేపాలి. ఇలా చేస్తే తేలికగా బరువును లేపగలగడంతో పాటు వెన్ను సురక్షితంగా ఉంటుంది.
- **కీబోర్డ్:** కంప్యూటర్ కీబోర్డు మీద టైప్ చేసేటప్పుడు, అరచేతులు బోర్డుకు ఆనించకూడదు. అలాగే రెండు చేతులు సమాంతరంగా ఉండాలి. వేర్వేరు దిశల్లో ఉండకూడదు. మణికట్టును మరీ కిందకు, లేదా మరీ పైకి లేపి ఉంచి, వేళ్లతో టైప్ చేయకూడదు.
- **మొబైల్ ఫోన్:** రోజులో ఎక్కువ సమయం మొబైల్ ఫోన్ వాడే వాళ్లు, వీలైనంత వరకూ ఫోన్‌ను ముఖానికి ఎదురుగా చేత్తో పట్టుకుని వాడుకోవాలి. టెక్స్ట్ చేసేటప్పుడు, తలను మరీ కిందకు దించడం, మెడ వంపులో ఫోన్ ఇరికించుకుని మాట్లాడడం చేయకూడదు. సాధ్యమైనంతవరకూ ఇయర్ పాడ్స్ లేదా ఇయర్ ఫోన్స్ ఉపయోగించాలి.

**డాక్టర్ వంశీకృష్ణ వర్మ పెన్మెత్స**
సీనియర్ స్పైన్ సర్జన్,
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్.



వేసవి ఆహారం

# వేసవి వేడికి విరుగుడు

**నడి వేసవిలో శరీరాన్ని చల్లగా ఉంచే మార్గాల కోసం వెతుకుతూ ఉంటాం. దాహార్తిని తీర్చడంతో పాటు పొట్టను చల్లగా ఉంచే పానీయాలకే పెద్ద పీట వేస్తూ ఉంటాం. అయితే వేసవి సెగ, వేడి ప్రభావాల నుంచి రక్షణ కల్పించి శరీరాన్ని చల్లగా ఉంచే ఆహారపదార్థాలను ఎంచుకోవాలి. అవేంటంటే...**

వేసవిలో డీహైడ్రేషన్‌తో ఎండదెబ్బకు గురి కాకుండా ఉండాలంటే నీరు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రత్యేకించి పుచ్చకాయ, దోస, నారింజ, నిమ్మ, పైనాపిల్ లాంటి పుల్లని పండ్లు ఎక్కువగా తినాలి. పసుపు, నారింజ రంగు పండ్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. అలాగే ఆకుకూరలు ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి. అలాగే ద్రవాహారం పరిమాణం పెంచాలి. అందుకోసం కొబ్బరినీళ్లు, మజ్జిగ, నిమ్మరసం లాంటివి తరచూ తీసుకుంటూ ఉండాలి. యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా దొరికే బెర్రీ పండ్లు తింటూ ఉండాలి. అలాగే తాజా సూప్స్ కూడా తీసుకోవచ్చు. పలురకాల కూరగాయలు, మొక్కజొన్నలతో తయారుచేసిన సూప్స్, పాలకూర సూప్ లాంటివి తీసుకోవచ్చు.

### ఒంట్లో నీటి శాతం తగ్గకుండా...

వేసవిలో సాయంకాలానికి శరీరం నిస్సత్తువగా మారిపోతూ ఉంటుంది. తెలియని బడలిక ఆవరిస్తుంది. ఇలా జరగకుండా ఉండాలంటే శరీరాన్ని చల్లబరిచి, తేలికగా ఉంచే పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. అందుకోసం పాలకూర, లెట్యూస్ లాంటివి తరచూ తీసుకుంటూ ఉండాలి. వీటిలో క్యాలరీలు తక్కువ, నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి శరీరంలో ద్రవ నష్టం తొలగిపోయి, శక్తి సమకూరుతుంది. అలాగే టమేటాల్లో యాంటీఆక్సిడెంట్లు, నీటి శాతం ఎక్కువ కాబట్టి. వంటల్లో వీటిని ఎక్కువగా వాడుకోవాలి. అలాగే బత్తాయి, నిమ్మ, ఉసిరి, జామ ఎక్కువగా తినాలి. వీటిలోని విటమిన్ సి, నిస్సత్తువను దూరం చేస్తుంది. వీటిలో నీటితో పాటు యాంటీఆక్సిడెంట్లు కూడా ఎక్కువ కాబట్టి వేసవిలోని బడలిక కూడా దూరమవుతుంది. కీరదోసలో విటమిన్ కె, సిలు ఉంటాయి. పైగా ఇది శరీరాన్ని అద్భుతంగా చల్లబరుస్తుంది. కాబట్టి కీరదోసకాయలు కూడా తరచూ తీసుకుంటూ ఉండాలి. అలాగే పుచ్చలో నీటితో పాటు ఎలక్ట్రొలైట్స్ కూడా పుష్కలంగా ఉంటాయి. వేసవిలో పుచ్చకు ప్రాధాన్యం ఇవ్వాలి.

### తేలికగా జీర్ణమయ్యేలా...

వేసవిలో తేలికగా అరిగే పదార్థాలనే ఎంచుకోవాలి. వాటిలో చెప్పుకోదగినవి... 'సలాడ్స్'! ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల ముక్కలతో తయారుచేసిన సలాడ్‌ను భోజనానికి ముందూ, తర్వాత తీసుకుంటూ ఉండాలి. అలాగే కూరగాయలను ఉడకబెట్టి తయారుచేసిన సూప్స్ లేదా ఫ్రిజ్‌లో చల్లబరిచిన సూప్స్ తాగుతూ ఉండాలి. వీటితో శరీరంలో నీటి శాతం పెరగడంతో పాటు తేలికగా జీర్ణమై శక్తి సమకూరుతుంది. అలాగే పెరుగులో అరటి, స్ట్రాబెర్రీ పండ్ల ముక్కలు కలుపుకుని తింటూ ఉండాలి. కొబ్బరినీళ్లు, ఉప్పు/చక్కెర కలపని మజ్జిగ తీసుకోవాలి. వీటితో వేసవి వేడిమి నుంచి ఉపశమనం దక్కుతుంది. హెర్బల్ టీలు కూడా తాగుతూ ఉండాలి. తాపం తీరడం కోసం ఐస్‌డ్ హెర్బల్ టీలు ఎంచుకోవచ్చు. గ్రీన్ టీ, బ్లూ పీ టీ, క్యామొమైల్ టీలు వేసవి తాపాన్ని తీరుస్తాయి. అలాగే కొద్దిగా నూనె చిలుకరించిన లేదా నూనె ఉపయోగించని కూరగాయ ముక్కలను గ్రిల్ చేసి తినాలి. ఇవి కూడా తేలికగా అరిగి, శక్తిని అందిస్తాయి. బార్లీ నీళ్లు రుచికరమైనవే కాదు, పోషకభరితమైనవి కూడా! అలాగే రాగి జావ, మజ్జిగలు తాగొచ్చు. దీన్లోని క్యాల్షియం శరీరానికి శక్తినిస్తుంది. చియా నీళ్లు శరీరానికి చల్లదనం అందిస్తాయి.

### భారీ ఆహారం వద్దు

అధిక ఉప్పు, నూనె, కొవ్వులు కలిగిన పదార్థాలకు దూరంగా ఉండాలి. బిరియానీ, పానీ పూరి, సమోసాలు, కచోరిలు, బజ్జీలు, నూనెలో వేయించే ఇతరత్రా చిరుతిళ్లు, ఐస్‌క్రీమ్స్, చాక్లెట్లు, శీతల పానీయాలు తగ్గించాలి. వీటిలోని కృత్రిమ తీపిపదార్థాలు, చక్కెరలు, కొవ్వులు దాహార్తిని పెంచుతాయి. డీహైడ్రేషన్‌కు గురి చేస్తాయి. ఉప్పు ఎక్కువగా ఉండే అప్పడాలు, చిప్స్, నిల్వ పచ్చళ్లు ఈ కాలంలో తీసుకోకపోవడమే మేలు. మాంసకృత్తుల కోసం చర్మం తొలగించిన చికెన్, చేప, టోఫు (సోయా పనీర్) తీసుకోవాలి.

### చల్లని చిరుతిళ్లు

వేసవిలో చల్లగా తినడం కోసం ఐస్‌క్రీమ్స్‌ను ఎంచుకుంటూ ఉంటాం. అయితే వీటితో అదనపు చక్కెరలు శరీరంలోకి చేరకుండా ఉండడంతో పాటు పోషకాలను పొందడం కోసం, ఫ్రూట్ పాప్సికల్స్‌ను ఇంట్లోనే తయారుచేసుకుని తినొచ్చు. పుచ్చకాయ రసాన్ని అచ్చుల్లో నింపి, డీప్ ఫ్రీజ్ చేసి ఫ్రూట్ పాప్సికల్స్ తయారుచేసుకోవచ్చు. పెరుగులో పండ్ల ముక్కలు కలిపి, ఫ్రోజెన్ యొగర్ట్‌లా తినొచ్చు. పండ్ల ముక్కలను పెరుగు, లేదా కొబ్బరిపాలతో కలిపి మిక్సీలో వేసి, ఆ మిశ్రమాన్ని మౌల్డ్స్‌లో నింపి, ఫ్రిజ్‌లో గడ్డకట్టించి తినొచ్చు.

ఎండదెబ్బ నుంచి కోలుకోవడంలో ఆరోగ్యకరమైన కొవ్వులు ఎంతో బాగా సహాయపడతాయి. అందుకోసం అవకాడొ, ఎండుద్రాక్ష, ఎండు ఖర్జూరం లాంటివి ఎంతో బాగా ఉపయోగపడతాయి. వీటిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు మెదడు, గుండె పనితీరులకు తోడ్పడతాయి. అలాగే సలాడ్‌లో అవకాడొ ముక్కలు కలిపి, నట్స్, సీడ్స్‌ను చల్లుకుని, పెరుగుతో కలిపి తినొచ్చు. పొట్టు తీయని గోధుమలు, మల్టీ మిల్లెట్స్‌తో తయారుచేసుకున్న టోస్ట్‌ను నట్ బటర్‌తో కలిపి తినొచ్చు. అలాగే శరీరం కోల్పోయిన ద్రవాలను భర్తీ చేయడం కోసం కొబ్బరినీళ్లు, మజ్జిగ, సూప్స్, పండ్ల రసాలు లాంటివి తీసుకోవాలి.




**డాక్టర్ ఎ. కిరణ్మయి**
సీనియర్ క్లినికల్ న్యూట్రిషనిస్ట్
అండ్ లైఫ్‌స్టైల్ కన్సల్టెంట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్,
హైదరాబాద్.



అధ్యయనం

# కాలేయం... ఇలా ఆరోగ్యం

దేశంలో కాలేయ కొవ్వు, టైప్-2 మధుమేహం కలవరపెడుతున్నాయి. దేశ జనాభాలో 27.4 శాతం మంది కాలేయ కొవ్వుతో, 7.7 కోట్ల మంది టైప్-2 మధుమేహంతో బాధపడుతున్నారు. ఈ వ్యాధుల వల్ల గుండె జబ్బులు, కాలేయ క్యాన్సర్, మూత్రపిండాల సమస్యలు వచ్చే ప్రమాదముందని వైద్యులు ఇప్పటికే హెచ్చరించారు. అయితే సరైన రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రిస్తాయని, కాలేయ కొవ్వును తగ్గిస్తాయని అధ్యయనాల్లో తేలిందని చెప్పారు. ఇలాంటి ఆహారం తీసుకునే వారిలో కొన్ని వారాల్లోనే కాలేయ కొవ్వు 30 శాతం తగ్గిందని, మధుమేహం కూడా నియంత్రణలో ఉందని వివరించారు. చాలా మంది నెయ్యి, వెన్న, కొబ్బరి నునె ఆరోగ్యకరమైనవని భావిస్తారు. కానీ వీటితో కాలేయ




ఆహారం, జీవనశైలి మార్పులతో ఈ వ్యాధులకు చెక్ పెట్టవచ్చని ప్రపంచ, భారత ఆరోగ్య నిపుణుల బృందం డయాబెటిక్ అండ్ మెటబాలిక్ సిండ్రోమ్ జర్నల్‌లో ప్రచురించిన మార్గదర్శకాల్లో వెల్లడించింది. వృక్షాధారిత పదార్థాలతో ఈ వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని ఆ మార్గదర్శకాల్లో నిపుణులు వెల్లడించారు. కూరగాయలు, పళ్లు, చిక్కుళ్లు, తృణ ధాన్యాలు, గింజలు వంటివి కొవ్వు పెరగడంతో పాటు మెటబాలిజం సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుంది కాబట్టి ఇలాంటి కొవ్వు పదార్థాల వినియోగం తగ్గించాలని నిపుణులు సూచించారు. ఓట్స్, బ్రౌన్ రైస్ వంటి వాటిని తీసుకోవాలనీ, మద్యపానానికి దూరంగా ఉండాలని పేర్కొన్నారు. వ్యాయామం చేస్తుండాలని, ఆరోగ్యకరమైన శరీర బరువు ఉండేలా జాగ్రత్తపడాలని సూచించారు.

# బిజినెస్

హైదరాబాద్ ● మంగళవారం 13 మే 2025

## ఐటీ రిటర్నుల గడువు జూలై 31

### ఏడు రకాల రిటర్న్ ఫారాల విడుదల

న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఐటీ రిటర్నుల ఫైలింగ్ గడువును ఆదాయ పన్ను (ఐటీ) శాఖ ఎప్పటిలా ఈ ఏడాది కూడా జూలై 31గా నిర్ణయించింది. అసెస్‌మెంట్ ఇయర్ (ఏవై) 2025-26కు సంబంధించి ఏడు రకాల ఐటీ రిటర్న్ ఫారాలను విడుదల చేసింది.

- లిస్టెడ్ కంపెనీల షేర్లు, మ్యూచువల్ ఫండ్స్‌లో వార్షిక దీర్ఘకాలిక మూలధన లాభాలు (ఎల్‌టీసీజీ) రూ.1.25 లక్షల వరకు ఉన్న చిన్న,మధ్య రకం పన్ను చెల్లింపుదారులు ఇకపై ఎలాంటి పన్ను పోటు లేకుండా ఐటీఆర్-2కు బదులుగా ఐటీఆర్-1, ఐటీఆర్-4 ఫారాల్లో తమ రిటర్నులు దాఖలు చేయాలి.
- ఎల్‌టీసీజీ రూ.1.25 లక్షలు మించితే మాత్రం 12.5 శాతం పన్ను చెల్లించాలి.
- ట్రస్టులు, ధార్మిక సంస్థలు ఐటీఆర్-7 ద్వారా తమ రిటర్న్‌లు ఫైల్ చేయాలి.
- ఐటీఆర్-2,3,5,6,7 ఫారాల్లో పేర్కొనే మూలధన లాభాలను హేతుబద్ధం చేశారు. ఇండెక్సేషన్ ప్రయోజనం కావాలనుకుంటే 20 శాతం, వద్దనుకుంటే 12.5 శాతం చెల్లిస్తే సరిపోతుంది.

## కిమ్స్ హాస్పిటల్స్ లాభం రూ. 106 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లిమిటెడ్ (కిమ్స్ హాస్పిటల్స్).. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.801 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.106 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.637 కోట్లుగా ఉండగా లాభం రూ.72 కోట్లుగా ఉంది. మార్చితో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను రూ.3,067 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.415 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరం అన్ని రకాలుగా బాగుందని, కేరళలో కొత్త హాస్పిటల్‌ను ప్రారంభించటంతో పాటు వివిధ ప్రాంతాల్లో కొత్త యూనిట్లను అందుబాటులోకి తీసుకురావటం ఎంతగానో కలిసి వచ్చిందని కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ బీ భాస్కర్ రావు తెలిపారు. కాగా ఈ ఏడాది ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని థానేలో కొత్త హాస్పిటల్‌ను ప్రారంభించగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో బెంగళూరులో రెండు కొత్త యూనిట్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.

## ఆల్టో కే10, వ్యాగన్ ఆర్‌లో 6 ఎయిర్‌బ్యాగ్స్

న్యూఢిల్లీ: చిన్న కారు ఆల్టో కే10 సహా వ్యాగన్ ఆర్, సెలీరియో, ఈకో కార్లన్నింటిలోనూ ఆరు ఎయిర్‌బ్యాగ్స్‌ను పొందుపరిచినట్లు మారుతి సుజుకీ ఇండియా ప్రకటించింది. కస్టమర్లకు మరింత మెరుగైన భద్రతా ఫీచర్లను అందించాలన్న ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. భారత్‌లో ఆధునిక రహదారుల మౌలిక వసతులు శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో వాహనాల్లో మరింత శక్తివంతమైన భద్రతా చర్యలు అవసరమయ్యాయని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, సేల్స్) పార్థో బెనర్జీ అన్నారు.

# మార్కెట్.. రాకెట్






### భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ... దూసుకుపోయిన స్టాక్ సూచీలు

- ఇంట్రాడేలో 3,041 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- చివరికి 2,975 పాయింట్ల లాభంతో 82,429.90 వద్ద ముగిసిన సూచీ
- 916.70 పాయింట్ల లాభంతో మళ్లీ 25,000కు చేరువైన నిఫ్టీ

ముంబై: భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ అంగీకారంతో పాటు పరస్పర సుంకాలు తగ్గించుకునే దిశగా అమెరికా-చైనా మధ్య ఒప్పందం కుదరడంతో ఈక్విటీ మదుపరుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. వారు భవిష్యత్‌పై భయాందోళనలు వీడి కొనుగోళ్లను పోటెత్తించడంతో ప్రామాణిక సూచీలు నింగిలోకి రాకెట్‌లా దూసుకెళ్లాయి. సోమవారం ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 2,975.43 పాయింట్లు (3.74శాతం) లాభపడి 82,429.90 వద్దకు చేరింది. సూచీకి 7 నెలలకు పైగా గరిష్ఠ ముగింపు స్థాయి ఇది. ఒక దశలో సూచీ 3,041.5 పాయింట్లు (3.82 శాతం) ఎగబాకి 82,495.97 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ సైతం ఒక దశలో 936.8 పాయింట్ల (3.90శాతం) వృద్ధితో 24,944.80 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 916.70 పాయింట్ల (3.82 శాతం) లాభంతో 24,924.70 వద్ద ముగిసింది. సంఖ్య పరంగా సూచీలకు ఇప్పటివరకిదే అతిపెద్ద ఒక్కరోజు లాభం. గత రికార్డు లాభం 2024 జూన్ 3న నమోదైంది. ఆ రోజున సెన్సెక్స్ 2,507.45 పాయింట్లు, నిఫ్టీ 733.20 పాయింట్లు లాభపడ్డాయి. శాతం పరంగా, సూచీలకు 2021 ఫిబ్రవరి 1 (4 ఏళ్లకు పైగా కాలంలో) తర్వాత ఇదే అతిపెద్ద లాభం. ఆ రోజున సూచీలు 4.7 శాతం వరకు వృద్ధిని నమోదు చేశాయి.

- బుల్ ర్యాలీలో ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.16.15 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ.432.56 లక్షల కోట్లకు (5.05 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.
- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 28 రాణించాయి. ఇన్ఫోసిస్ 7.91 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా అవతరించింది. హెచ్‌సీఎల్ టెక్, టాటా స్టీల్ 6 శాతానికి పైగా లాభపడగా.. ఎటర్నల్, టెక్ మహీంద్రా, టీసీఎస్ 5 శాతానికి పైగా పెరిగాయి. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్ 4.27 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.67 శాతం వృద్ధి చెందాయి. సన్‌ఫార్మా, ఇండస్‌ఇండ్ బ్యాంక్ మాత్రం 3 శాతానికి పైగా నష్టపోయాయి.
- ప్రధాన కంపెనీలతో పాటు చిన్న, మధ్య స్థాయి షేర్లలోనూ మదుపరులు దూకుడుగా కొనుగోళ్లు జరిపారు. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 4.18 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 3.85 శాతం పుంజుకున్నాయి. బీఎస్ఈలోని రంగాల వారీ సూచీలన్నీ లాభపడ్డాయి. ఐటీ, ఫోకస్డ్ ఐటీ సూచీలు ఏకంగా 6.75 శాతం వరకు ఎగబాకాయి. రియల్టీ, మెటల్, టెక్నాలజీ, యుటిలిటీస్ ఇండెక్స్‌లు 5 శాతానికి పైగా పెరిగాయి.
- భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు చల్లారినప్పటికీ, రక్షణ రంగ షేర్లు వరుసగా రెండో రోజూ పెరిగాయి. యాక్సిస్‌కేడ్స్ టెక్నాలజీస్ షేరు 5 శాతం లాభపడగా.. డేటా ప్యాటర్న్స్ లిమిటెడ్ 3.88 శాతం, మిశ్ర ధాతు నిగమ్ 3.40 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ 2.23 శాతం, గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ 1.37 శాతం ఎగబాకాయి. డ్రోన్ కంపెనీల్లో ఐడియాఫోర్జ్ టెక్నాలజీ 6.09 శాతం, డ్రోనాచార్య ఏరియల్ ఇన్నోవేషన్ 4.99 శాతం పుంజుకున్నాయి.
- బీఎస్ఈలో మొత్తం 4,254 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 3,541 లాభపడ్డాయి. 582 నష్టపోగా.. 131 యథాతథంగా ముగిశాయి. 110 కంపెనీల స్టాక్స్ సరికొత్త ఏడాది గరిష్ఠానికి చేరాయి.
- విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) నికరంగా రూ.1,246.48 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేయగా, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) రూ.1,448.37 కోట్ల నికర కొనుగోళ్లు జరిపారు.

### గోల్డ్.. ఢమాల్!

ఉద్రిక్తతలు, అనిశ్చితులు తగ్గుముఖం పట్టడంతో ప్రతికూలతల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న బంగారానికి అంతర్జాతీయంగా గిరాకీ భారీగా తగ్గింది. దాంతో వీటి ధరలు దేశీయంగానూ భారీగా తగ్గాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర ఏకంగా రూ.3,400 తగ్గి రూ.96,550కి దిగివచ్చింది. గడిచిన 10 నెలల్లో బంగారానికి ఇదే అతిపెద్ద ఒక్కరోజు తగ్గుదల. 2024 జూన్ 23న తులం బంగారం రూ.3,350 తగ్గింది. కాగా, కిలో వెండి రూ.200 తగ్గుదలతో రూ.99,700 ధర పలికింది. అమెరికా-చైనా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 3 శాతానికి పైగా క్షీణించి 3,218 డాలర్లకు పడిపోగా.. సిల్వర్ 32.33 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

**65 డాలర్ల పైకి క్రూడ్:** అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడి చమురు పీపా ధర 2.88 శాతం పెరిగి 65.75 డాలర్లకు ఎగబాకింది. అమెరికా-చైనా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కుదరడంతో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మళ్లీ జోరందుకోవచ్చని, తత్ఫలితంగా ముడిచమురు గిరాకీ మళ్లీ పుంజుకోనుందన్న అంచనాలు ఇందుకు కారణమయ్యాయి.

## ఫార్మా కంపెనీలకు ట్రంప్ అల్టిమేటం

- నెల రోజుల్లో ధరలు తగ్గించాల్సిందే
- లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరిక
- భారత్‌లో పెరగనున్న ఔషధాల ధరలు!
- ఎగుమతులపైనా ప్రభావం



న్యూఢిల్లీ: సుంకాల పోటుతో ప్రపంచ వాణిజ్యాన్ని అతలాకుతలం చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దృష్టి ఇప్పుడు ఫార్మా కంపెనీలపై పడింది. ఇక నుంచి అమెరికాలో ఔషధాలను విక్రయించే ఫార్మా కంపెనీలు.. అమెరికాతో అత్యంత ప్రాధాన్యతా హోదా (ఎంఎఫ్ఎన్) ఉన్న దేశాల్లో.. ఏ దేశంలో తక్కువ ధరకు తమ ఔషధాలను అమ్ముతాయో, అదే ధరను తమ దేశంలో అమలు చేయబోతున్నట్టు ప్రకటించారు. డాక్టర్ల సిఫారసు (ప్రిస్క్రిప్షన్)పై అమ్మే ఔషధాలకు ఇది వర్తిస్తుంది. దీంతో అమెరికాలో ఈ ఔషధాల ధరలు 30 నుంచి 80 శాతం వరకు తగ్గుతుందన్నారు. నెల రోజుల్లో ఫార్మా కంపెనీలు తమ ఔషధాల ధరలు తగ్గించకపోతే ఎగ్జిక్యూటివ్ ఆదేశాల ద్వారా దీన్ని అమలు చేస్తామని డొనాల్డ్ ట్రంప్ మరీ హెచ్చరించారు.

**వర్ధమాన దేశాలకు ఇబ్బందే:** అమెరికా ఈ విధానాన్ని అమలు చేస్తే భారత్‌తో సహా అనేక దేశాల్లో ఔషధాల ధరలు పెరగనున్నాయి. ఫార్మా కంపెనీలు తమ పేటెంట్, ఆఫ్ పేటెంట్ ఔషధాలను విస్తృత మార్కెట్ లేదా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నేరుగా లేదా స్థానిక ఫార్మా సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని ధరలు తగ్గించి ఇతర దేశాల్లో అమ్ముతుంటాయి. ట్రంప్ ఆదేశాలు అమల్లోకి వస్తే ఇక అది కుదరకపోవచ్చు. ఈ కంపెనీలు తమ లాభాలను కాపాడుకునేందుకు అమెరికాతో సమాన స్థాయిలో వర్ధమాన దేశాల్లోనూ ధరలు నిర్ణయించే అవకాశం ఉంది. అదే జరిగితే అనేక దేశాల్లోని పేదలకు ప్రిస్క్రిప్షన్ ఔషధాలు భారమయ్యే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.

**ఎగుమతులకూ దెబ్బే:** ట్రంప్ అన్నంత పని చేస్తే ఆ ప్రభావం మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ఔషధాలపైనా పడనుంది. మన దేశం నుంచి ఏటా 700 కోట్ల డాలర్ల (సుమారు రూ.59,500 కోట్లు) విలువైన ఔషధాలు అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. అమెరికాలో తమ లాభాలను కాపాడుకునేందుకు ఈ కంపెనీలు ఇక దేశంలోనూ తమ ధరలను పెంచాల్సి ఉంటుంది. అంతేగాక అమెరికా, జపాన్, ఈయూ దేశాల ఫార్మా కంపెనీలు తమ పేటెంట్ హక్కులనూ మరింత గట్టిగా అమలు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. లేకపోతే ఈ కంపెనీలు కొత్త ఔషధాల పరిశోధన, అభివృద్ధి కోసం చేసే ఖర్చులు రాబట్టుకోవడం కష్టమవుతుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షియేటివ్ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ చెప్పారు.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 13వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 500 | విజయవాడ | 500 |
| వరంగల్ | 502 | గోదావరి | 500 |
| చిత్తూరు | 583 | విశాఖపట్నం | 505 |
| | | డజను గుడ్లు రూ. 66 | |

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 115 | విజయవాడ | 119 |
| వరంగల్ | 115 | గుంటూరు | 122 |
| కరీంనగర్ | 115 | ఒంగోలు | 122 |
| మహబూబ్‌నగర్ | 115 | చిత్తూరు | 124 |
| కర్నూలు | 115 | నెల్లూరు | 129 |
| విశాఖపట్నం | 116 | అనంతపురం | 129 |
| గోదావరి | 119 | | |

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 96,880 ▼ | 88,800 ▼ | 1,09,000 ▼ |
| విజయవాడ | 96,200 ▼ | 95,000 ▼ | 97,000 ▼ |
| విశాఖపట్నం | 96,300 ▼ | 88,800 ▼ | 1,09,000 ▼ |
| రాజమండ్రి | 96,870 ▼ | 87,500 ▼ | 98,800 ▼ |
| ప్రొద్దుటూరు | 95,700 ▼ | 88,040 ▼ | 98,500 ▼ |
| ముంబై | 93,076 ▼ | 85,258 ▼ | 94,095 ▼ |

ఈ ఏడాది రూ.200 కోట్ల

## ప్రీమియం ఆదాయం లక్ష్యం

**గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ ఎండీ శ్రీనివాసన్**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.200 కోట్ల ప్రీమియం ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ జీ శ్రీనివాసన్ వెల్లడించారు. సోమవారం నాడిక్కడ సంస్థ రీజినల్ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది అక్టోబరులో గెలాక్సీ హెల్త్ కార్యకలాపాలు ఆరంభం కాగా ప్రీమియం ఆదాయం రూ.17 కోట్లుగా ఉందన్నారు. కార్యకలాపాలు ప్రారంభించిన కొద్ది నెలల్లోనే 68 వేల మందికి పైగా పాలసీదారులను చేర్చుకున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం గెలాక్సీ హెల్త్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో సేవలందిస్తుండగా వచ్చే మార్చి నాటికి మరో ఐదు రాష్ట్రాలకు విస్తరించాలని చూస్తున్నట్లు శ్రీనివాసన్ తెలిపారు. ప్రస్తుతం ఏడు ఆరోగ్య బీమా ఉత్పత్తులను విక్రయిస్తుండగా ఈ ఏడాది మరో 10 కొత్త ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన చెప్పారు. కాగా ఏపీ, తెలంగాణల్లో కార్యకలాపాలను మరింత పటిష్ఠం చేసేందుకు మరో 14 కార్యాలయాలను ప్రారంభించాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే 10 వేల మంది ఏజెంట్లను చేర్చుకోనున్నట్లు ఆయన చెప్పారు. కాగా బీమా ఉత్పత్తుల విక్రయానికి బ్యాంకులతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు శ్రీనివాసన్ తెలిపారు.

# చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

## రామ్‌చరణ్‌కు అరుదైన గౌరవం



యువ కథానాయకుడు రామ్‌చరణ్ అరుదైన గౌరవం పొందారు. లండన్ మేడమ్ టుసాడ్స్‌లో ఆయన తన పెంపుడు కుక్క రైమ్‌తో కలసి మైనపు విగ్రహంగా కొలువు తీరారు. ఈ విగ్రహం ఆయన విజయాన్ని మాత్రమే కాదు తన పెంపుడు కుక్కతో ఉన్న బంధాన్ని కూడా తెలియజేస్తుంది. రెండో క్వీన్ ఎలిజబెత్ తర్వాత ఐకానిక్ మ్యూజియంలో తన పెంపుడు జంతువుతో నిలిచిన సెలబ్రిటీగా రామ్‌చరణ్ అరుదైన గౌరవం పొందారు. లండన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి దంపతులు, రామ్‌చరణ్ దంపతులు, సన్నిహితులు హాజరయ్యారు. ప్రస్తుతం దేశంలో నెలకొని ఉన్న పరిస్థితులు దృష్ట్యా ప్రకటనను వాయిదా వేయాలని భావించారు. అయితే పరిస్థితులు సాధారణ స్థాయికి చేరుకోవడంతో ఈ ఆనందాన్ని ప్రపంచంతో పంచుకోవాలని మెగా కుటుంబం నిర్ణయించింది. అభిమానులు, సందర్శకుల కోసం ఈ నెల 19 వరకూ లండన్‌లో ఈ విగ్రహాన్ని ఉంచుతారు. ఆ తర్వాత సింగపూర్‌లోని మేడమ్ టుసాడ్స్ మ్యూజియంకు తరలిస్తారు.



## ఈ సారి ముగిద్దాం

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజిత్ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఓజీ'. పవన్ రాజకీయాల్లో అడుగుపెట్టాక ఈ సినిమా షూటింగ్ వాయిదా పడుతూ వస్తోంది. ఎప్పుడెప్పుడు ఈ సినిమా చిత్రీకరణ రీస్టార్ట్ అవుతుందా అని అభిమానులు ఎదురుచూస్తూనే ఉన్నారు. వారి ఎదురు చూపులు ఫలించాయని తెలిపింది ఓజీ టీమ్. ఈ సినిమా షూట్ ప్రారంభించినట్లు సోమవారం ప్రకటించింది. "మళ్లీ మొదలైంది. ఈ సారి ముగిద్దాం" అని పేర్కొంది. డి.వి.వి. దానయ్య నిర్మిస్తున్నారు. ప్రియాంక మోహన్ కథానాయిక.

## నాన్నగారిలానే కీర్తి ప్రతిష్ఠలు తెచ్చుకోవాలి

\- నారా భువనేశ్వరి



సీనియర్ ఎన్టీఆర్ మనవడు, జానకీరామ్ కుమారుడు తారక రామారావు హీరోగా వైవీఎస్ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం సోమవారం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. న్యూ ట్యాలెంట్ రోర్స్ బ్యానర్‌పై యలమంచిలి గీత నిర్మిస్తున్నారు. ప్రారంభోత్సవానికి నారా భువనేశ్వరి, దగ్గుబాటి పురందేశ్వరి, గారపాటి లోకేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నారా భువనేశ్వరి క్లాప్ కొట్టగా, పురందేశ్వరి కెమెరా స్విచ్చాన్ చేశారు. లోకేశ్వరి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ 'తారక రామారావు అతని ముత్తాత నందమూరి తారక రామారావుగారి లాగా కీర్తి ప్రతిష్ఠలు తెచ్చుకోవాలని కోరుకుంటున్నా. నాలుగో తరం ఇండస్ట్రీలోకి రావడం ఆనందంగా ఉంది. రామ్ తన ప్రతిభను చాటుకోవడానికి చాలా కష్టపడుతున్నాడు. ఆ కసి ఉన్న వ్యక్తి కచ్చితంగా ఏం కోరుకుంటాడో ఆ స్థాయికి ఎదుగుతాడు' అని అన్నారు. నందమూరి మోహన కృష్ణ మాట్లాడుతూ 'రామ్‌కి సినిమా అంటే చాలా ఇష్టం. ఈ రంగంలోకి రావడానికి చాలా కృషి చేశాడు. చౌదరిగారికి రామ్ ప్రతిభ నచ్చింది. ఆయన సినిమా తీయడానికి ముందడుగు వేశారు' అని చెప్పారు. హీరో నందమూరి తారక రామారావు మాట్లాడుతూ 'ఈ రోజు నా కుటుంబసభ్యులందరూ నన్ను ప్రోత్సహించడానికి ఇక్కడికి రావడం ఎంతో ఆనందంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ 'ఈ రోజును నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోను. ఎన్టీఆర్ ఘాట్ నాకు పుణ్యక్షేత్రంతో సమానం. ఎన్టీఆర్ కుటుంబంలో నాలుగో తరానికి చెందిన వ్యక్తి, ఆయన పేరు పెట్టుకున్న మనవడి సినిమా ప్రారంభోత్సవం ఈ ప్రదేశంలో జరగడం నాకెంతో ఆనందంగా ఉంది. తారకరామారావు సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ఈ సినిమాకు దర్శకత్వం వహించడం నా అదృష్టంగా భావిస్తున్నాను' అని అన్నారు.




సూర్యకుమార్‌గా

## ఉపేంద్ర

రామ్ పోతినేని కథానాయకుడిగా 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేమ్ మహేశ్‌బాబు.పి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'రాపో 22' (వర్కింగ్ టైటిల్). భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రామ్, భాగ్యశ్రీ పాత్రలను పరిచయం చేశారు మేకర్స్. తాజాగా, ఇందులో కన్నడ నటుడు ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడిస్తూ, ఆయన పాత్రను పరిచయం చేశారు. ఆయన 'సూర్యకుమార్' అనే స్టైలిష్ పాత్రను పోషించనున్నట్లు ప్రకటించారు. ఈ నెల 15న టైటిల్ గ్లింప్స్ విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని, సంగీతం: వివేక్- మెర్విన్.

## గుర్తుండిపోయే ప్రాజెక్టు అవుతుంది



తెలుగు చిత్రపరిశ్రమలోని కార్మికుల కోసం చిత్రపురి కాలనీలో నిర్మించనున్న ఓ నూతన రెసిడెన్షియల్ ప్రాజెక్టు 'సఫైర్ సూట్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు చిత్రపురి కాలనీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్. ఈ సందర్భంగా ఫిల్మ్ నగర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ "త్వరలోనే భూమి పూజ నిర్వహిస్తాం. 40 నెలల్లో ఇది పూర్తవుతుంది. గుర్తుండిపోయే ప్రాజెక్టు అవుతుంది" అని అన్నారు. నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ "ఇండస్ట్రీ పెద్దలంతా ఒకే ప్రాజెక్టుపై నిలబడి ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకువచ్చారు. ఇది ఎంతో అద్భుతంగా ఉండబోతోంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుచిత్ర నిర్మాతలమండలి అధ్యక్షుడు కె.దామోదర ప్రసాద్, ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్, సెక్రటరీ ప్రసన్న కుమార్, మా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాదాల రవి, నిర్మాత సి.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## బద్మాషులు వస్తున్నారు




ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం 'బద్మాషులు'. మహేశ్ చింతల, విద్యాసాగర్ కే, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రలు పోషించారు. శంకర్ చేగూరి దర్శకత్వంలో సీ రామశంకర్, బి. బాలకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. జూన్ 6న 'బద్మాషులు' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని ఓ స్నేహబృందం పంచే వినోదం అన్నివర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉంటుందని నిర్మాతలు తెలిపారు. మన ఊరి కథ అనేలా సినిమా ఉంటుంది, పాత్రలు సహజంగా ఉంటాయి అని దర్శకుడు తెలిపారు.

## ఏడాదికి రెండు సినిమాలు



కిరణ్, అలేఖ్యా రెడ్డి జంటగా నటించిన 'దీక్ష' చిత్రం షూటింగ్ పూర్తయింది. జూన్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకనిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'పట్టుదల, దీక్షతో పని చేస్తే ఏదైనా సాధించవచ్చు అనే పాయింట్‌తో ఫ్యామిలీ డ్రామాగా చిత్రం రూపుదిద్దుకుంటోంది. అలాగే పౌరాణిక అంశం కూడా జోడించాం. హీరో కిరణ్ భీముడి పాత్రలో కనిపిస్తారు. మా బేనరులో వస్తున్న 41వ సినిమా ఇది. దీని తర్వాత 'కబడ్డీ' సినిమా తీస్తున్నాం. ఏడాదికి రెండు సినిమాలైనా చేయాలని మా ప్లాన్' అని చెప్పారు. ఈ సినిమాలో హీరోగా నటించడం ఆనందంగా ఉందని కిరణ్ చెప్పారు. చిత్రంలో మంచి పాత్ర పోషించినట్లు నటి అక్సా ఖాన్ తెలిపారు. సినిమాలో విలన్‌గా నటించినట్లు రోహిత్ శర్మ చెప్పారు.

## క్లీన్ సర్టిఫికెట్‌తో థియేటర్లకు



రుత్విక్, ఇక్రా ఇద్రిసి జంటగా నటించిన 'వైభవం' చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ ఫీల్ గుడ్ కామెడీ ఎంటర్‌టైనర్‌కు సెన్సారు నుంచి క్లీన్ యు సర్టిఫికెట్ లభించింది. ఇటీవల విడుదల చేసిన రెండు పాటలకు మంచి స్పందన లభించిందనీ, మంచి సినిమాలను ఆదరించే ప్రేక్షకులకు 'వైభవం' నచ్చుతుందని సాత్విక్ చెప్పారు.

## ఆకట్టుకొనే శక్తిమతి



హెబ్బా పటేల్ ప్రధాన పాత్ర పోషించిన 'శక్తిమతి' చిత్రం మోషన్ పోస్టర్‌ను దర్శకుడు వి.వి. వినాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాత వెంకటేశ్ గౌడ్ మాట్లాడుతూ 'దర్శకుడు చెప్పిన పాయింట్ నచ్చి ఈ సినిమా తీశా. ఆగస్టులో విడుదల చేస్తాం' అని చెప్పారు. దర్శకుడు డి.రామకృష్ణ మాట్లాడుతూ 'మా గురువు వినాయక్‌గారి చేతుల మీదుగా మోషన్ పోస్టర్ విడుదల కావడం ఆనందంగా ఉంది.. సినిమాలో దాదాపు 30 నిముషాల పాటు సీజీ వర్క్ ఉంటుంది. మా నిర్మాత వెంకటేశ్ గౌడ్ రాజీపడకుండా సినిమా తీశారు. అందరూ ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అన్నారు.

## రికార్డుల 'కింగ్'

**7** టెస్టుల్లో విరాట్ సాధించిన డబుల్ సెంచరీలు. భారత్ తరఫున అత్యధిక టెస్ట్ ద్విశతకాలు సాధించిన ఆటగాడు కోహ్లీనే. అంతేకాదు.. వరుసగా నాలుగు టెస్ట్ సిరీస్‌లలో డబుల్ సెంచరీలు బాదిన క్రికెటర్ కూడా అతడే. ఈ క్రమంలో డాన్ బ్రాడ్‌మన్, రాహుల్ ద్రవిడ్ పేరిటనున్న వరుస మూడు డబుల్ సెంచరీల రికార్డును విరాట్ అధిగమించాడు.

**20** కెప్టెన్ హోదాలో కోహ్లీ కొట్టిన సెంచరీలు. టీమిండియా సారథిగా అత్యధిక శతకాల వీరుడు విరాటే. సునీల్ గవాస్కర్ (11)ది రెండోస్థానం.

**40** విరాట్ సారథ్యంలో టీమిండియా గెలిచిన టెస్టుల సంఖ్య. 68 మ్యాచుల్లో ఈ ఘనతను అందుకున్న కోహ్లీ.. టెస్టుల్లో అత్యంత విజయవంతమైన భారత కెప్టెన్‌గా రికార్డుకెక్కాడు.

**5,864** కెప్టెన్‌గా విరాట్ టెస్టుల్లో కొల్లగొట్టిన పరుగులు. ఇందులో 20 శతకాలు, 18 అర్ధ సెంచరీలు ఉన్నాయి. భారత్ తరఫున అత్యధిక రన్స్ చేసిన సారథి కోహ్లీనే. ధోనీ (3,454), సునీల్ గవాస్కర్ (3,449) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

**9,230** టెస్టుల్లో కోహ్లీ చేసిన పరుగులు. సచిన్, ద్రవిడ్, గవాస్కర్ తర్వాత టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన నాలుగో భారత బ్యాటర్‌గా రికార్డు.



# 6 వేదికల్లో ఐపీఎల్

### 17న పునః ప్రారంభం
### జూన్ 3న ఫైనల్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్‌ను ఈనెల 17న పునః ప్రారంభించాలని బీసీసీఐ నిర్ణయించింది. మిగిలిన మ్యాచ్‌లను ఆరు వేదికల్లో నిర్వహించనుంది. జూన్ మూడున ఫైనల్ జరుగుతుంది. భారత్‌పై పాకిస్థాన్ దాడుల నేపథ్యంలో బీసీసీఐ..లీగ్‌ను వారం పాటు వాయిదా వేసిన విషయం తెలిసిందే. అయితే భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో ఐపీఎల్‌ను తిరిగి ప్రారంభించాలని సోమవారం జరిగిన సమావేశంలో బోర్డు నిర్ణయించింది. ఈనెల 17న బెంగళూరులో కోల్‌కతా-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు పోరు ద్వారా లీగ్ పునఃప్రారంభమవుతుంది. బెంగళూరు, జైపూర్, ఢిల్లీ, లఖ్‌నవూ, అహ్మదాబాద్, ముంబైలలో లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. ప్లేఆఫ్స్ మ్యాచ్‌ల వేదికలను తర్వాత వెల్లడిస్తామని బీసీసీఐ తెలిపింది. ఈనెల 8వ తేదీన అర్ధంతరంగా నిలిపివేసిన పంజాబ్-ఢిల్లీ మ్యాచ్ 24న జైపూర్ వేదికగా జరుగుతుంది. ఆరు వేదికల్లో మొత్తం 13 లీగ్ మ్యాచ్‌లు, నాలుగు ప్లే ఆఫ్‌లు కలిపి మొత్తం 17 మ్యాచ్‌లు జరుగుతాయి. కాగా ఈనెల 29నుంచి ఇంగ్లండ్-వెస్టిండీస్ జట్ల మధ్య వన్డే సిరీస్ జరుగనుంది. ఆ రెండు దేశాలకు చెందిన పలువురు ఆటగాళ్లు ఐపీఎల్ ఆడుతున్నారు. అలాగే ఐపీఎల్ ముగిసిన వారం తర్వాత...అంటే జూన్ 11 నుంచి లార్డ్స్‌లో డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ జరగాల్సివుంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు ఫైనల్‌కు అర్హత సాధించిన విషయం తెలిసిందే.

### సవరించిన షెడ్యూల్

మే 17 : బెంగళూరు X కోల్‌కతా (బెంగళూరు) : రా.7.30
మే 18 : రాజస్థాన్ X పంజాబ్ (జైపూర్) : మ.3.30
మే 18 : ఢిల్లీ X గుజరాత్ (ఢిల్లీ) : రా.7.30
మే 19 : హైదరాబాద్ X లఖ్‌నవూ (లఖ్‌నవూ) : రా.7.30
మే 20 : చెన్నై X రాజస్థాన్ (ఢిల్లీ) : రా.7.30
మే 21 : ముంబై X ఢిల్లీ (ముంబై) : రా.7.30
మే 22: గుజరాత్ X లఖ్‌నవూ (అహ్మదాబాద్) : రా.7.30
మే 23 : బెంగళూరు X హైదరాబాద్ (బెంగళూరు) : రా.7.30
మే 24 : పంజాబ్ X ఢిల్లీ (జైపూర్) : రా.7.30
మే 25 : గుజరాత్ X చెన్నై (అహ్మదాబాద్) : మ.3.30
మే 25 : హైదరాబాద్ X కోల్‌కతా (ఢిల్లీ) : రా.7.30
మే 26 : పంజాబ్ X ముంబై (జైపూర్) : రా.7.30
మే 27 : లఖ్‌నవూ X బెంగళూరు (లఖ్‌నవూ) : రా.7.30
మే 29 : క్వాలిఫయర్ 1 : రా.7.30
మే 30 : ఎలిమినేటర్ : రా.7.30
జూన్ 1: క్వాలిఫయర్ 2 : రా.7.30

జూన్ 3 - ఫైనల్ రా.7.30 గం.



| టెస్ట్ కెరీర్ | మ్యాచ్‌లు | ఇన్నింగ్స్ | పరుగులు | అత్యధికం | సెంచరీలు | అ.సెం | సగటు |
|---|---|---|---|---|---|---|---|
| | 123 | 210 | 9230 | 254 | 30 | 31 | 46.8 |

# 'టెస్టు' ముగించాడు

## 14 ఏళ్ల సంప్రదాయ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు

ఇక వన్డేలకే పరిమితం • వారం వ్యవధిలో ఇద్దరు దిగ్గజాల నిష్క్రమణ

**బీసీసీఐ విజ్ఞప్తి బేఖాతరు**

**ఊహాగానాలే నిజమయ్యాయి.. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ నుంచి ఇంకా తేరుకోకముందే భారత క్రికెట్ ప్రేమికులకు మరో పిడుగులాంటి వార్త. ఏదైతే జరగకూడదని కోట్లాది మంది క్రికెట్ ప్రేమికులు భావించారో అదే జరిగింది. దశాబ్దానికి పైగా భారత క్రికెట్‌కు టార్చ్‌బేరర్‌గా ఉన్న విరాట్ కోహ్లీ టెస్టు ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. బీసీసీఐతో పాటు సెలెక్టర్లు, మాజీలు, విశ్లేషకులు ఇలా ఎంత మంది వారించినా తన మనస్సాక్షికే ఓటేశాడు. ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ ఆటగాడిగా పేరు తెచ్చుకున్న కింగ్ కోహ్లీ ఇక వన్డేలకే పరిమితం. భారత క్రికెట్‌కు మూల స్తంభాల్లాంటి ఇద్దరు స్టార్లు వారం వ్యవధిలోనే టెస్టు జట్టును వీడడం నిజంగా టీమిండియా కెరీర్‌లో ఓ శకం ముగిసినట్టే..**


**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు భారత క్రికెట్‌లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రపంచ క్రికెట్‌లో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తనకెంతో ఇష్టమైన టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈమేరకు సోమవారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగంతో కూడిన పోస్ట్ పెట్టాడు. గతేడాది టీ20 ప్రపంచకప్‌ను గెలిచాక పొట్టి ఫార్మాట్ నుంచి వైదొలిగిన 36 ఏళ్ల కోహ్లీ ఇక వన్డేలకు మాత్రమే అందుబాటులో ఉంటాడు. ఈనెల 7న కెప్టెన్ రోహిత్ శర్మ సైతం ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఆ తర్వాత రోజే విరాట్ సైతం ఇదే బాట పడతాడనే కథనాలు రావడంతో అంతా షాక్‌కు గురయ్యారు. కఠినంగా సాగే ఇంగ్లండ్ పర్యటనలో ఇద్దరు అనుభవజ్ఞులు లేకపోతే ఎలా? అనే ఆందోళన బీసీసీఐలోనూ కనిపించింది. దీంతో వెంటనే అతడిని బుజ్జగించే ప్రయత్నాలు చేసినట్టు సమాచారం. అయినా తను తిరస్కరించడంతో సచిన్‌ను కూడా రంగంలోకి దింపినట్టు తెలిసింది. అయితే ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా విరాట్ తాను అనుకున్నదానికే కట్టుబడి సంచలన నిర్ణయాన్ని ప్రకటించాడు. కొంతకాలంగా అతడి టెస్టు కెరీర్ అంత సాఫీగా సాగడం లేదు. గతేడాది ఆస్ట్రేలియా పర్యటనలో విరాట్ 9 ఇన్నింగ్స్‌లో చేసింది 190 పరుగులే. అంతేకాకుండా ఇందులో ఎనిమిదిసార్లు ఆఫ్‌సైడ్ ఆవల బంతులకే అవుట్ కావడంతో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆ సమయంలోనే అతడి మనస్సులో రిటైర్మెంట్ ఆలోచన వచ్చి ఉండవచ్చు. యువ ఆటగాళ్లకు దారి ఇవ్వాల్సిన తరుణం ఆసన్నమైందనే భావన అతడిలో వ్యక్తమైందేమో. కానీ భారత టెస్టు జట్టు అతడి ఆధ్వర్యంలో 68 మ్యాచ్‌ల్లో 40 విజయాలు అందుకున్న విషయం మాత్రం చరిత్ర మరువదు. అంతేకాకుండా సేన (ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్) దేశాలపై విరాట్ అద్వితీయ సెంచరీలు అభిమానుల జ్ఞాపకాల్లో ఎన్నటికీ ఉండిపోయేవే..

### ఈ సుదీర్ఘ ప్రయాణాన్ని ఊహించలేదు..

'టెస్టు క్రికెట్‌లో నీలి రంగు క్యాప్‌ను ధరించి 14 ఏళ్లయ్యింది. నిజానికి ఈ ఫార్మాట్‌లో ఇంత కాలం కొనసాగుతానని నేనెప్పుడూ అనుకోలేదు. ఇది నన్నెంతగానో పరీక్షించింది. తీర్చిదిద్దింది. జీవితానికి సరిపడా పాఠాలను కూడా నేర్పింది. వ్యక్తిగత జీవితంలోనూ నేను వాటిని కొనసాగిస్తాను. తెలుపు రంగు జెర్సీలో ఆడడం వ్యక్తిగతంగా నాకెంతో ప్రత్యేకమైంది. ఈ క్రమంలో ఎదురైన నిశ్శబ్దకర పరిస్థితులు.. సుదీర్ఘ రోజులు.. ఎవరికీ కనిపించని చిన్న చిన్న మధుర క్షణాలు కూడా జీవితాంతం గుర్తుండిపోతాయి. ఇక ఈ ఫార్మాట్ నుంచి తప్పుకోవడం నాకంత సులువుగా ఏమీ అనిపించలేదు. కానీ ఇదే సరైన సమయం. ఆట కోసం సర్వస్వాన్నీ ధారపోశాను. తిరిగి క్రికెట్ కూడా నేను ఆశించినదానికంటే ఎక్కువే ఇచ్చింది. అందుకే ఎనలేని సంతృప్తి, కృతజ్ఞతాభావంతోనే వైదొలుగుతున్నాను. క్రికెట్‌కు, సహచర ఆటగాళ్లకు, ఈ నా ప్రయాణాన్ని సుదీర్ఘ కాలం కొనసాగేలా చేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు. అలాగే నా టెస్టు కెరీర్‌ను ఎప్పుడూ చిరునవ్వుతోనే చూసుకోగలను...ఇక ఉంటా'

\- విరాట్ కోహ్లీ

### నాకు నీ కన్నీళ్లు గుర్తుంటాయి..



స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రిటైర్మెంట్‌పై అతడి భార్య అనుష్క శర్మ భావోద్వేగంతో స్పందించింది. 'అందరూ నీ రికార్డులు, మైలురాళ్ల గురించే మాట్లాడుకుంటారు. కానీ నాకు మాత్రం నీవెన్నడూ బయటకు చూపని కన్నీళ్లను, నీలో నీవే పడిన సంఘర్షణ గుర్తుంటాయి. అలాగే టెస్టు ఫార్మాట్‌పై నువ్వు చూపిన ప్రేమ ఎప్పటికీ గుర్తుండిపోయేదే. నువ్వు ఎదిగిన విధానాన్ని పక్కనే ఉండి చూడడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. ఎల్లప్పుడూ నీ మనస్సు చెప్పిన ప్రకారమే నిర్ణయం తీసుకున్నావు. ఆటలో ప్రతీదీ సాధించావు కాబట్టి గుడ్‌బై చెప్పడానికి అర్హుడివే అని భావిస్తున్నా'నంటూ అనుష్క పేర్కొంది.

# ఆ చరిత్రనే మార్చి..!



**దిగ్గజ ఆటగాడిగా.. అంతకుమించి కెప్టెన్‌గా!**

ఆటగాడిగా, భారత జట్టు సారథిగా కోహ్లీ హయాంలో టీమిండియా సరికొత్త స్థాయిలను అందుకొంది. భారత టెస్ట్ చరిత్రలో విరాట్‌ది ఓ విప్లవమనే చెప్పుకోవాలి. అత్యున్నత ఫిట్‌నెస్ ప్రమాణాలను నెలకొల్పడంతోపాటు గెలవాలన్న కసిని జట్టులో పెంపొందించడంలో విజయవంతమయ్యాడు. ప్రపంచ టెస్ట్ జట్లలో టీమిండియాను బలీయమైన శక్తిగా తీర్చిదిద్దాడు. బలమైన బౌలింగ్ విభాగాన్ని తయారు చేసి ప్రత్యర్థుల వెన్నులో వణుకు పుట్టించాడు. ఒకప్పుడు భారత జట్టు పర్యటనకు వస్తుందంటే.. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్లు తమదే విజయమని భావించేవి. కానీ, కోహ్లీ హయాంలో లెక్క మారింది. ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపై మట్టికరిపించిన భారత్.. 71 ఏళ్ల చరిత్రను తిరగరాసింది. ఇక, బ్యాటర్‌గా కెప్టెన్‌గా కోహ్లీ ఎన్నో ఘనతలను అందుకొన్నాడు.

**వెస్టిండీస్‌పై అరంగేట్రం..:** 2011 జూన్‌లో వెస్టిండీస్‌తో జరిగిన తొలి మ్యాచ్ (కింగ్‌స్టన్)లో విరాట్ టెస్ట్ అరంగేట్రం చేశాడు. ఆ సిరీస్‌లో పర్వాలేదనిపించిన కోహ్లీ.. క్రమంగా జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకొన్నాడు. స్వదేశం, విదేశాల్లో టీమిండియా రన్ మెషీన్‌గా మారాడు. 2012 ఆస్ట్రేలియాతో అడిలైడ్‌లో జరిగిన టెస్టులో కోహ్లీ తొలి శతకం నమోదు చేశాడు. ఈ ఏడాది జనవరిలో ఆస్ట్రేలియాతో సిడ్నీలో చివరి టెస్ట్ ఆడాడు. కెరీర్‌లో 123 టెస్ట్‌లు ఆడిన విరాట్.. 9230 పరుగులు చేశాడు. అందులో 30 సెంచరీలు, 31 అర్ధ శతకాలు ఉన్నాయి. అత్యధికం 254 రన్స్ వంద టెస్ట్‌లకుపైగా ఆడి 55.57 స్ట్రయిక్ రేట్ నమోదు చేయడం అద్భుతం. అయితే, గత కొన్నేళ్లుగా టెస్టుల్లో కోహ్లీ ప్రదర్శన దిగజారింది. 2024-25 ఆసీస్ పర్యటనలో విరాట్ ఒక్క సెంచరీ మాత్రమే నమోదు చేశాడు.

**డబుల్ సెంచరీ కింగ్..:** భారత్ తరఫున టెస్టుల్లో అత్యధికంగా ఏడు ద్విశతకాలు నమోదు ఆటగాడు కోహ్లీ. 2019లో పుణెలో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్‌లో విరాట్ 254 పరుగులతో కెరీర్‌లో తొలి డబుల్ సాధించాడు. అంతేకాకుండా నాలుగు వరుస సిరీస్‌ల్లో నాలుగు డబుల్ సెంచరీలు నమోదు చేసిన ప్లేయర్‌గా కూడా కోహ్లీ రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలో డాన్ బ్రాడ్‌మన్, రాహుల్ ద్రవిడ్ మూడు వరుస సిరీస్‌ల్లో మూడు ద్విశతకాల రికార్డును అధిగమించాడు.

**కెప్టెన్‌గా రికార్డులు..:** 2014, డిసెంబరులో ఆస్ట్రేలియా టూర్‌లో ధోనీ అర్ధంతరంగా రిటైర్మెంట్ ప్రకటించడంతో.. కోహ్లీ జట్టు పగ్గాలందుకొన్నాడు. అనతికాలంలోనే రెడ్ బాల్ క్రికెట్‌లో భారత్ బలమైన శక్తిగా మారింది. స్వదేశంలో తిరుగులేని భారత్ క్రమంగా విదేశాల్లోనూ సిరీస్ విజయాలతో ఆధిపత్యం చెలాయించింది. 2018-19లో జరిగిన టెస్ట్ సిరీస్‌లో ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపై 2-1తో ఓడించిన భారత్.. 71 ఏళ్ల చరిత్రను తిరగరాసింది. ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాల్లో కూడా భారత్ విజయాలను అందుకొంది. టెస్ట్ ర్యాంకింగ్స్‌లోనూ భారత్ నెం:1 స్థానానికి చేరుకొంది. 2021లో లార్డ్స్ టెస్టులో భారత్‌కు అద్భుత విజయం అందించాడు.

## కోహ్లీ నా ఫేవరెట్



**డీజీఎంవో రాజీవ్ ఘాయ్ ఆసక్తికర వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మిలటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ (డీజీఎంవో) రాజీవ్ ఘాయ్ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రస్తావన తెచ్చారు. అలాగే 70వ దశకంలో ఇంగ్లండ్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన యాషెస్ సిరీస్‌నూ ఆయన గుర్తు తెచ్చుకున్నారు. 14 సంవత్సరాల సుదీర్ఘ టెస్ట్ కెరీర్‌కు గుడ్ బై చెబుతున్నట్టు విరాట్ సోమవారం అధికారికంగా వెల్లడించిన విషయం తెలిసిందే. విలేకరుల భేటీలో కోహ్లీ రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రస్తావించిన లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ 'విరాట్ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ఎందరో భారతీయుల మాదిరే నాకూ ఆయన ఫేవరెట్ క్రికెటర్' అని అన్నారు. ఇక.1970 యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ జట్టును ఆస్ట్రేలియా దిగ్గజ పేసర్లు షేన్ థాంప్సన్, డెన్నిస్ లిల్లీ వణికించారు. ఆపరేషన్ సిందూర్‌లో మన గగనతల రక్షణ వ్యవస్థల సామర్థ్యాన్ని థాంప్సన్, లిల్లీ ప్రతిభతో పోలుస్తూ ఘాయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. '1970ల్లో నేను పాఠశాలలో చదువుతున్న రోజుల్లో ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ జట్ల నడుమ యాషెస్ సిరీస్ జరిగింది. ఆసీస్ జట్టులోని అప్పటి ప్రఖ్యాత పేసర్లు థాంప్సన్, లిల్లీ ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను తుత్తునియలు చేశారు. దాంతో 'యాషెస్ టు యాషెస్ : డస్ట్ టు డస్ట్ : లిల్లీకి దొరక్కపోతే థాంప్సన్‌కు తప్పకుండా చిక్కుతారు' అని ఆస్ట్రేలియా చక్కని పద ప్రయోగం చేసింది. ప్రస్తుతం పాకిస్థాన్‌పై పోరాటంలో భారత్ ఆధిపత్యాన్ని ఆ విధంగా వర్ణించవచ్చు' అని రాజీవ్ ఘాయ్ అన్నారు.

# వాణిజ్య యుద్ధానికి విరామం!

## ప్రతీకార సుంకాల తగ్గింపుపై అమెరికా, చైనా ఒప్పందం



- ద్వైపాక్షిక దిగుమతులపై చెరో 115% టారిఫ్‌ల తగ్గింపు
- 90 రోజులు సుంకాలను పెంచవద్దని నిర్ణయం
- ఇక నుంచి చైనాపై 30%.. అమెరికాపై 10శాతం టారిఫ్ అమలు
- ఇంతకుముందు చైనాపై 145%.. అమెరికాపై 125శాతం సుంకాలు

జెనీవా, మే 12: వాణిజ్య యుద్ధానికి అమెరికా, చైనా విరామం ప్రకటించాయి. ప్రతీకార సుంకాల తగ్గింపుపై జెనీవాలో రెండు రోజుల పాటు, ఇరు దేశాల మధ్య జరిగిన చర్చలు ఫలించాయి. ఇటీవలి కాలంలో పరస్పరం విధించుకున్న ప్రతీకార సుంకాలను ఉపసంహరించుకోవాలని రెండు దేశాలూ ఓ ఒప్పందానికి వచ్చాయి. ఒప్పందం మేరకు అమెరికా, చైనా తమ ద్వైపాక్షిక దిగుమతులపై చెరో 115% సుంకాలను తగ్గించాయి. అంతే కాకుండా వాణిజ్య యుద్ధానికి 90రోజుల పాటు సంధి ప్రకటించాయి. రెండు దేశాలూ సుంకాలను పెంచవద్దని నిర్ణయించాయి. ఈ 90రోజుల వ్యవధిలో ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్య వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోనున్నారు. ఈ మేరకు అమెరికా, చైనా వాణిజ్య ప్రతినిధులు సోమవారం ప్రకటన చేశారు. ఈ ప్రకటనతో అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లు పుంజుకున్నాయి. ప్రతీకార సుంకాల తగ్గింపుపై అమెరికా, చైనా వాణిజ్య ప్రతినిధులు రెండు రోజుల పాటు జెనీవాలో చర్చలు జరిపారు. ఒప్పందం కుదిరిన అనంతరం జెనీవాలోనే అమెరికా వాణిజ్య ప్రతినిధులు జేమిసన్ గ్రీర్, స్కాట్ బెస్సెంట్ విలేకరులతో మాట్లాడారు. చైనా దిగుమతులపై ప్రస్తుతం 145% టారిఫ్ విధిస్తుండగా దాన్ని 30శాతానికి తగ్గించడానికి(అంటే 115% కోత) అమెరికా అంగీకరించిందని చెప్పారు. రెండు దేశాల మధ్య వాణిజ్య యుద్ధంతో సరుకు రవాణా పూర్తిగా నిలిచిపోయిందని, ఇది రెండు దేశాలకూ మంచిది కాదని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య మరింత సమన్వయమైన, సంతులిత వాణిజ్యం అవసరమని వారు అభిప్రాయపడ్డారు. మరోవైపు, చైనా ప్రస్తుతం అమెరికా దిగుమతులపై 125శాతం టారిఫ్ విధిస్తుండగా, దాన్ని 10శాతానికి తగ్గించడానికి అంగీకరించింది. అంటే, చైనా కూడా 115శాతం టారిఫ్ తగ్గించడానికి ఒప్పుకొంది. అయితే ఇందులో 91% తగ్గింపు వెంటనే అమల్లోకి వస్తుంది. మరో 24శాతం టారిఫ్‌ను దశల వారీగా 90రోజుల్లోపు తగ్గించనున్నారు. ఈ మేరకు చైనా వాణిజ్యశాఖ ప్రకటన విడుదల చేసింది. అమెరికా ఇకనైనా ఏకపక్షంగా టారిఫ్‌లను పెంచబోదని ఆశిస్తున్నట్లు అందులో పేర్కొంది. ప్రతీకార సుంకాల తగ్గింపుపై రెండు దేశాలు వేర్వేరు ప్రకటనలతో పాటు సంయుక్త ప్రకటన కూడా విడుదల చేశాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జనవరిలో చైనాపై ట్రేడ్ వార్ ప్రకటించారు. చైనా నుంచి వచ్చే వస్తువులపై టారిఫ్‌ను దశలవారీగా 145శాతానికి పెంచారు. దీనికి ప్రతిగా చైనా అమెరికా వస్తువులపై టారిఫ్‌ను 125శాతానికి పెంచింది. రెండు దేశాల మధ్య ట్రేడ్ వార్‌తో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మందగమనం చోటుచేసుకుంటుందని ప్రపంచ మార్కెట్లు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే ఇరుదేశాల ఉన్నతస్థాయి వాణిజ్య ప్రతినిధుల మధ్య సమావేశం జరిగింది.

## గాజాపై ఇజ్రాయెల్ దాడి..
# 16 మంది మృతి

» అమెరికన్-ఇజ్రాయెలీ బందీని విడుదల చేస్తామన్న హమాస్

డీర్ అల్-బలా, మే 12: గాజాలో బందీగా ఉన్న చివరి అమెరికన్-ఇజ్రాయెలీని విడుదల చేయనున్నట్టు హమాస్ వెల్లడించింది. గాజా స్ట్రిప్‌లో నిరాశ్రయులైన వారికి ఆశ్రయం కల్పిస్తున్న పాఠశాలపై సోమవారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో కనీసం 16 మంది మరణించారు. వీరిలో నలుగురు మహిళలు, ఐదుగురు చిన్నారులు ఉన్నారు. పలువురికి గాయాలయ్యాయి. ఈ దాడి నేపథ్యంలో హమాస్ తాజా ప్రకటన చేసింది. కాగా, ఈ వారంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. సౌదీ అరేబియా, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పర్యటించనున్నారు. ఈ తరుణంలో తాజా దాడి చోటుచేసుకుంది.

## కులం ఆధారంగా విరాళాల స్వీకరణ నిరాకరించడం అంటరానితనమే

» మద్రాసు హైకోర్టు

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆలయ ఉత్సవాల కోసం కులం ఆధారంగా విరాళాలు స్వీకరించేందుకు నిరాకరించడం కూడా అంటరానితనం కిందకే వస్తుందని మద్రాస్ హైకోర్టు పేర్కొంది. దేశంలో అంటరానితనం వివిధ రకాలుగా, పలు రూపాల్లో ఆచరణలో ఉందని, ఇది కూడా అలాంటి వాటిల్లో ఒకటి అని వ్యాఖ్యానించింది. చెన్నై కుండ్రత్తూర్ తిరునాగేశ్వర్ ఆలయ బ్రహ్మోత్సవ వేడుకలకు నిర్దిష్ట వర్గాల నుంచే విరాళాలు వసూలు చేస్తున్నారని, ఇతర వర్గాల నుంచి నిరాకరిస్తున్నారని ఆరోపిస్తూ పాండ్యరాజన్ అనే వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భరత్ చక్రవర్తి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్పందిస్తూ.. దేవుడి ఉత్సవాల వ్యవహారంలోనూ కుల ప్రస్తావన రావడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. ఆలయ ఉత్సవాల కోసం అన్ని వర్గాలు విరాళాలు ఇవ్వడానికి అనుమతించాలని, దీనికి తగిన ఉత్తర్వులు జారీచేయాలని దేవాదాయశాఖను ఆదేశించారు.

# ఏపీ సీట్లు ఏపీకే

» ఉన్నత విద్య అడ్మిషన్లపై నిర్ణయం
» ఆంధ్రా, ఎస్వీయూ రీజియన్లే ప్రామాణికం
» రెండు రీజియన్ల మధ్య 85:15 నిష్పత్తి
» రాష్ట్ర యూనివర్సిటీలకు 65.62: 34.38
» ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నత విద్యాశాఖ

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య అడ్మిషన్లపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ ఉన్నత విద్యాసంస్థల్లోని సీట్లలో ఆంధ్రా యూనివర్సిటీ, శ్రీవేంకటేశ్వరయూనివర్సిటీ(ఎస్వీ), ఉస్మానియా యూనివర్సిటీ మూడు రీజియన్ల ప్రకారం సీట్ల కేటాయింపు జరుగుతోంది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ(తెలంగాణ) రీజియన్‌లో ఆంధ్రాకు చెందిన విద్యార్థులకు సీట్లు కేటాయించబోమని తెలంగాణ ప్రభుత్వం కొత్త నిబంధన అమల్లోకి తెచ్చింది. దీంతో ఏపీ ప్రభుత్వం కూడా అదే కోణంలో ఇకపై ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు ఏపీ విద్యార్థులకు మాత్రమే దక్కేలా అడ్మిషన్ల నిబంధనలకు సవరణలు చేసింది. వీటి ప్రకారం రాష్ట్రంలోని ఆంధ్రా, వెంకటేశ్వర యూనివర్సిటీల మధ్య మాత్రమే సీట్ల పంపిణీ జరుగుతుంది. ఉదాహరణకు ఆంధ్రా యూనివర్సిటీ రీజియన్‌లో.. ఏయూ రీజియన్‌కు 85శాతం సీట్లు వస్తాయి. మిగిలిన 15శాతం సీట్లు అన్ రిజర్వ్‌డ్‌గా ఉంటాయి. వాటిలో అటు ఆంధ్రా, ఇటు వెంకటేశ్వర యూనివర్సిటీల విద్యార్థులు అడ్మిషన్లు పొందవచ్చు. అంటే మొత్తం వంద శాతం సీట్ల పంపిణీ ఆంధ్రా, వెంకటేశ్వరా రీజియన్ల మధ్యే జరుగుతుంది. గతంలో 15 శాతం కోటాలో ఉస్మానియా వర్సిటీ రీజియన్ కూడా ఉండేది. ఇప్పుడు దానిని తొలగించారు.

### స్థానిక కోటా(85%) అర్హత ఇలా..

- స్థానిక కోటాలో అడ్మిషన్ పొందేందుకు అవసరమైన అర్హతను నిర్ధారించే కోర్సుతో పాటు అంతకముందు వరుసగా నాలుగేళ్లు ఆ ప్రాంతంలోనే చదివి ఉండాలి. ఉదాహరణ: బీటెక్‌లో అడ్మిషన్ పొందాలంటే ఇంటర్మీడియట్ రెండేళ్లు, పదో తరగతి, తొమ్మిదో తరగతి అదే ప్రాంతంలో చదివి ఉండాలి.
- వరుసగా నాలుగేళ్లు అదే ప్రాంతంలో చదవని విద్యార్థులు అర్హత పరీక్ష ప్రారంభమయ్యే నాటికి ముందు వరుసగా ఆ ప్రాంతంలో నాలుగేళ్ల పాటు నివాసం ఉండి ఉండాలి.
- మొత్తం నాలుగేళ్లు లేదా అందులో కొంతకాలం వేర్వేరు ప్రాంతాల్లో చదివి ఉంటే.. అర్హత పరీక్ష నాటికి ముందు వరుసగా ఏడేళ్లు రాష్ట్రంలో చదివి, అందులో ఎక్కువ కాలం ఏ రీజియన్‌లో చదివితే దానిని స్థానికతకు ప్రామాణికంగా తీసుకుంటారు. ఒకవేళ రెండు ప్రాంతాల్లో సమానంగా చదివి ఉంటే చివరి సంవత్సరం చదివిన ప్రాంతాన్ని స్థానికంగా గుర్తిస్తారు.
- మొత్తం ఏడేళ్లు లేదా అందులో కొంతకాలం వేర్వేరు ప్రాంతాల్లో చదివి ఉంటే అర్హత పరీక్ష రాసే సమయానికి ముందు ఏడేళ్లు ఆ ప్రాంతంలో నివాసం ఉండాలి. దీనిలో ఎక్కువ ఏళ్లు ఎక్కడ ఉంటే దానిని స్థానిక ప్రాంతంగా గుర్తిస్తారు.

### అన్‌రిజర్వ్‌డ్ కోటా(15%) అర్హత ఇలా..

- ఏపీలోని అందరూ అన్‌రిజర్వ్‌డ్‌కోటాకు (15%) అర్హులే.
- విద్యార్థులు బయట రాష్ట్రాల్లో చదివి ఉంటే.. అలా చదివిన కాలం కాకుండా పదేళ్లు రాష్ట్రంలో నివాసం ఉండాలి. లేదా వారి తల్లిదండ్రులు రాష్ట్రంలో పదేళ్లు నివాసం ఉండాలి. అప్పుడే అన్‌రిజర్వ్ కోటాకు అర్హులు.
- ఏపీలో పనిచేస్తున్న రాష్ట్ర, కేంద్ర, ప్రభుత్వ రంగ సంస్థల, స్థానిక సంస్థల, విశ్వవిద్యాలయాల, ఇతర ప్రభుత్వ సంస్థలలోని ఉద్యోగుల పిల్లలు, జీవిత భాగస్వాములు అర్హులు.

### వర్సిటీలకు కేటాయింపు ఇదీ..

రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాలుగా ఉన్న పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ద్రవిడియన్ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ వర్సిటీ, ఆర్జీయూకేటీతో పాటుగా క్లస్టర్ యూనివర్సిటీలోని సిల్వర్ జూబ్లీ కాలేజీకి రెండు రీజియన్ల మధ్య 85 శాతం సీట్లను 65.62:34.38 నిష్పత్తిలో విభజించారు. మిగిలిన 15 శాతం సీట్లను అన్‌రిజర్వ్‌డ్ కోటా ప్రకారం రాష్ట్రంలోని విద్యార్థులందరూ పొందవచ్చు. కాగా, ఈ నిబంధనలు 2025-26 విద్యా సంవత్సరానికి మాత్రమే వర్తిస్తాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.








సోమవారం ఉదయం తన నివాసంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్, విదేశాంగ మంత్రి జైశంకర్, సీడీఎస్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాల అధిపతులతో ప్రధాని మోదీ ఉన్నత స్థాయి సమావేశం

# అణు బూచికి బెదరం

(మొదటి పేజీ తరువాయి)

తుడిచే సాహసాన్ని ఉగ్రవాదులు చేశారని, దానికి ప్రతిగా ఉగ్రవాదం ప్రధాన కార్యాలయాలనే తుడిచిపెట్టేశామని, దాంతో, సిందూరాన్ని తుడిచేస్తే పరిణామాలు ఎలా ఉంటాయో ఇప్పుడు ప్రతి ఉగ్రవాదికి తెలిసిందని అన్నారు. మన సరిహద్దుల్లో దాడులు చేయడానికి పాకిస్థాన్ సిద్ధమైందని, కానీ, భారత్ మాత్రం నేరుగా దాని గుండెలపైనే తన్నిందని చెప్పారు. ఉగ్రవాదంపై పోరును ఆపరేషన్ సిందూర్ పునర్ నిర్వచించిందని, సరికొత్త బెంచ్ మార్క్‌ను నిర్దేశించిందని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌లో భారత్ సృష్టించిన యుద్ధ బీభత్సానికి తట్టుకోలేక ఆ దేశం కాళ్ల బేరానికి వచ్చిందని, మరోసారి ఉగ్రవాదానికి పాల్పడబోమని చెప్పిందని, అందుకే తాము కూడా కాల్పుల విరమణకు అంగీకరించామని చెప్పారు. పాకిస్థాన్‌లో చర్చలంటూ జరిగితే ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను అప్పగించడంపైనేనని తేల్చి చెప్పారు. ఉగ్రవాదం, చర్చలు ఒకేసారి జరగవని, ఉగ్రవాదం, వాణిజ్యం ఒకే బాటలో సాగవని, రక్తం, నీళ్లు ఒకేసారి ప్రవహించవని స్పష్టం చేశారు. పహల్గాంలో ఉగ్రదాడి.. అనంతరం ఉగ్రవాదుల పీచమణచడానికి భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సోమవారం రాత్రి 8 గంటలకు ఆయన జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

## ఆపరేషన్ సిందూర్.. భావోద్వేగాల ప్రతీక

ఆపరేషన్ సిందూర్ అనేది కేవలం ఒక్క పేరు మాత్రమే కాదు.. అది కోట్లాదిమంది భారతీయుల భావోద్వేగాలకు ప్రతీక. న్యాయం జరగాలని చేసిన దృఢమైన సంకల్పం. దీనినే ఈనెల ఆరేడు తేదీల్లో ప్రపంచం మొత్తం చూసింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలు, శిక్షణ శిబిరాలపై మన సైనిక బలగాలు కచ్చితమైన దాడులు చేశాయి. వాటిని తిరుగులేని దెబ్బతీశాయి. భారత్ ఇంత సాహసోపేతమైన అడుగులు వేస్తుందని ఉగ్రవాదులు ఎన్నడూ ఊహించి ఉండరు. కానీ, మాకు దేశమే తొలి ప్రాధాన్యమనే సంకల్పంతో జాతి మొత్తం ఏకమైంది. దృఢమైన నిర్ణయాలు తీసుకున్నాం. ప్రభావశీల ఫలితాలు వచ్చాయి. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై మన క్షిపణి, డ్రోన్ దాడులు ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలనే కాదు.. వారి నైతిక స్థైర్యాన్ని కూడా బదాబదలు చేశాయి. బహావల్పూర్, మురిడ్కేల్లోని స్థావరాలు ఎప్పటి నుంచో ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద కేంద్రాలు. అమెరికాలో 9/11, లండన్లోని ట్యూబ్ బాంబింగ్స్, దశాబ్దాలుగా భారత్‌లో ఉగ్రవాద దాడులు సహా ప్రపంచవ్యాప్తంగా ఉగ్ర కార్యకలాపాలకు వీటికి సంబంధం ఉంది. భారతీయ మహిళల పరువును తుడిచేయడానికి ఉగ్రవాదులు సాహసిస్తే.. భారతదేశం ఉగ్రవాద ప్రధాన కార్యాలయాలనే తుడిచిపెట్టేసింది. ఈ ఆపరేషన్లో వంద మందికిపైగా కరడుగట్టిన ఉగ్రవాదులు హతమయ్యారు. దశాబ్దాలుగా భారత్‌లో ఉగ్రదాడుల సూత్రధారులూ వీరిలో ఉన్నారు. భారత్‌కు ఉగ్ర ముప్పుగా పరిణమించిన వారిని అంతే వేగంగా హతమార్చాం.

## ఉగ్రవాదంపై పోరుకు సిందూరమే మా విధానం

ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ, బీఎస్ఎఫ్ వంటి సైనిక దళాలు, పారా మిలటరీ యూనిట్లు ఇప్పటికీ అప్రమత్తంగానే ఉన్నాయి. అన్ని వేళలా దేశ భద్రతకు హామీ ఇస్తున్నాయి. ఉగ్రవాదంపై పోరులో ఆపరేషన్ సిందూర్ ఇక నుంచి భారత సువ్యవస్థిత విధానం. భారత వ్యూహాత్మక వైఖరిలో నిర్ణయాత్మక మార్పు. ఉగ్రవాద వ్యతిరేక పోరాటాలకు ఈ ఆపరేషన్ సరికొత్త ప్రమాణాన్ని నిర్దేశించింది. మన భద్రతా సిద్ధాంతానికి మూడు మూల స్తంభాలున్నాయి. ఒకటి.. నిర్ణయాత్మక ప్రతి దాడి. భారత్‌పై ఉగ్రవాద దాడి జరిగితే.. బలంగా, తిరుగులేని విధంగా జవాబు ఇవ్వడం. భారత్ తన సొంత విధానాలతోనే ప్రతి దాడి చేస్తుంది. ఉగ్రవాద స్థావరాలను వాటి మూలాల్లోనే గురిపెడుతుంది. రెండోది.. అణు బ్లాక్ మెయిలింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. అణ్వస్త్ర



బెదిరింపులకు భయపడేది లేదు. అణు బూచి చూపించి ఉగ్ర స్థావరాలను నిర్వహిస్తే.. కచ్చితమైన, నిర్ణయాత్మక దాడులు చేస్తాం. మూడోది.. ఉగ్రవాదులు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేవారి మధ్య ఎటువంటి తేడా చూడం. ఉగ్రవాద నాయకులు, వారికి ఆశ్రయమిచ్చే ప్రభుత్వాలను వేర్వేరుగా చూడం. మనం హతమార్చిన ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాక్ సీనియర్ సైనికాధికారులు హాజరయ్యారు. అంటే, ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదంలో పాక్ ఏ స్థాయిలో కూరుకుపోయిందో సుస్పష్టమైంది. ఈ వికల వాస్తవాన్ని ప్రపంచమంతా మరోసారి కళ్లారా చూసింది. ముప్పు నుంచి తన పౌరులను కాపాడుకోవడానికి భారత్ నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటూనే ఉంటుంది.

### పాకిస్థాన్ పరుగెత్తుకుంటూ వచ్చింది

భారత్ బలంగా, కచ్చితంగా దాడులు చేయడంతో పాకిస్థాన్ తీవ్ర నిరాశానిస్పృహల్లో కూరుకుపోయింది. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదంపై పోరుకు చేతులు కలపడానికి బదులుగా.. ప్రమాదకర ఆటకు తెర లేపింది. మన పాఠశాలలు, కాలేజీలు, గురుద్వారాలు, మందిరాలు, పౌర ఆవాసాలపై దాడులు చేసింది. అంతటితో ఆగలేదు. సైనిక స్థావరాలపైనా గురిపెట్టింది. కానీ, ఈ దాడి పాకిస్థాన్ దుర్బలత్వాన్ని బయటపెట్టింది. భారతదేశ అడ్వాన్స్‌డ్ వాయు రక్షణ వ్యవస్థల ముందు దాని క్షిపణులు, డ్రోన్లు కట్టె పుల్లల్లా తేలిపోయాయి. వాటిని గగనతలంలోనే నిర్వీర్యం చేశాయి. భారత సరిహద్దుల్లో దాడులు చేయాలని సిద్ధపడితే.. పాకిస్థాన్ నట్టింట్లోకి వెళ్లి గుండెలపైనే భారత్ గట్టిగా మోదింది. భారత క్షిపణులు, డ్రోన్లు అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాయి. పాక్ ఎప్పటినుంచో ఎంతో గొప్పగా చెప్పుకొనే దాని వైమానిక స్థావరాలను ఎందుకు పనికి రాకుండా ధ్వంసం చేశాయి. కేవలం 3రోజుల్లోనే పాకిస్థాన్ ఊహకు కూడా అందనంత విధ్వంసం జరిగింది. భారత్ ప్రతి దాడులతో పాకిస్థాన్ ఉద్రిక్తతలు చల్లారేందుకు దారులు వెతుక్కుంది. తమకు ఊరట కల్పించాలంటూ ప్రపంచ దేశాలను వేడుకుంది. మే 10న మధ్యాహ్నం పాక్ మిలటరీ అధికారులు మన డీజీఎంవో వద్దకు పరుగెత్తుకు వచ్చారు. ఉగ్రవాద కార్యకలాపాలన్నీ పూర్తిగా నిలిపివేస్తామని, భారత్‌పై సైనిక దాడిని కూడా ఆపేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే, పరిస్థితిని భారత్ సమీక్షించింది. పాక్ సైనిక, ఉగ్రవాద స్థావరాలపై ప్రతి దాడులను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించింది. ఇది తాత్కాలికంగా నిలిపివేతే. కానీ ముగింపు కాదు. రాబోయే రోజుల్లో పాకిస్థాన్ ప్రతి అడుగునూ భారత్ నిరంతరం గమనిస్తుంది.

## సైనిక దళాలకు, శాస్త్రవేత్తలకు సెల్యూట్

ఇటీవల భారత్ సహనం, సమర్థతను దేశమంతా చూసింది. ఇందుకు ప్రతి భారతీయుడి తరఫున సైనిక దళాలు, నిఘా సంస్థలు, శాస్త్రవేత్తలకు సెల్యూట్ చేస్తున్నాను. ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలను సాధించడంలో మన సైనికులు తిరుగులేని ధైర్యాన్ని ప్రదర్శించారు. వారి తిరుగులేని పరాక్రమాన్ని దేశంలోని ప్రతి తల్లి, సోదరి, కుమార్తెకు అంకితం ఇస్తున్నాను. పహల్గాం ఉగ్ర దాడి మొత్తం ప్రపంచాన్నే కుదిపేసింది. అమాయక పౌరులు సెలవులకు వెళితే.. కుటుంబ సభ్యులు, పిల్లల కళ్లెదుటే వారిని మతం అడిగి మరీ అతి కిరాతకంగా చంపేశారు. దేశ సామరస్యాన్ని ముక్కలు చేయడానికి చేసిన నీచ ప్రయత్నం ఇది. అందుకే, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవాలంటూ ప్రతి పౌరుడు, ప్రతి రాజకీయ పార్టీ.. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఏకతాటిపై నిలిచారు. అందుకే, ఉగ్రవాదులను ఏరివేయడానికి సైనిక దళాలకు ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. భారత మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే ఎటువంటి పరిణామాలు ఎదురవుతాయో ఇప్పుడు ఉగ్రవాద సంస్థలకు సుస్పష్టంగా అర్థమైంది.

## ఉగ్రవాద శకం కాదు

యుద్ధాల్లో పాకిస్థాన్‌ను భారత్ ఎప్పటికప్పుడు ఓడిస్తూనే ఉంది. దేశ సైనిక శక్తికి సంబంధించి ఆపరేషన్ సిందూర్ సరికొత్త కోణాన్ని ఆవిష్కరించింది. ఎడారుల్లోనే కాదు.. పర్వత ప్రాంతాల్లో యుద్ధాల్లో భారత్‌కు తిరుగులేని సామర్థ్యం ఉంది. తాజాగా అత్యాధునిక యుద్ధంలోనూ భారత్ పైచేయి చాటింది. ఈ ఆపరేషన్లో.. మేడిన్ ఇండియా రక్షణ పరికరాల సత్తా సుస్పష్టంగా రుజువైంది. 21వ శతాబ్దపు యుద్ధంలో బలీయమైన శక్తిగా మేడిన్ ఇండియా రక్షణ వ్యవస్థలు రావడాన్ని ప్రపంచం ఇప్పుడు కళ్లారా చూసింది. అన్ని రూపాల్లో ఉగ్రవాదంపై పోరాటానికి ఐకమత్యమే భారత్ అతి పెద్ద బలమని ఇప్పుడు రుజువైంది. ఇది యుద్ధాల యుగం కాదు. అలాగే, ఉగ్రవాద శకమూ కారాదు. సురక్షిత, అత్యుత్తమ ప్రపంచం కావాలంటే ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించరాదు.

## ఉగ్రవాదం పాకిస్థాన్‌నే మింగేస్తుంది

పాకిస్థాన్ ప్రభుత్వం, సైన్యం ఎప్పటికప్పుడు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూనే ఉన్నాయి. పాకిస్థాన్ పతనానికి కూడా ఇటువంటి చర్యలే కారణమవుతాయి. ఉగ్రవాదానికి ఇలాగే చేయూత ఇస్తే ఏదో ఒక రోజు పాకిస్థాన్‌నే మింగేస్తుంది. పాకిస్థాన్ బయటపడాలంటే ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయాల్సిందే. శాంతికి ఇది తప్ప మరో మార్గం లేదు. ఉగ్రవాదం, చర్చలు సహజీవనం సాగించలేవు. ఉగ్రవాదం, వ్యాపారం ఒకే బాటలో పయనించలేవు. రక్తం, నీళ్లు కలిసి ప్రవహించలేవు. పాకిస్థాన్‌తో ఎప్పుడైనా చర్చలంటూ జరిగితే అది కేవలం ఉగ్రవాదంపైనే. పాక్‌తో సంప్రదింపులంటూ జరిగితే అది పాక్ ఆక్రమిత కశ్మీర్‌పైనే. సుదీర్ఘ కాలంగా మా విధానం ఇదే. ఈ రోజు బుద్ధ పూర్ణిమ. శాంతి మార్గాన్ని శక్తి నిర్దేశించాలని బుద్ధుడు ప్రవచించాడు. శాంతి, సౌభాగ్యాల దిశగా మానవత్వం ముందుకు అడుగులు వేయాలి. శాంతిని నిలబెట్టుకోవాలంటే భారత్ బలంగా ఉండాలి. అంతేనా.. అవసరం వచ్చినప్పుడు ఆ శక్తిని ప్రదర్శించాలి కూడా. తన సిద్ధాంతాలను కాపాడుకోవడానికి భారత్ సంకల్పాన్ని ఇటీవలి ఘటనలు ప్రదర్శించాయి. భారత భద్రతా దళాల తెగువకు మరోసారి వందనం. భారతీయుల ఐక్యత, ధైర్యానికి అభివందనం.



## వాణిజ్య బెదిరింపులతో
# దారికి!

(మొదటి పేజీ తరువాయి)

చరిత్రాత్మక ఘటనలు జరుగుతున్నాయి. భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. వారు ఇప్పట్లో వెనక్కి తగ్గేలా కనిపించలేదు. ఇరు దేశాలు అమెరికాతో వాణిజ్యం నుంచి ఎంతో లబ్ధి పొందవచ్చని వారికి చెప్పా.. మరింతగా వాణిజ్య అవకాశాలు కల్పిస్తానని ప్రతిపాదించా.. ఒకవేళ భారత్-పాక్ వెంటనే కాల్పుల విరమణ పాటించకపోతే.. అమెరికాతో వాణిజ్యం ఉండబోదని స్పష్టం చేశా.. వాళ్లు పలు కారణాలతో కాల్పుల విరమణ పాటించవచ్చు. కానీ అసలైన పెద్ద కారణం మాత్రం వాణిజ్యమే. మేం పాకిస్థాన్, భారత్ రెండింటితోనూ పెద్ద ఎత్తున వాణిజ్యం జరపనున్నాం. ఈ అంశంలో భారత్‌తో చర్చలు మొదలుపెట్టాం. త్వరలో పాకిస్థాన్‌తోనూ చర్చలు జరుపుతాం.." అని ట్రంప్ చెప్పారు. బోలెడన్ని అణ్వాయుధాలు ఉన్న భారత్- పాకిస్థాన్ మధ్య ప్రమాదకర పరిస్థితిని నివారించేలా, ఉన్నపళంగా కాల్పుల విరమణ ప్రకటించేలా తన యంత్రాంగం విజయవంతంగా మధ్యవర్తిత్వం వహించిందని పేర్కొన్నారు. లేకుంటే అణుయుద్ధం జరిగి కోట్లాది మంది చనిపోయేవారని.. దానిని ఆపినందుకు గర్వపడుతున్నానని వ్యాఖ్యానించారు. ఈ ప్రక్రియలతో తమ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో బాగా కృషి చేశారని ప్రశంసించారు. భారత్, పాక్ ప్రధాన మంత్రులు శక్తివంతులు, తిరుగులేని వారని.. ప్రస్తుత పరిస్థితి ఏవిటో అర్థం చేసుకోగలిగిన తెలివి వారికి ఉందని వ్యాఖ్యానించారు. వాణిజ్యం అంశాన్ని తాను వినియోగించినట్టుగా ఎవరూ వినియోగించలేరని, అది స్పష్టంగా చెప్పగలనని పేర్కొన్నారు.

## ట్రంప్ వ్యాఖ్యల్లో వాస్తవం లేదు..!

వాణిజ్యం ఆపేస్తానని హెచ్చరించడంతో భారత్, పాక్ కాల్పుల విరమణకు సిద్ధమయ్యాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు వాస్తవదూరమని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. "ట్రంప్ వ్యాఖ్యలను భారత ప్రభుత్వం ఖండిస్తోంది. ఆపరేషన్ సిందూర్ మొదలయ్యాక మే 9న ప్రధాని మోదీతో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడారు. మే 8న, 10న విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు దోభాల్‌తో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడారు. అందులో ఎక్కడా, ఏ రకంగానూ వాణిజ్యం ప్రస్తావనే రాలేదు" అని వెల్లడించాయి.

# సరిహద్దుల్లో సైన్యాన్ని తగ్గిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సరిహద్దు వెంబడి ఇరువైపులా సైన్యాన్ని తగ్గించాలని నిర్ణయించారు. డ్రోన్లు, మిసైల్ దాడులు జరగొద్దని ఆకాంక్షించారు. ఒకవేళ ఒక తూటా పేలినా.. సీరియస్‌గా పరిగణించాలని తీర్మానించారు. ఈ నెల 10న కాల్పుల విరమణపై ఇరుదేశాల నుంచి ప్రకటనలు వెలువడిన వెంటనే.. డీజీఎంవోల సమావేశాన్ని ఖరారు చేసిన విషయం తెలిసిందే..! సాధారణంగా వీరి భేటీ మంగళవారాల్లో ఉంటుంది. దీన్ని బట్టి.. మంగళవారం కూడా మరోమారు హాట్‌లైన్ సమావేశం జరిగే అవకాశాలున్నాయి. కాగా.. ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించిన కాసేపటికే.. భారత గగనతలంలోకి పాకిస్థాన్‌కు చెందిన పలు డ్రోన్లు ప్రవేశించాయి. తొలుత పఠాన్‌కోట్ వద్ద రాత్రి 8.30 సమయంలో ఒకటి.. బమియాల్ వద్ద రెండు నిఘా డ్రోన్లను గుర్తించినట్లు బీఎస్ఎఫ్ వర్గాలను ఉటంకిస్తూ.. జాతీయ మీడియా కథనాలను ప్రచురించింది. రాత్రి 9.20 సమయంలో జలంధర్, సాంబ సెక్టార్ వద్ద నిఘా డ్రోన్లను సైన్యం కూల్చివేసింది. అమృత్‌సర్ వైపు డ్రోన్లు దూసుకురావడంతో.. న్యూఢిల్లీ నుంచి వచ్చిన ఇండిగో విమానం వెనుదిరిగింది. ఆయా ప్రాంతాల్లోని డ్రోన్లను సమర్థంగా కూల్చివేశామని, ప్రస్తుతం సరిహద్దుల వద్ద పరిస్థితి ప్రశాంతంగా ఉందని సైన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ముందుజాగ్రత్త చర్యగా జమ్మూకశ్మీర్‌లోని సాంబ, హోషియార్‌పూర్‌లో బ్లాకౌట్‌ను ప్రకటిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు.



జమ్మూకశ్మీర్‌లోకి సోమవారం రాత్రి పాకిస్థాన్ డ్రోన్లు దూసుకువచ్చిన నేపథ్యంలో రియాసీ జిల్లాలో బ్లాక్ అవుట్ ప్రకటించడంతో అంతా చీకటిగా ఉన్న దృశ్యం

## ఆపరేషన్ సిందూర్ విజయంపై
# నేటి నుంచి తిరంగయాత్ర

- దేశ వ్యాప్తంగా 11 రోజుల పాటు నిర్వహించనున్న బీజేపీ

న్యూఢిల్లీ, మే 12: పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులను అణచివేయడానికి చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయం సాధించడంతో బీజేపీ మంగళవారం నుంచి దేశవ్యాప్తంగా తిరంగ యాత్ర నిర్వహించనుంది. భారత సైన్యం సాధించిన విజయాలను, మోదీ ప్రభుత్వ నిబద్ధతను ప్రజలకు తెలియజేస్తూ 11 రోజుల పాటు ప్రచారం జరపనుంది. ఈ నెల 13 నుంచి 23 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రేమ్ శుక్లా తెలిపారు. బీజేపీ కార్యకర్తలు జాతీయ జెండాలను పట్టుకొని ఊరేగింపులు నిర్వహిస్తారని చెప్పారు. ముగింపు రోజున విజయోత్సవ సభ నిర్వహిస్తారు. ఈ విషయమై సీనియర్ నాయకులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జె.పి.నడ్డాలు విస్తృతంగా చర్చలు జరిపారు. పార్టీ అధ్యక్షుడు నడ్డా జాతీయ కార్యదర్శులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ యాత్రను సీనియర్ నాయకులు వినోద్ తావ్డే, తరుణ్ చుగ్, సంబిత్ పాత్రలు సమన్వయ పరచనున్నారు. మరోవైపు ఇది రాజకీయ ప్రచారం అన్న ఆరోపణలను ఓ సీనియర్ నాయకుడు ఖండించారు. రాజకీయ ప్రయోజనాలను ఆశించడం లేదని, జాతి విజయాన్ని అందరికీ పంచుకోవడానికే దీన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.



## పాక్ వైమానిక స్థావరాలకు
# చావుదెబ్బ



## నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ రన్‌వే ధ్వంసం

- ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు తునాతునకలు
- మా టాస్కులను 100% పూర్తిచేశాం
- 'ఆపరేషన్ సిందూర్'పై ఆపరేషన్స్ డీజీల ప్రెస్ బ్రీఫింగ్‌లో వెల్లడి

న్యూఢిల్లీ, మే 12: 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా మే 7న జరిపిన దాడుల్లో ఉగ్రవాద స్థావరాలను 100% కచ్చితత్వంతో ధ్వంసం చేశామని త్రివిధ దళాల అధికారులు స్పష్టం చేశారు. ఉగ్రవాదులకు మద్దతుగా కాల్పులకు దిగి, భారత్‌పై క్షిపణి, డ్రోన్ దాడులు చేసిన పాకిస్థాన్‌కు గట్టి జవాబిచ్చామని పేర్కొన్నారు. పాకిస్థాన్ సైన్యానికి, సైనిక సంపత్తికి ఏదైనా నష్టం జరిగితే.. దానికి వారే బాధ్యులన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎయిర్ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్(డీజీఏవో)/ఎయిర్ మార్షల్ ఏకే భారతి, మిలటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్(డీజీఎంవో)/లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్, నావల్ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్/వైస్ అడ్మిరల్ ఏఎన్ ప్రమోద్ 'ఆపరేషన్ సిందూర్'లో భారత విజయాలను గురించి వివరించారు. అందుకు ఆధారంగా పాకిస్థాన్‌పై దాడుల వీడియోలను, శాటిలైట్ చిత్రాలను ప్రదర్శించారు. పాక్ దాడిని భారత గగనతల రక్షణ వ్యవస్థలు సమర్థంగా తిప్పికొట్టాయని, ఆకాశ్ క్షిపణి దెబ్బను దాయాదీకి రుచిచూపించామని వ్యాఖ్యానించారు. భారత్ సర్వసన్నద్ధతతో పాకిస్థాన్ ఆటలు సాగలేదన్నారు.

## పాక్‌లోని 11 ఎయిర్ బేస్‌లకు నష్టం

భారత వైమానిక దళం దాడుల్లో పాక్ ఎయిర్‌బేస్‌లకు భారీ నష్టం వాటిల్లినట్లు ఏకే భారతి వెల్లడించారు. "అత్యంత కచ్చితత్వంతో మేము ప్రయోగించిన క్షిపణులు లక్ష్యాలను ఛేదించాయి. ఫలితంగా పాకిస్థాన్ వాయుసేనకు చెందిన 11 ఎయిర్ బేస్‌లు-- నూర్‌ఖాన్, రహీమ్‌యార్ ఖాన్, రఫీకీ, మురిద్, సుక్కుర్, సియాల్‌కోట్, పాసుర్, చునియాన్, సర్గోగా, స్కర్గు, జకోబాబాద్ వాయుసేన స్థావరాలకు నష్టం వాటిల్లింది. నూర్ ఖాన్, రహీమ్‌యార్ ఖాన్ ఎయిర్ బేసుల్లో రన్‌వేలు దెబ్బతిన్నాయి" అని ఆయన వివరించారు. నూర్‌ఖాన్, రహీమ్‌యార్‌ఖాన్ ఎయిర్‌బేస్‌లపై దాడి దృశ్యాలను మీడియాకు ప్రదర్శించారు. రావల్పిండిలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌లో పాకిస్థాన్‌కు చెందిన ఎయిర్ మొబిలిటీ కమాండ్ ఉంది. ఇక్కడే సాబ్ ఎయిర్‌బోర్న్ అర్లీ వార్నింగ్ వ్యవస్థలు, సీ-130 రవాణా విమానం, ఐఎల్-78 ఏరియల్ రీఫిల్లింగ్ ట్యాంకులు ఉన్నాయి. వీటిపై దాడులు జరిగినట్లు తెలుస్తోంది. పాక్ ప్రతిష్ఠాత్మకంగా భావించే ఎఫ్-16, జేఎఫ్-17ఎస్ ఫైటర్ జెట్లకు సర్గోగ, భోలారీ ఎయిర్‌బేస్‌లు ప్రధాన కేంద్రాలని ఏకే భారతి గుర్తుచేశారు. రహీమ్‌యార్ ఖాన్ ఎయిర్‌బేస్ పాకిస్థాన్‌కు వ్యూహాత్మక స్థావరమన్నారు. తమ పోరు ఉగ్రవాదంపైనేనని, కానీ, పాకిస్థాన్ సైన్యం ఉగ్రవాదులకు అండగా నిలిచి, ఈ పోరాటాన్ని పాక్ పోరాటంగా మార్చాయని పేర్కొన్నారు.

## ఉగ్ర స్థావరాలపై..

పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో ఉగ్రవాదులు ఆశ్రయం పొందుతున్న 9 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని.. 24 క్షిపణులను ప్రయోగించినట్లు ఏకే భారతి తెలిపారు. "100% కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించాం. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆకాశ్ గగనతల రక్షణ క్షిపణులను ఈ ఆపరేషన్‌లో సమర్థంగా వినియోగించాం. పాకిస్థాన్‌కు చెందిన సామాన్య పౌరులకు ఎలాంటి నష్టం జరగలేదు. పాకిస్థాన్ వైపు నుంచి వచ్చిన క్షిపణులు, డ్రోన్లను సమర్థంగా ఎదుర్కొన్నాం" అని వివరించారు. చైనా తయారీ పీఎల్-15 క్షిపణులు, తుర్కియేకు చెందిన డ్రోన్ల(వైఐహెచ్ఏ, సోంగర్)ను కూల్చిన తర్వాత లభించిన శకలాల చిత్రాలను మీడియాకు చూపించారు. దీనికి సంబంధించి నౌకాదళానికి చెందిన వైస్ అడ్మిరల్ ప్రమోద్ మరిన్ని వివరాలను అందజేశారు. "ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లు, రాడార్లను ఉపయోగించాం. ఫ్లీట్, ఎయిర్ డిఫెన్స్‌ను సమర్థంగా వినియోగించాం. డ్రోన్లు, హైస్పీడ్ క్షిపణులతో దాడులు చేశాం. నౌకాదళ అడ్వాన్స్‌డ్ రాడార్ల ద్వారా పాక్ డ్రోన్లను గుర్తించి, అడ్డుకున్నాం. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న పాక్ విమానాలను దగ్గరికి రాకుండా నిలువరించాం. ఈ విషయంలో త్రివిధ దళాలు సమన్వయంతో పనిచేశాయి. స్వదేశీ పరిజ్ఞానంతో బలమైన ప్రతిస్పందనను పాక్‌కు చూపించాం" అని వ్యాఖ్యానించారు.

### కరాచీ కంటోన్మెంట్‌పై..

కరాచీలోని 'మలీర్ కంటోన్మెంట్'పైనా దాడి చేసినట్లు వాయుసేన, నౌకాదళం వెల్లడించాయి. ఇజ్రాయెల్ తయారీ హరూప్ డ్రోన్లతో దాడి చేసినట్లు తెలిపాయి. నౌకాదళం అరేబియా సముద్రంలో మోహరించి, పాకిస్థాన్ యుద్ధ నౌకలను కరాచీ పోర్టుకు పరిమితం చేశామని వైస్ అడ్మిరల్ ప్రమోద్ వెల్లడించారు. ఇప్పటికిప్పుడు ఆపరేషన్లకు తాము సిద్ధమని ప్రకటించారు. వాయుసేన, ఆర్మీ అధికారులు తాము తదుపరి ఆపరేషన్లకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

## అణు స్థావరాలపై దాడి చేయలేదు

సర్గోగా ఎయిర్‌బేస్‌కు సమీపంలో ఉండే కిరాణా హిల్స్‌లో తమ అణుస్థావరాలున్నట్లు పాకిస్థాన్ స్వయంగా తెలిపింది. కిరాణా హిల్స్‌పై భారత్ దాడులు చేసిందంటూ సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులపై ఏకే భారతిని విలేకరులు ప్రశ్నించారు. దీనికి ఆయన సమాధానమిస్తూ.. "పాక్ తన అణుస్థావరాల వివరాలను చెప్పినందుకు థాంక్స్. కానీ, కిరాణా హిల్స్ మా టార్గెట్ జాబితాలో లేవు" అని పేర్కొన్నారు. అయితే.. సర్గోగా ఎయిర్‌బేస్‌పై దాడి నేపథ్యంలో.. పాకిస్థాన్ పౌరులు అణుస్థావరాలపై దాడులంటూ సోషల్ మీడియాలో పోస్టు చేశారని తెలుస్తోంది.






## 32 విమానాశ్రయాల్లో సర్వీసులు షురూ

» ఆపరేషన్ సిందూర్‌తో 7 నుంచి ఆగిన రాకపోకలు

న్యూఢిల్లీ, మే 12 (ఆంధ్రజ్యోతి): పాక్‌తో కాల్పుల విరమణ నేపథ్యంలో ఉత్తర, పశ్చిమ భారత్ ప్రాంతాల్లోని 32 విమానాశ్రయాల తాత్కాలిక మూసివేతను ఎత్తేస్తున్నట్లు భారత విమానాశ్రయాల సంస్థ (ఏఏఐ) సోమవారం ప్రకటించింది. ఈ విమానాశ్రయాల్లో పౌర విమానాల రాకపోకలు తక్షణం ప్రారంభమవుతాయని పేర్కొంది. ఇండిగో, స్పైస్‌జెట్ సహా పలు ప్రధాన విమానయాన సంస్థలు కూడా విమాన సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించాయి. ఏఏఐ ఆదేశాల నేపథ్యంలో విమానయాన సంస్థలు, ఎయిర్‌పోర్టుల అధికారులు విమాన సర్వీసుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాయి. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో బుధవారం నుంచి 24 విమానాశ్రయాల పరిధిలో విమానాల రాకపోకలపై ఏఏఐ ఆంక్షలు విధించింది. శనివారం దాన్ని 32 ఎయిర్‌పోర్టులకు విస్తరించింది. శ్రీనగర్, చండీగఢ్, అమృత్‌సర్, జై సల్మేర్, జోధ్‌పూర్, పఠాన్‌కోట్, లేహ్, రాజ్‌కోట్, పోర్ బందర్ తదితర 32 విమానాశ్రయాల పరిధిలో తాత్కాలికంగా విమాన సర్వీసులు రద్దు చేశారు.

## ఆపరేషన్ సిందూర్‌లో అదానీ డ్రోన్లు

» స్కైస్ట్రైకర్లతో పాక్‌ను దెబ్బకొట్టిన భారత్

న్యూఢిల్లీ, మే 12: అదానీ గ్రూపునకు చెందిన ఆల్ఫా డిజైన్ టెక్నాలజీస్ అభివృద్ధి చేసిన స్కైస్ట్రైకర్ డ్రోన్లు ఆపరేషన్ సిందూర్‌లో సత్తాచాటాయి. భారత్‌లోని అనేక నగరాలపై పాక్ చేసిన దాడులను తిప్పికొడుతూనే.. భారత్ మరిన్ని క్షిపణి, డ్రోన్ దాడులకు దిగింది. ఈ క్రమంలో కామికేజ్ డ్రోన్లుగా పిలిచే స్కైస్ట్రైకర్ డ్రోన్లను వినియోగించింది. ఈ డ్రోన్లను బెంగళూరులోని అదానీ గ్రూపు సంస్థ ఆల్ఫా డిజైన్ టెక్నాలజీస్, ఇజ్రాయెల్‌కు చెందిన ఎల్బిట్ సెక్యూరిటీ సిస్టమ్స్ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఈ అధునాతన డ్రోన్లు 100 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలపై దాడిచేసేందుకు వినియోగిస్తున్నారు. ఆల్ఫా డిజైన్ టెక్నాలజీస్ సంస్థ వీటిని భారత ఆర్మీకి సరఫరా చేస్తోంది. 5 నుంచి 10 కేజీల మందుగుండును తీసుకెళ్లే విధంగా వీటిని రూపొందించారు. స్కైస్ట్రైకర్ మానవరహిత విమాన వ్యవస్థలా గాలిలోకి ఎగిరి, క్షిపణిలా దాడి చేస్తుంది. ఇది నిర్దేశిత ప్రాంతంపై తిరుగుతూ.. లక్ష్యాలను గుర్తించి విరుచుకుపడుతుంది. తక్కువ శబ్దం చేస్తుంది కాబట్టి.. తక్కువ ఎత్తులో ఎగిరినా శత్రువు గుర్తించడం కష్టం.

## పది ఉపగ్రహాలతో నిత్యం పహారా: ఇస్రో

ఇంఫాల్, మే 12: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో దేశ ప్రజల భద్రత, రక్షణ నిమిత్తం కనీసం పది ఉపగ్రహాలు ఆకాశంలో నిరంతరం పహరా కాస్తున్నాయని ఇస్రో ఛైర్మన్ వి నారాయణన్ అన్నారు. మణిపూర్‌లోని ఇంఫాల్‌లో జరిగిన సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (సీఏయూ) స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల మధ్య దేశ భద్రత కోసం ఇస్రో చేస్తున్న కృషిని వివరించారు. 'మన ఇరుగు పొరుగు దేశాల గురించి అందరికీ తెలుసు. మన దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం ఉపగ్రహాలతో నిత్యం నిఘా పెట్టాలి. 7 వేల కిలోమీటర్ల మేర ఉన్న సముద్ర తీర ప్రాంతాలను పర్యవేక్షించాలి. మన ఉత్తర భాగాన్నంతా నిరంతరం పరిశీలించాలి. ఉపగ్రహాలు, డ్రోన్ల సాయం లేకుండా దాన్ని సాధించలేం' అని నారాయణన్ అన్నారు.

## యుద్ధంలో నడిపించిన రహస్య గైడ్

న్యూఢిల్లీ, మే 12 : సరిహద్దు వెంబడి గ్రామాలు, పట్టణాల్లో ప్రమాదాన్ని శంకించగానే విద్యుత్ దీపాలు ఆర్పివేయడం, సైరన్లు మోగించడం, అక్కడి నుంచి ప్రజలను తరలించడం వంటి చర్యలను అధికారులు చకచకా చేపట్టడం ఆపరేషన్ సిందూర్ కొనసాగినంతకాలం చూశాం. ఆ చివర జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ నుంచి ఈ చివర గుజరాత్‌లోని కచ్ వరకు.. అధికారులు ఒకేరకమైన యుద్ధ ప్రొటోకాల్‌ను సమర్థవంతంగా అమలుచేశారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం చాలావరకు తగ్గించగలిగారు. ప్రజలను ఈ సమయంలో అధికారులు ఎప్పటికప్పుడు గైడ్ చేయగా, వారిని ఓ రహస్య మాన్యువల్ గైడ్ చేసింది. అదే యూనియన్ వార్ బుక్. యుద్ధం వచ్చినప్పుడు ఎలా ప్రతిస్పందించాలో ఈ మాన్యువల్‌లో స్పష్టంగా మార్గదర్శకాలు ఉన్నాయి. పాక్‌తో సంఘర్షణ మొదలుకాగానే...'యూనియన్ వార్ బుక్‌ను అనుసరించండి' అంటూ దేశవ్యాప్తంగా అత్యున్నత స్థానాల్లో ఉన్న కీలక అధికారులకు ఆదేశాలు వెళ్లాయని సీనియర్ అధికార వర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ ఆంగ్ల పత్రిక కథనం ప్రచురించింది. ఈ కథనాన్ని అనుసరించి...రెండువందల పేజీలతో నీలం రంగులో ఉన్న ఈ మాన్యువల్‌ను 2010లో కేంద్ర రక్షణ, హోంశాఖలు, కేబినెట్ సచివాలయ అధికారులు సంయుక్తంగా రూపొందించారు. ముంబైపై ఉగ్రదాడి జరిగిన రెండేళ్లతర్వాత దీనిని తయారుచేశారు. చాలా లిమిటెడ్ ఎడిషన్ ఇది. బయటలభ్యం కాదు. కేంద్ర మంత్రిత్వశాఖలు, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శుల వద్ద మాత్రమే ఒక ప్రతి ఉంటుంది. సాయుధ సంఘర్షణ తలెత్తినప్పుడు ప్రభుత్వంలోని వివిధ శాఖలు, విభాగాలు ఎలా ప్రతిస్పందించాలీ....ఎలా పనిచేయాలనే వివరాలు ఇందులో ఉంటాయి.

# పాక్ ప్రభుత్వ లాంఛనాలతో ఉగ్రవాదుల అంత్యక్రియలు

## ఉగ్రమూకల శవ పేటికలపై పాక్ పతాకం.. అంత్యక్రియలకు లష్కరే కమాండర్



ఉగ్రవాదుల శవపేటికలపై పాకిస్థాన్ జాతీయ పతాకం.. అంత్యక్రియల్లో పాల్గొన్న లష్కరే కమాండర్ రవూఫ్, సైనికాధికారులు

న్యూఢిల్లీ, మే 12: భారత్‌పై విషం చిమ్మడమే తన విధానంగా పెట్టుకున్న పాకిస్థాన్.. తాజాగా అంతర్జాతీయ సమాజాన్ని కూడా ఏమార్చే ప్రయత్నం చేసి అడ్డంగా దొరికిపోయింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్‌లోని ఉగ్ర శిబిరాలపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ జరిపిన దాడుల్లో పదుల సంఖ్యలో ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో లష్కరే తాయిబా ఉగ్రవాద సంస్థకు చెందిన పలువురు మృతి చెందారు. అయితే.. మృతి చెందిన ఉగ్రవాదులకు పాక్ ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించింది. ఈ అంత్యక్రియల్లో లష్కరే తాయిబాకు చెందిన సీనియర్ కమాండర్ హఫీజ్ అబ్దుల్ రవూఫ్ సహా సైనికాధికారులు, పాక్ పోలీసులు, రాజకీయ నేతలు పాల్గొన్నారు. రవూఫ్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా అమెరికా కూడా ముద్ర వేసింది. అలాంటి ఉగ్రవాదికి ఆశ్రయం ఇవ్వడంతో పాటు అంత్యక్రియల్లో పాల్గొన్నా.. పాక్ ప్రభుత్వం మౌనంగా ఉంది. అంతేకాదు.. దీనిని సమర్థించుకుంటూ.. అయనను మత గురువుగా, కుటుంబ సభ్యుడిగా పేర్కొంటూ అంతర్జాతీయ సమాజాన్ని ఏమార్చే ప్రయత్నం చేసింది. మరోవైపు, పాక్ సైన్యం కూడా రవూఫ్‌ను వెనుకేసుకు వచ్చింది. "ఆయన స్థానిక మతగురువు. ఓ పార్టీ కార్యకర్త, కుటుంబ సభ్యుడు." అంటూ పాకిస్థాన్‌కు చెందిన ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదురి మీడియా సమావేశంలో చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో.. ఓ గుర్తింపు కార్డును కూడా ప్రదర్శించారు. అయితే.. ఇక్కడే పాక్ అడ్డంగా దొరికిపోయింది. సదరు గుర్తింపు కార్డులో పేర్కొన్న పుట్టిన రోజు, గుర్తింపు సంఖ్య వంటివి అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ రవూఫ్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా పేర్కొంటూ జారీ చేసిన కార్డులోని వివరాలతో పక్కాగా సరిపోయాయి. ఇదే విషయాన్ని భారత సైనికాధికారులు బట్టబయలు చేశారు.

### రాజకీయంగా కూడా..

రవూఫ్ ఉగ్రవాది మాత్రమే కాదు. రాజకీయ నాయకుడిగా కూడా చలామణి అవుతున్నాడు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లాహోర్‌లోని ఎన్ఏ-119 నియోజకవర్గం నుంచి పీఎంఎంఎల్ పార్టీ తరఫున పోటీ చేశాడు. ఈయనకు 2 వేల ఓట్లు కూడా పడ్డాయి. పీఎంఎంఎల్ పార్టీకి లష్కరే ఉగ్రవాద నాయకుడు హఫీజ్ సయీద్ మద్దతిస్తుండడం గమనార్హం. ఈ ఎన్నికల్లో హఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్ సైతం లాహోర్ ఎన్ఏ-122 నియోజకవర్గం నుంచి పోటీ చేశాడు. ఇక, రవూఫ్ గతంలో లష్కరేకు ఫలాహ్-ఇ-ఇన్‌శానియత్ ఫౌండేషన్ పేరుతో నిధులు సమకూర్చాడు.

### వీరంతా ఎవరు?: భారత్

ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాల్గొన్న పాక్ అధికారులు, ఉగ్రవాదుల జాబితాను కేంద్రం విడుదల చేసింది. వీరంతా ఎవరు? అంటూ పాక్‌ను నిలదీసింది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉగ్రవాదుల అంత్యక్రియల్లో లష్కరే కమాండర్ అబ్దుల్ రవూఫ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశాడు. అలాగే పాక్ సైన్యానికి చెందిన లెఫ్టినెంట్ జనరల్ ఫయ్యాజ్ హుస్సేన్ షా, మేజర్ జనరల్ రావ్ ఇమ్రాన్ సర్తాజ్, బ్రిగేడర్ మహ్మద్ ఫర్ఖాన్ షబ్బీర్, సీనియర్ పోలీసు అధికారి ఉస్మాన్ అన్వర్, రాజకీయ నేత మాలిక్ సోహైబ్ అహ్మద్ కూడా ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

### పాక్‌కు ఆయుధాలు ఇవ్వలేదు

» సైనిక కార్గో విమానం పంపామన్నది వదంతే: చైనా

న్యూఢిల్లీ, మే 12: ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌ను ఎదుర్కొనేందుకు పాకిస్థాన్‌కు చైనా ఆయుధాలు పంపినట్లు వస్తున్న వార్తలను డ్రాగన్ దేశం తోసిపుచ్చింది. అవన్నీ వదంతులేనని కొట్టిపారేసింది. గత వారం పాక్‌కు ఆయుధ సామగ్రితో కూడిన అతి పెద్ద కార్గో విమానాన్ని చైనా పంపిందన్న వార్తల నేపథ్యంలో సోమవారం ఆ దేశ వాయుసేన స్పందించింది. 'మేం అటువంటి విషన్‌ను చేపట్టలేదు. ఈ వదంతుల వెనక ఉన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇంటర్నెట్.. చట్టానికి అతీతమేమీ కాదు' అంటూ రక్షణ శాఖ వెబ్‌సైట్‌లో ఓ ప్రకటన చేసింది. భారత్‌పై పాక్ చైనా యుద్ధ విమానాలను ప్రయోగించిందన్న వాదనలను అంతకుముందే బీజింగ్ కూడా కొట్టిపారేసింది. 'మేం అన్ని రకాల ఉగ్రవాదానికి వ్యతిరేకం. శాంతి కోసం సంయమనం పాటించాలని ఇరువైపుల వారిని కోరుతున్నాం' అంటూ పేర్కొంది.

## యుద్ధం అంటే.. బాలీవుడ్ సినిమా కాదు!

» దౌత్యానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి

» ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ నరవణె వ్యాఖ్యలు



పుణె, మే 12: భారత్, పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రశ్నలు వస్తున్న నేపథ్యంలో భారత ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ నరవణె కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం అనేది రొమాంటిక్ లేదా బాలీవుడ్ సినిమా కాదన్నారు. పిల్లలతో సహ ప్రియమైన వారిని కోల్పోవాల్సి వస్తుందని, ఆ ఆవేదన తరతరాలు వెంటాడుతుందన్నారు. దౌత్యానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలోని పుణెలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న నరవణె కాల్పుల విరమణ ఒప్పందంపై మాట్లాడారు. 'నాకు ఆదేశాలు వస్తే.. తప్పకుండా యుద్ధానికి వెళ్తా. కానీ, దౌత్యమార్గమే నా ప్రథమ ప్రాధాన్యంగా ఉంటుంది' అని పేర్కొన్నారు. 'యుద్ధం లేదా హింస ఏదైనా చివరి అవకాశంగా మాత్రమే ఉండాలి. అందుకే మన ప్రధాని ఇది యుద్ధాల యుగం కాదని చెబుతుంటారు. బుద్ధి లేని వ్యక్తులు మనపై యుద్ధాన్ని బలవంతంగా రుద్దినప్పటికీ, మనం దాని కోసం ఉత్సాహంగా ఉండకూడదు' అని జనరల్ నరవణె అన్నారు.

### 17 మంది పాపలకు 'సిందూర్' పేరు

కుషినగర్ (యూపీ), మే 12: 'ఆపరేషన్ సిందూర్' స్ఫూర్తితో ఉత్తరప్రదేశ్‌లోని నవజాత శిశువులకు 'సిందూర్'గా వారి తల్లిదండ్రులు నామకరణం చేశారు. కుషినగర్ మెడికల్ కాలేజీలో మే 10, 11 తేదీల్లో జన్మించిన 17 మంది ఆడపిల్లలకు సిందూర్ అని పేరు పెట్టారని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కే షాహీ తెలిపారు. పాకిస్థాన్‌పై భారతసైన్యం చేసిన ఈ ఆపరేషన్‌కు గుర్తుగా.. పుట్టిన పిల్లలకు ఈ పేరు పెట్టడాన్ని తల్లిదండ్రులు గౌరవసూచకంగా భావిస్తున్నారని ఆయన చెప్పారు. "పహల్గాం దాడిలో ఎంతో మంది మహిళలు తమ భర్తల్ని కోల్పోయారు. దానికి ప్రతిస్పందనగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో దీటుగా స్పందించింది. సైనికుల త్యాగాలను గౌరవిస్తూ మా కుమార్తెలకు సిందూర్ అని పేరు పెట్టాం" అని చిన్నారుల తల్లిదండ్రులు చెప్పారు.

# త్యాగం కన్న పిల్లలు!

## స్వాతంత్ర్యం అనంతరం యుద్ధాలు, దాడుల్లో 21 వేలకు పైగా సైనికులు మృతి



లాన్స్ నాయక్ దినేశ్‌కుమార్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆయన ఐదేళ్ల కుమారుడు

» గత రెండు దశాబ్దాల్లో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు 3,500 మందికిపైనే

» నేడు అమర సైనికుల పిల్లల దినోత్సవం

ఆర్మీ లాన్స్ నాయక్ దినేశ్‌కుమార్ శర్మ.. రెండు రోజుల కింద పాక్ జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందారు. హరియాణాలోని పల్వాల్‌కు చెందిన ఆయనకు ఏడేళ్ల కావ్య, ఐదేళ్ల దర్శన్ ఇద్దరు పిల్లలు. దినేశ్ భార్య సీమ ఇప్పుడు ఏడు నెలల గర్భవతి. అంతా అమరవీరుడిగా దినేశ్‌కుమార్‌ను కీర్తిస్తున్నా.. తండ్రి ప్రేమను కోల్పోయిన ఆ పిల్లల పరిస్థితి ఏమిటి, పుట్టబోయే బిడ్డ అయితే కనీసం తండ్రిని చూడలేని స్థితి. ఆర్థికంగా, విద్యాపరంగా ప్రభుత్వ సాయం అందినా.. ఆ పిల్లలు అనుభవించే మానసిక వేదన మాత్రం ఎవరూ తీర్చలేనిది. ఇది ఒక రకంగా ఆ పిల్లలు దేశం కోసం చేసిన త్యాగమే! వారు త్యాగం కన్న పిల్లలే!

### యుద్ధమేదైనా పిల్లలపై ప్రభావం..

యుద్ధాలు, పోరాటాల్లో అమర వీరులైనవారి పిల్లల త్యాగాలను, వారికి తగిన సాయం అందాల్సిన అవసరాన్ని గుర్తు చేసుకుంటూ ఏటా మే 13న 'చిల్డ్రన్ ఆఫ్ ఫాలెన్ పేట్రియాట్స్ డే'గా నిర్వహిస్తుంటారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల సంతానాన్ని గౌరవించుకునే రోజు ఇది. తాజాగా పాక్ దాడుల్లో కన్నుమూసిన వైమానికదళ సార్జెంట్ సురేంద్ర కుమార్ మోగాకు 11 ఏళ్ల కుమార్తె, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. పహల్గాం దాడి తర్వాత గాలింపు చర్యల్లో ఉధంపూర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో కన్నుమూసిన హవల్దార్ ఝంటు అలీ షేక్‌కు పదేళ్ల కుమారుడు, ఆరేళ్ల కుమార్తె ఉన్నారు.

### వేలాది మంది అనాథలుగా..

ఆర్మీ విశ్రాంత సైనికుల వ్యవహారాల డైరెక్టరేట్ గణాంకాల ప్రకారం.. మన దేశంలో స్వాతంత్ర్యం నాటి నుంచి 21 వేల మంది సైనికులు యుద్ధాల్లో అమరులయ్యారు. గత రెండు దశాబ్దాల్లో మిలటరీ, పారామిలటరీ దళాల్లో పనిచేసే తమ తల్లినిగానీ, తండ్రినిగానీ కోల్పోయిన పిల్లలు 3,500 మందికిపైనే. వీరిలో చాలా మంది తమవారిని కోల్పోయిన బాధను అనుభవిస్తూనే ఉన్నారు. ఇలా "తల్లినో, తండ్రినో పోగొట్టుకున్న పిల్లలను జీవితాంతం ఆ బాధ వెంటాడుతుంది. కానీ ధైర్యం వారి డీఎన్ఏలోనే ఉంటుంది. ఆ వారసత్వాన్ని నిలబెట్టేలా ముందుకు సాగే ప్రయత్నం చేస్తుంటారు కూడా.." అని భారత సైన్యంతో కలసి పనిచేసే పిల్లల మానసిక నిపుణురాలు డాక్టర్ రీనా మల్హోత్రా చెబుతున్నారు. ఇక ఆర్మీ వెల్ఫేర్ ఫండ్, ఎక్స్ సర్వీస్ మెన్, భారత్ కే వీర్, వీర్ నారీస్ వెల్ఫేర్ బోర్డు వంటివి అమరులైన సైనికుల పిల్లల చదువు, ఆ కుటుంబాలకు ఆర్థిక సాయం బాధ్యతలను చూసుకుంటున్నాయి.

- సెంట్రల్ డెస్క్

### నాన్నను తలచుకుని ఏడవని రోజు లేదు..

- జోయా ఆలం, శ్రీనగర్‌కు చెందిన 13 ఏళ్ల బాలిక. బీఎస్ఎఫ్‌లో పనిచేస్తున్న ఆమె తండ్రి 2018లో ఉగ్రవాదుల బాంబు దాడిలో కన్నుమూశారు. ప్రస్తుతం డెహ్రాడూన్ మిలటరీ స్కూల్‌లో చదువుతున్న ఆమె.. 'నేను నాన్న తలచుకుని ఏడవని రోజు లేదు. నా డైరీలో మా నాన్నకు లేఖలు రాస్తా. నేను చెబుతుంటే మా నాన్న వింటున్నట్టు అనిపిస్తుంది' అని ఆమె చెబుతోంది.
- తమిళనాడుకు చెందిన కవితారాజ్ తండ్రి ఎం.రాజేంద్రన్ సైన్యంలో సుబేదార్. కార్గిల్ యుద్ధంలో కన్నుమూశారు. అప్పుడు ఆమె వయసు పదేళ్లు. 'యుద్ధం నా తండ్రిని, నా బాల్యాన్ని పోగొట్టింది' అని ఆమె ఇప్పటికీ ఆవేదన చెందుతూనే ఉంది.

# పోరు బందర్!




(మొదటిపేజీ తరువాయి)

దాడిని తిప్పికొట్టే ఎయిర్ డిఫెన్స్ వినియోగమూ చాలా పెరిగింది. తుర్కియే, చైనాల నుంచి దిగుమతి చేసుకున్న డ్రోన్లను పాకిస్థాన్ పెద్ద సంఖ్యలో భారత్‌పై ప్రయోగించింది. అయితే వాటిని అడ్డుకోవడం, కూల్చివేయడంలో మన ఎయిర్ డిఫెన్స్ అద్భుత విజయాలు సాధించింది. ఇందులో ఎస్-400, ఆకాశ్ వంటి క్షిపణులతో పాటు మన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ తయారుచేసిన డీ4 వ్యవస్థలు ప్రధాన పాత్ర నిర్వహించాయి.

డీ4 అంటే డ్రోన్ డిటెక్షన్, డెటర్ అండ్ డెస్ట్రాయ్. ఇందులో రాడార్లు, లేజర్లు, ఎలక్ట్రో ఆప్టికల్ వ్యవస్థలు ముఖ్యమైనవి. భారత్‌కు చెందిన రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ వీటిని అభివృద్ధి చేయగా పెద్దసంఖ్యలో తయారు చేసే బాధ్యతను భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)కు అప్పగించారు. తయారీ దశలో మళ్లీ బీఈఎల్‌లోని పరిశోధన, అభివృద్ధి విభాగాలు వీటికి తుది మెరుగులు దిద్దుతాయి. ఈ డీ4 వ్యవస్థలకు కావాల్సిన రాడార్లను బెంగళూరు యూనిట్‌లో తయారు చేయగా, జామర్లను తెలంగాణలోని హైదరాబాద్ యూనిట్ ఉత్పత్తి చేస్తోంది. తర్వాత వీటిని ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నానికి తరలిస్తారు. మచిలీపట్నం యూనిట్ ఎలక్ట్రో ఆప్టిక్ ఉపకరణాలను తయారు చేయడంతోపాటు రాడార్లు, జామర్లను కూడా వాటికి అనుసంధానించి డీ4 వ్యవస్థకు తుదిరూపును ఇస్తుంది. అక్కడి నుంచి వాటిని సైన్యానికి అందజేస్తారు.

భారత్‌పైకి పాక్ ప్రయోగించిన డ్రోన్లను తొలుత రాడార్లు ఎక్కువ దూరం నుంచి గుర్తిస్తాయి. అవి కొంత దగ్గరకు వచ్చిన తర్వాత కెమెరాలు, లేజర్ రేంజ్ ఫైండర్ వంటి ఎలక్ట్రో ఆప్టిక్ పరికరాలు వాటిని మరింత స్పష్టంగా గుర్తించి భారత దళాలను అప్రమత్తం చేస్తాయి. ఆపై ఆ డ్రోన్లను రెండు రకాలుగా నేలకూలుస్తారు. ఒకటి జీపీఎస్ జామింగ్, రెండు లేజర్ ప్రయోగం! డ్రోన్లను ప్రత్యర్థి పైకి ప్రయోగించేటప్పుడు వాటిని జీపీఎస్ ద్వారా ప్రోగ్రామ్ చేస్తారు. అంటే భారత స్థావరాలు ఎక్కడ ఉన్నాయనే శాటిలైట్ డేటాను వాటిలో పొందుపరుస్తారు. ఆ తర్వాత మనం గూగుల్ మ్యాప్ సాయంతో కారు డ్రైవ్ చేసినట్లే ఇవి కూడా జీపీఎస్ సాయంతో అక్కడికి చేరుకుని దాడి చేస్తాయి. ఈ జీపీఎస్ సిగ్నల్‌ను ఎలక్ట్రానిక్ పరికరాల సాయంతో జామ్ చేస్తే డ్రోన్లు ఎటు వెళ్లాలో దిక్కుతోచక కుప్పకూలిపోతాయి. లేదంటే ఈ డ్రోన్లపైకి లేజర్‌ను ప్రసరింపజేయడం ద్వారా కూడా కూల్చివేయవచ్చు. ఇలా డ్రోన్లను కూల్చడంలో బీఈఎల్ తయారీ డీ4 వ్యవస్థలు అద్భుతమైన పనితీరును ప్రదర్శించాయని భారత రక్షణ శాఖ అధికారులు కొందరు ఆంధ్రజ్యోతికి తెలిపారు. రాను రాను యుద్ధాల్లో డ్రోన్ల వాడకం చాలా పెరగబోతోంది. యుద్ధ విమానాల నుంచి, యుద్ధ నౌకల నుంచి, యుద్ధ ట్యాంకుల నుంచి కూడా డ్రోన్లను ప్రయోగించడం, నియంత్రించడం వంటి పరిజ్ఞానాలు పెద్ద ఎత్తున రాబోతున్నాయి. అలాగే డ్రోన్ల తయారీ ఖర్చు తక్కువ కావడంతో ఉగ్రవాదులు, తీవ్రవాదులు, సంఘ విద్రోహ శక్తులు సైతం వాటిని తయారు చేసి దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో బీఈఎల్ పరిశోధనల ఫలితమే ప్రస్తుత యుద్ధంలో కనిపించిందని రక్షణ అధికారులు పేర్కొంటున్నారు. - ఆంధ్రజ్యోతి రక్షణ ప్రత్యేక ప్రతినిధి

## పహల్గాం కుట్రదారులను చంపారా?

» భద్రతా వైఫల్యానికి బాధ్యులెవరు?

» పార్లమెంటు ప్రత్యేక భేటీ ఎందుకు పెట్టరు?

» ప్రభుత్వం వివరణ ఇవ్వాలన్న కాంగ్రెస్

న్యూఢిల్లీ/తిరువనంతపురం, మే 12: పహల్గాంలో ఉగ్రవాదుల దాడి కుట్రదారులను అరెస్టు చేయడం గానీ, చంపేయడం గానీ చేశారా అని కేంద్రాన్ని కాంగ్రెస్ ప్రశ్నించింది. 26 మంది అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఘటనకు సంబంధించి భద్రతావైఫల్యానికి బాధ్యులెవరని నిలదీసింది. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేస్తున్నారో లేదో చెప్పాలని అడిగింది. ద్వైపాక్షిక అంశమైన కశ్మీరుపై దేశం వైఖరి మారిందా.. మూడో దేశం జోక్యంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. సోమవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి భూపేశ్ బఘేల్ ఢిల్లీలో, మరో జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ తిరువనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. భారత్-పాక్ కాల్పుల విరమణను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం మన దౌత్య వైఫల్యం కాదా అని నిలదీశారు. తాజా పరిణామాలపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను గానీ, అఖిల పక్ష సమావేశాన్ని గానీ ఎందుకు ఏర్పాటుచేయడం లేదని బఘేల్ ప్రశ్నించారు. ఇకపై ప్రధాని మోదీ రాకుంటే తమ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అఖిల పక్షానికి రారని స్పష్టంచేశారు. కశ్మీరు అంశంపై మూడో పక్షం జోక్యానికి భారత్ సిద్ధంగా ఉందా అని వేణుగోపాల్ ప్రశ్నించారు. అదే జరిగితే సిమ్లా ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లవుతుందన్నారు.

## 'సెకీ' సీఎండీ గుప్తాపై కేంద్రం వేటు

(మొదటిపేజీ తరువాయి)



అథారిటీ అంగీకరించినట్లు కేంద్ర సిబ్బంది శాఖ వెల్లడించింది. గుప్తా గుజరాత్ కేడర్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి. 2023 జూన్‌లో సెకీ సీఎండీగా రెండేళ్ల కాలానికి బాధ్యతలు చేపట్టారు. మరో నెలలో ఆయన పదవీకాలం ముగియనుంది. ఈలోపే ఈ నెల 10వ తేదీన ఆయనపై వేటు వేయడం గమనార్హం. ఆయన్ను తొలగించడానికి కారణాలేంటో ప్రభుత్వం పేర్కొనలేదు. అయితే అదానీ స్కాంతో ఈ నిర్ణయానికి సంబంధం ఉందని కాంగ్రెస్ ఆరోపించింది. ఇలాంటి చర్యలతో కుంభకోణాన్ని దాచిపెట్టలేరని స్పష్టంచేసింది. అదానీ, ఆయన సహచరులపై అమెరికా అధికారులు చార్జిషీటు దాఖలుచేశారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గుర్తుచేశారు. అందులో సెకీ కూడా ఉందన్నారు. సౌర విద్యుత్ ఒప్పందాలు కుదుర్చుకునేందుకు భారత్‌లోని కొన్ని రాష్ట్రాల అధికారులకు అదానీ రూ.2,029 కోట్ల వరకు ముడుపులు ఇచ్చారని.. సెకీ సిఫారసుతో కొన్ని రాష్ట్రాలు అదానీతో విద్యుత్ కొనుగోలుకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయన్నారు. 2024లో విద్యుత్ టెండర్ల జారీ విధానాలను సెకీ మార్చిందని.. తద్వారా అంతకు ముందు అవినీతి జరిగిందని అంగీకరించినట్లయిందని చెప్పారు. కాగా.. నాటి ఏపీ సీఎం జగన్ హయాంలో సెకీతో రాష్ట్రప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. 25 ఏళ్ల పాటు కరెంటు కొనడానికి ఒప్పందం చేసుకున్నారని.. ఈ వ్యవహారంలో జగన్‌కు రూ.1,750 కోట్ల ముడుపులు అందాయని టీడీపీ గతేడాది ఏసీబీకి ఫిర్యాదు చేసింది.


## వలసలపై బ్రిటన్ కఠిన వైఖరి

లండన్, మే 12: విదేశీయుల వలసలపై బ్రిటన్ కఠిన వైఖరి అవలంబించనుంది. పౌరసత్వం పొందడం కోసం ప్రస్తుతం ఉన్న అయిదేళ్ల నిరీక్షణ సమయాన్ని పదేళ్లకు పెంచనుంది. వలసల విధానంపై పార్లమెంటులో ప్రభుత్వం శ్వేతపత్రాన్ని సమర్పించనున్న నేపథ్యంలో సోమవారం ప్రధాని స్టార్మర్ ఈ విషయాన్ని వెల్లడించారు. వృత్తి, విద్య, కుటుంబం తదితర కేటగిరీల వీసాలపై వచ్చిన వారికి కూడా ఇది వర్తిస్తుంది. భారతీయులు సహా ఇతర దేశాల వారు బ్రిటన్‌లో అయిదేళ్ల పాటు నివసిస్తుంటే ప్రస్తుతం వారికి ఆటోమేటిక్‌గా పౌరసత్వం లభిస్తుంది. దీనికి అడ్డుకట్టవేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నైపుణ్యాలు ఉన్నవారికే పౌరసత్వం మంజూరులో ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ వర్గంలో నర్సులు, డాక్టర్లు, ఇంజినీర్లు, కృత్రిమ మేధ లీడర్లు ఉండనున్నారు. కాగా, కొత్త విధానంలో.. వలస వచ్చేవారికి హయ్యర్ స్టాండర్డ్ ఇంగ్లీష్ వచ్చి ఉండాలని పేర్కొన్నారు. బ్రిటన్‌లో నివసించే విదేశీయులపై ఆధారపడ్డ వారు మేజర్లయితే వారికి కూడా తప్పనిసరిగా కనీస ఇంగ్లీషు పరిజ్ఞానం ఉండాలన్నారు.

## గుజరాత్‌లో తెలంగాణ పోలీసుల ఆపరేషన్..
# 20మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు

హైదరాబాద్, మే 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి సూరత్‌లో 20మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. ఇందుకోసం పోలీసు బృందాలు పది రోజుల పాటు సూరత్‌లో మకాం వేయడం విశేషం. నిందితులపై తెలంగాణలో 60కి పైగా కేసులు నమోదు కాగా, దేశవ్యాప్తంగా వేర్వేరు రాష్ట్రాల్లో 515 సైబర్ కేసులు నమోదైనట్లు ప్రాథమిక విచారణలో తేలింది. వీరు రూ.4.37 కోట్ల అనుమానాస్పద లావాదేవీలు నిర్వహించినట్లు వెల్లడైంది. నిందితుల్లో ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులతో పాటు ఓ బ్యాంకు ఉద్యోగి కూడా ఉన్నాడు. వారి నుంచి పోలీసులు 20 మొబైల్ ఫోన్లు, 28సిమ్ కార్డులు, 4 ఏటీఎం కార్డులు, 5 చెక్ బుక్‌లు, పాన్ కార్డులు, రబ్బరు స్టాంప్‌లు స్వాధీనం చేసుకున్నారు. గుజరాత్‌లో పట్టుకున్న ఈ సైబర్ నేరగాళ్లను ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించామని సీఎస్‌బీ డైరెక్టర్ షికా గోయల్ తెలిపారు.

## ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి చొరవతో
# స్వదేశానికి ఇందూరు వాసి


ముగ్గిడి బాలకిషన్

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి, మే 12 : ఉపాధి కోసం సౌదీ అరేబియాకెళ్లి అనారోగ్యంతో బాధ పడుతున్న నిజామాబాద్ జిల్లా వాసి.. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి చొరవతో స్వదేశానికి బయలుదేరారు. జక్రాన్‌పల్లి మండలం చింతలూరు వాసి ముగ్గిడి బాలకిషన్ (38).. సౌదీ అరేబియాలోని రియాద్ నగరంలో ఓ వ్యక్తి ఇంట్లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మెదడు నరాల సంబంధ వ్యాధితో బాధ పడుతున్న బాలకిషన్ నాలుగు నెలల క్రితం ఆరోగ్యం క్షీణించడంతో తాను పని చేస్తున్న ఇంట్లోనే కింద పడిపోయాడు. ఈ సంగతి గమనించిన అతడి యజమాని సొంత ఖర్చులతో ఆస్పత్రికి తరలించారు. మెదడు సంబంధ నరాల వ్యాధికి అత్యంత ఖరీదైన చికిత్స కూడా చేయించడంతో బాలకిషన్ ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. తమ ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న బాలకిషన్‌ను వెనక్కు రప్పించాలని ఆయన కుటుంబ సభ్యులు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డిని వేడుకున్నారు. దీంతో స్పందించిన రాకేశ్ రెడ్డి.. రియాద్‌లోని భారత ఎంబసీ అధికారులను సంప్రదించారు. సౌదీ అరేబియాలోని సామాజిక సేవా కార్యకర్తలను సంప్రదించి బాలకిషన్‌ను స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నించారు. తెలంగాణ ఎన్నారై ఫోరం అధ్యక్షుడు అబ్దుల్ జబ్బార్, భారత ఎంబసీ అధికారులు, సౌదీ యజమాని మధ్య సమన్వయం ఫలించడంతో బాలకిషన్ సోమవారం స్వదేశానికి బయలుదేరారు.

## గిఫ్ట్ డీడ్ రద్దు చేయాలని
# ఇతర వారసులు కోరలేరు: హైకోర్టు

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): దాత చనిపోయిన అనంతరం ఒక వారసుడికి ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేయాలని ఇతర వారసులు కోరలేరని హైకోర్టు స్పష్టం చేసింది. సీనియర్ సిటిజన్స్ చట్టం కింద ఇలాంటి వినతి చేసే అవకాశం అసలే లేదని తెలిపింది. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న పి. రోహిత్ సూర్య అనే వ్యక్తికి, ఆయన తాత సుబ్బారావు కొండాపూర్‌లోని జాగృతి ఫౌండేషన్స్‌లో 3, 4 అంతస్తులను రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ ద్వారా అందజేశారు. అయితే రోహిత్ తండ్రికి, సుబ్బారావు మధ్య విభేదాలు వచ్చాయి. దాంతో గిఫ్ట్ డీడ్ రద్దు చేసేలా ఆదేశాలివ్వాలని సుబ్బారావు రాజేంద్రనగర్ ఆర్డీవోను సంప్రదించారు. విచారణ జరిపిన ఆర్డీవో... సీనియర్ సిటిజన్స్ చట్టం ప్రకారం దాన్ని రద్దు చేయాలని సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. తనకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఏకపక్షంగా రద్దు చేయడం చెల్లదని పేర్కొంటూ రోహిత్ హైకోర్టును ఆశ్రయించారు. సీనియర్ సిటిజన్స్ చట్టంలోని సెక్షన్ 23 (1)లో పేర్కొన్న విధంగా వృద్ధుల బాగోగులను చూసుకోవడం వంటి షరతులను గిఫ్ట్ డీడ్‌లో పేర్కొనలేదని తెలిపారు. అదీకాకుండా ఆర్డీవో ఆదేశాలు ఇచ్చిన తర్వాత తమ తాత చనిపోయారని తెలిపారు. అందువల్ల ఇతర వారసులు కూడా గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేయాలని కోరలేరని తెలిపారు. వాదనలు విన్న జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి ధర్మాసనం.. దీంతో ఏకీభవించింది.. వృద్ధులు జీవించి ఉన్నంత వరకే సీనియర్ సిటిజన్స్ చట్టం వర్తిసుందని తెలిపారు. తాత చనిపోయిన దృష్ట్యా గిఫ్ట్‌ను రద్దు చేస్తూ ఆర్డీవో ఇచ్చిన ఆదేశాలను కొట్టివేశారు.

## అండమాన్‌కు నైరుతి రుతుపవనాలు?

ద్రోణి కారణంగా రెండు రోజులుగా నికోబార్ దీవుల్లో విస్తృతంగా వర్షపాతం నమోదయింది. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కూడా కురిశాయి. రాగల 24 గంటల్లో నికోబార్ దీవుల్లో విస్తృతంగా వర్షాలు కురవడంతో పాటు, కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వచ్చే 4-5 రోజుల్లో అరేబియా సముద్రం దక్షిణ ప్రాంతం, మాల్దీవులు, కోమోరిన్, దక్షిణమధ్య బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవులలో రుతుపవనాల పురోగతికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఇది వర్షాకాల ప్రవేశాన్ని సూచించే కీలకమైన దశగా పేర్కొంది. మరోవైపు రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో మంగళ, బుధవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

## వికారాబాద్‌లో ఈదురుగాలుల బీభత్సం

పూడూరు: వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో సోమవారం భారీ ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు బీభత్సాన్ని సృష్టించాయి. కొన్నిచోట్ల భారీ వృక్షాలు విరిగి రోడ్లపై పడ్డాయి. మన్నెగూడ-వికారాబాద్ రోడ్డులో చెట్ల కొమ్మలు విరిగి పడడంతో వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం కలిగింది. పోలీసులు స్థానికుల సహాయంతో రోడ్డుపై పడిన చెట్ల కొమ్మలను తొలగించారు. రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడలో గాలివానకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కూలి ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ స్తంభం నేలకొరిగింది. కేశంపేట మండలం కాకునూరు గ్రామంలోని నిల్యా నాయక్ పౌల్ట్రీఫామ్‌లో ఆదివారం ఈదురు గాలులకు దాణా యంత్రం కూలడంతో పౌల్ట్రీ యజమానితో పాటు కూలీలకు గాయలయ్యాయి. పౌల్ట్రీ యజమాని నిల్యా నాయక్ హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.


నాంచారమ్మ జాతరలో సోది చెప్పించుకుంటున్న ఎమ్మెల్సీ కవిత

## తెలంగాణకు మీరు సీఎం అవుతారు..!

» నాంచారమ్మ జాతరలో కవితకు సోదమ్మల జోస్యం

వెంకటాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత తెలంగాణకు సీఎం అవుతారని సోదమ్మలు జోస్యం చెప్పారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజపురం శివారులో సోమవారం జరిగిన నాంచారమ్మ కల్యాణంలో కవిత పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాంచారమ్మ వేషధారణలో వచ్చిన బాలికలతో కవిత సోది చెప్పించుకున్నారు. భవిష్యత్తులో మీరే తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతారని చిన్నారులు అనడంతో ఆ మాటలను కవిత చిరునవ్వుతో ఆలకించారు. అంతకుముందు ఆమె రామప్ప ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. కాగా, "ఆరు నెలలు జైల్లో ఉన్నది చాలలేదా..? నన్ను ఇంకా కష్టపెడతారా..?" అని కవిత ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో ఆదరణ, నమ్మకం పెరుగుతోందని.. ఇలాంటి తరుణంలో తనపై కొందరు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.


నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం వద్ద బుద్ధుని పాదాలకు అంజలి ఘటిస్తున్న ప్రపంచ సుందరి పోటీదారులు

# సాగర్‌లో సుందరీమణుల సందడి

(మొదటిపేజీ తరువాయి)

ఘనస్వాగతం పలికింది. ప్రతిగా 'నమస్తే తెలంగాణ.. జరూర్ ఆనా" అంటూ సుందరీమణులు నినదించారు. భారతదేశ సంస్కృతితో రెండు చేతులు జోడించి నమస్కరించారు. వారికి కీర దోస, నిమ్మ రసం, పుదీనాతో కూడిన వెల్కమ్ డ్రింక్ ఇచ్చారు. అక్కడ కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం సాగర్ జలాశయం ఒడ్డున నిర్వహించిన ప్రత్యేక ఫొటో షూట్‌లో అందాలభామలు పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐజీ సత్యనారాయణ, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఏఎస్పీ మౌనిక.. ప్రపంచ సుందరి పోటీదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విజయవిహార్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా పాయింట్ వద్దకు వచ్చి అందాలభామలు అభివాదం చేసి ఫొటోలు దిగారు. సాయంత్రం 6 గంటలకు బుద్ధవనం చేరుకున్నారు. వారికి గిరిజన నృత్యంతో స్వాగతం పలకగా, బుద్ధ జయంతి సందర్భంగా బౌద్ధ భిక్షువులు ఆశీర్వచనం చేశారు.

### ధ్యాన మందిరంలో ప్రార్థనలు..

అందాలభామలు బుద్ధవనంలోని ధ్యాన మందిరానికి వెళ్లి ప్రార్థనలు, పూజలు నిర్వహించారు. బుద్ధవనంలోని అతిపెద్ద ధ్యాన మందిరంతోపాటు బుద్ధుడి జీవిత చరిత్రను తెలిపే విగ్రహాలను చూసి ఆశ్చర్యపోయారు. బుద్ధపీఠం వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం బుద్ధవనంలోని మీడియా పాయింట్ వద్దకు వచ్చి ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. బుద్ధవనం ప్రత్యేకతను, బుద్ధుని జీవిత విశేషాలను పర్యాటక శాఖ గైడ్ ఈమని శివనాగిరెడ్డి వారికి వివరించారు. బుద్ధ జయంతి పురస్కరించుకుని కొవ్వొత్తులతో నివాళులర్పించిన అనంతరం బుద్ధ ధమ్మ వద్ద ధ్యానం చేశారు. జాతకవనాన్ని సందర్శించి ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో ప్రదర్శించిన బుద్ధ చరిత్ర నాటకాన్ని, పర్యాటక శాఖ నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను తిలకించారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి విందులో పాల్గొన్నారు. పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యేలు బాలునాయక్, జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. రాత్రి 7.55 గంటలకు సుందరీమణులు హైదరాబాద్‌కు బయలుదేరారు.

### తెలంగాణ పేరు ప్రతిబింబించేలా!

మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో ప్రతి అంశంలోనూ తెలంగాణ పేరు ప్రతిబింబించేలాగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బుద్ధవనంలో ధ్యానం చేసేందుకు వచ్చిన సుందరీమణులకు 'తెలంగాణ జరూర్ ఆనా' లోగోను ముద్రించిన కొబ్బరి బోండాలను అందించారు. అందాల తారలు మెడలో వేసుకునేందుకు కండువాలు ఇచ్చారు. తెలుపు రంగు కండువాలపై అశోక చక్రం, తెలంగాణ ప్రభుత్వ లోగో, తెలంగాణ టూరిజం లోగోతో పాటు బుద్ధవనం లోగోను ముద్రించారు. బుద్ధవనంలో పూజలు, ప్రార్థనలు చేసేందుకు కర్ణాటకలోని మైసూర్‌కు చెందిన 9 మంది బౌద్ధ భిక్షువులను రప్పించారు. హైదరాబాద్, మహేంద్రహిల్స్‌లోని మహాబోధి బుద్ధవిహార్ నుంచి వచ్చిన మరో 16 మంది బౌద్ధ భిక్షువులు కూడా బిక్కి సంగపాల ఆధ్వర్యంలో ప్రార్థనలు, పూజలు నిర్వహించారు.

### నేడు హెరిటేజ్ వాక్.. రేపు ఓరుగల్లుకు


బుద్ధవనంలో ధ్యానం చేస్తున్న ప్రపంచ సుందరి పోటీదారులు

హైదరాబాద్ సిటీ/వరంగల్: మిస్ వరల్డ్-2025 పోటీదారులు మంగళవారం హైదరాబాద్ నగరంలోని పలు దర్శనీయ ప్రాంతాలను సందర్శించనున్నారు. నగర వారసత్వాన్ని, సాంస్కృతిక సంపదను ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో ప్రభుత్వం చార్మినార్ పరిధిలో మిస్ వరల్డ్-2025 హెరిటేజ్ వాక్, చౌమల్లా ప్యాలెస్‌లో వెల్‌కమ్ డిన్నర్ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో చార్మినార్ జోన్ పరిధిలోని ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. కాగా, మిస్‌వరల్డ్ పోటీదారులు బుధవారం ఓరుగల్లు పర్యటనకు రానున్నారు. ఇందుకోసం పర్యాటక శాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేస్తోంది. తొలుత 35 మందితో కూడిన అందాల భామల బృందం వేయిస్తంభాల ఆలయ నిర్మాణం, శిల్ప వైభవాన్ని, వరంగల్ కోటలో కాకతీయుల కీర్తి తోరణంతో పాటు శిల్పసంపదను పరిశీలిస్తుంది. కాగా, 22 మంది అందగత్తెలతో కూడిన మరో బృందం హైదరాబాద్ నుంచి నేరుగా ములుగు జిల్లాలోని రామప్ప ఆలయానికి చేరుకుని.. అక్కడి శిల్ప సౌందర్యాన్ని పరిశీస్తారు. పేరిణి నృత్య ప్రదర్శనను తిలకిస్తారు. రాత్రి హరిత కాటేజీల్లో డిన్నర్ పూర్తి చేసుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.

## అప్పీళ్లన్నీ ఆదాయ వనరులే

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నట్లు తేలగా.. తదుపరి దర్యాప్తులో అంతకు పదింతలు ఎక్కువ తేలే అవకాశం ఉన్నట్లు సీబీఐ వర్గాలు భావిస్తున్నాయి. కార్పొరేట్ సంస్థల స్థాయిని బట్టి కనీసం రూ.15 లక్షలు, రూ.20 లక్షల నుంచి రూ.కోట్లు లంచం తీసుకుని, అప్పీళ్లను పరిష్కరించినట్లు సీబీఐ విచారణలో తేలింది. ఈ క్రమంలోనే ముంబైలో ఎన్‌డీడబ్ల్యూ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎల్ఎల్‌పీకి సంబంధించిన అప్పీలుకు ఏకంగా రూ.2.5 కోట్ల విలువైన ఫ్లాట్ లంచంగా తీసుకున్నట్లు తేలింది. ఈ ఫ్లాట్‌ను ఖమ్మంకు చెందిన దండెల వెంకటేశ్వర్లు పేరిట రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలను జీవన్ లాల్ వద్ద ఉంచుకున్నట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. ముంబైకి చెందిన వెంచూరా సెక్యూరిటీస్ లిమిటెడ్ నుంచి రూ.20 లక్షలు లంచం డిమాండ్ చేసి, రూ.15 లక్షలు మధ్యవర్తి వెంకటేశ్వర్లు ద్వారా తీసుకున్నట్లు వెల్లడైంది. అహ్మదాబాద్‌కు చెందిన హేమంత్ కుమార్, రాజేంద్ర కుమార్ షా నుంచి రూ.15 లక్షలు వసూలు చేసి హవాలా మార్గంలో తన వారి ఖాతాలో జమచేయించినట్లు సీబీఐ గుర్తించింది. తాజాగా ముంబైకి చెందిన షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్ నుంచి ఓ అప్పీలు విషయంలో రూ.కోటీ 20 లక్షలు లంచం డిమాండ్ చేశారు. అందులో రూ.15 లక్షలు ముంబైకి చెందిన సాజీదా మజహర్ హుస్సేన్ షాను మధ్యవర్తిగా ఉంచి తీసుకున్నారు. ఆ మొత్తం జీవన్‌లాల్ ఆదేశాల మేరకు వరహాలు అనే వ్యక్తి ఖాతాలో జమ చేశారు. మరో రూ.70 లక్షలు మధ్యవర్తి రాంగోపాల్ ద్వారా జీవన్‌లాల్‌కు చేరాల్సి ఉంది. డబ్బులు చేతులు మారేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో పక్కా సమాచారంతో సీబీఐ ప్రత్యేక బృందం జీవన్‌లాల్‌ను అరెస్ట్ చేసింది. లంచం డబ్బులు వసూలు చేయడంలో కీలకంగా వ్యవహరించిన మధ్యవర్తులు, ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించుకున్న బినామీలు, ఓ చార్టర్డ్ అకౌంటెట్‌పై సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది.

## ఆన్‌లైన్ తరగతులు నిర్వహించండి

» సరిహద్దు వర్సిటీ అధికారులను కోరిన తెలంగాణ

న్యూఢిల్లీ, మే 12 (ఆంధ్రజ్యోతి): భారత్ - పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని సరిహద్దు రాష్ట్రాలలోని యూనివర్సిటీ అధికారులను ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ (ఆర్‌సీ) గౌరవ్ ఉప్పల్ కోరారు. సరిహద్దు ప్రాంతాల నుంచి తెలంగాణ భవన్‌కు చేరుకున్న విద్యార్థులతో ఆర్‌సీ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఆర్‌సీ సంబంధిత యూనివర్సిటీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పరిస్థితి పూర్తిగా సద్దుమణిగే వరకు విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని కోరారు. దానికి వారు సానుకూలంగా స్పందించారని ఆర్‌సీ తెలిపారు. కొంత మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు పరిస్థితి మెరుగుపడే వరకు ఢిల్లీలోనే ఉంటామని కోరగా, అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని భవన్ అధికారులను ఆర్‌సీ ఆదేశించారు. సోమవారం వరకు తెలంగాణ భవన్‌కు 162 మంది చేరుకున్నారని ఆయన తెలిపారు.

## మద్యం మత్తులో యువతిపై సామూహిక అత్యాచారం!

ఇద్దరు నిందితుల అరెస్టు..

వారిలో ఒకరు ఆమె స్నేహితుడే

నిజాంపేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): తననే నమ్ముకొని ప్రాంతం కాని ప్రాంతానికి వచ్చిన స్నేహితురాలిపట్ల హేరానికి పాల్పడ్డాడా యువకుడు! పార్టీ చేసుకుందాం అని పిలిచి.. తన స్నేహితుడితో కలిసి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టాడు. నిజాంపేటలో ఈనెల 3న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాచుపల్లి పోలీసుల వివరాల ప్రకారం జార్ఖండ్‌కు చెందిన యువతి (20) చెన్నైలోని ఓ కాలేజీలో బయోమెడికల్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. అదే కాలేజీలో చదువుతున్న, ఆ రాష్ట్రానికే చెందిన అజయ్ (20) అనే యువకుడు ఆమెకు స్నేహితుడు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో ఇంటర్న్‌షిప్ ఇప్పిస్తానని స్నేహితురాలిని అతడు నమ్మించాడు. ఇందుకు నగరానికి వచ్చిన ఆమె, కూకట్‌పల్లిలోని ఓ హాస్టల్‌లో ఉంటోంది. అజయ్‌కు నగరంలో జార్ఖండ్‌కే చెందిన హరి (22) అనే స్నేహితుడు ఉన్నాడు. హరి ప్రగతినగర్‌లోని రాజీవ్ గృహకల్ప ఫ్లాట్‌లో ఉంటూ సమోసాల వ్యాపారం చేస్తున్నాడు. యువతికి ఫోన్ చేసిన అజయ్.. హరి ఫ్లాట్‌కు రావాలని, అక్కడ పార్టీ చేసుకుందామని ఆమెను ఆహ్వానించాడు. అంగీకరించిన ఆమె ఈనెల 3న రాత్రి హరి ఫ్లాట్‌కు వెళ్లింది. అక్కడ అజయ్, హరి, యువతి కలిసి మద్యం తాగారు. మద్యం మత్తులో అర్ధరాత్రి ఆమెపై అజయ్, హరి అత్యాచారానికి పాల్పడ్డారు. యువతి పెద్ద ఎత్తున కేకలు వేయడంతో అక్కడికి వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడి నుంచి పారిపోయేందుకు నిందితులు ప్రయత్నించగా వారిని పట్టుకొని బాచుపల్లి పోలీసులకు అప్పగించారు.

## ఆరేళ్ల పోరాటం తర్వాత పోస్టింగ్

సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా జయలక్ష్మి

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): చేయని తప్పుకు శాఖాధిపతి ఆగ్రహానికి గురైన అటవీశాఖ అధికారి జయలక్ష్మికి ఆరేళ్ల పోరాటం తర్వాత ఎట్టకేలకు పోస్టింగ్ లభించింది. సచివాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా జయలక్ష్మిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ అటవీశాఖలో విధులు నిర్వరిస్తున్న జయలక్ష్మి.. 2013లో పదోన్నతిపై భద్రాచలం నుంచి నిజామాబాద్ సర్కిల్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా వెళ్లారు. తర్వాత ఇన్‌చార్జి మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. అప్పుడే ఆర్‌టీఐ కింద దరఖాస్తుదారుడికి సమాచారమిచ్చారు. అలా ఆర్‌టీఐ కింద సమాచారం ఇవ్వడమే తప్పని ఆమెపై శాఖాధిపతి ఆగ్రహం వ్యక్తం చేశారు. జయలక్ష్మిని బాధ్యతలను తప్పించడంతోపాటు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు న్యాయం కోసం మహిళా కమిషన్, మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ)లను ఆశ్రయించారు. నాటి రాష్ట్ర అటవీశాఖాధిపతిగా ఉన్న పీసీసీఎఫ్ రిటైర్‌మెంటైన కొద్ది రోజుల్లోనే జయలక్ష్మికి తిరిగి పోస్టింగ్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# మన సంస్కృతికి అందాల పోటీలు విరుద్ధం

» యువతకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు?

» అరుణోదయ 50వసంతాల స్ఫూర్తి సభలో విమలక్క ప్రశ్న

» ఆపరేషన్ కగార్, పహల్గాం దాడిని ఖండిస్తూ తీర్మానం


అరుణోదయ 50వసంతాల స్ఫూర్తి సభ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ప్రజాకళాకారులు

హైదరాబాద్ సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): మహిళల ఆత్మాభిమానాన్ని కించపరిచే అందాల పోటీలను రాష్ట్ర ప్రభుత్వం సగర్వంగా ప్రకటించడం సిగ్గుచేటు అని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన అరుణోదయ 50వసంతాల స్ఫూర్తి సభలో వక్తలు విమర్శించారు. తెలంగాణ పోరాట స్ఫూర్తికి, ప్రజా సంస్కృతికి అందాల పోటీలు పూర్తి విరుద్ధమని, వీటి ద్వారా యువతకు ఏమి సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రజా గాయని విమలక్క ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి, మావోయిస్టు పార్టీతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ సాంస్కృతిక వేదికలన్నీ ఒక్కటి కావాల్సిన అవసరం ఉందన్నారు. స్త్రీవాద రచయిత్రి కొల్హాపురం విమల మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా స్త్రీల నాయకత్వంలో సాగుతోన్న ఒకే ఒక్క సాంస్కృతిక ఉద్యమం అరుణోదయ మాత్రమే అని చెప్పారు. ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కాసీం మాట్లాడుతూ పల్లెల్లో మిగిలిన జానపద వాఙ్మయాన్ని సేకరించి, భద్రపరిచే బాధ్యతను అరుణోదయ స్వీకరించాలని సూచించారు. అరుణోదయ గౌరవాధ్యక్షురాలు విమలక్క సారథ్యంలో అందాల పోటీలు, ఆపరేషన్ కగార్, ఉగ్రదాడులను ఖండిస్తూ పలు అంశాలు తీర్మానించారు. విడిగా ఉన్న అరుణోదయలతో పాటు భావసారూప్యత కలిగిన మిగతా విద్యార్థి, మహిళా సంఘాల ఐక్యతా ప్రయత్నాలను ముమ్మరం చేయడమే సభ ముఖ్య ఉద్దేశమని విమలక్క ప్రకటించారు. తద్వారా ఉమ్మడి వేదికగా ఏర్పడి, నవంబర్‌లో ఐక్యతా సభను నిర్వహించుకొనే దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. అరుణోదయ, పీడీఎస్‌యూ, పీఓడబ్ల్యూ విప్లవ సంఘాలు ఏర్పడి యాభై ఏళ్ళు పూర్తయిన సందర్భంగా అరుణోదయ రూపొందిన ఆడియో, వీడియో పాటను సామాజిక ఉద్యమకారిణి అంబిక ఆవిష్కరించారు. ప్రత్యేక సావనీర్‌ను ఎనిశెట్టి శంకర్ విడుదల చేశారు.

### విమలక్క సారథ్యంలో కళా ప్రదర్శన

అరుణోదయ యాభై వసంతాల స్ఫూర్తి సభ సందర్భంగా ప్రజా కళాకారులు పెద్ద సంఖ్యలో సుందరయ్య పార్కు నుంచి వీఎస్‌టీ వరకు డప్పు చప్పుళ్లతో, పదం పాడుతూ... కదం తొక్కుతూ విమలక్క నేతృత్వంలో కళా ప్రదర్శన నిర్వహించారు. ఎర్ర జెండా చేతబట్టి నృత్యాలు చేస్తూ చైతన్య గీతాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తించారు. అనంతరం అరుణోదయ సీనియర్ నాయకుడు రాములు జెండా ఆవిష్కరణ చేసి సదస్సు ప్రారంభించారు. ముందుగా పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి అరుణోదయ ప్రతినిధులు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో జన సాహితి దివి కుమార్, ఆచార్య కొండా నాగేశ్వర్, మానవ హక్కుల వేదిక జీవన్ కుమార్, సాహిత్య విమర్శకుడు ఏకే ప్రభాకర్, విరసం వరలక్ష్మి, జిలుకర శ్రీనివాస్, కోలార్ శాంతమ్మ, బిస్మిల్లాఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్ తదితర ప్రజాకవులు, కళాకారులు సౌహార్ద సందేశం ఇచ్చారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ పోతుల, ఏపూరి మల్సూర్, ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష, కార్యదర్శులు కదీరయ్య, సుధాకర్, ప్రతినిధులు రాకేశ్, అనిత తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో..
# ఫీజుల నియంత్రణ

» పేరెంట్స్, టీచర్స్ కమిటీలే వాటిని నిర్ణయించాలి

» జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కమిటీలు

» ప్రతీ బడిలో పేదలకు 25 % ఉచిత సీట్లు

» విద్యారంగ సంస్కరణలపై సిద్ధమైన ముసాయిదా చట్టం

» మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం భేటీ

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉన్నవిధంగా రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, జూనియర్ కళాశాలలకు ఫీజు నియంత్రణ చట్టం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే తెలంగాణ విద్యా కమిషన్ చేసిన సూచనలతో ఫీజు నియంత్రణపై ప్రభుత్వం ముసాయిదా చట్టం సిద్ధం చేసింది. విద్యారంగంలో సంస్కరణలపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన సోమవారం జరిగింది. విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, డిగ్రీ విద్య కార్యదర్శి శ్రీదేవసేన, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్య సంచాలకులు ఈవీ.నరసింహారెడ్డితోపాటు ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రభుత్వం సిద్ధం చేసిన ముసాయిదా చట్టాన్ని ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్ కళాశాలల యాజమాన్య సంఘాల ప్రతినిధులకు అందించారు. ప్రతీ ప్రైవేటు పాఠశాల, కళాశాలలో 10 మందితో కూడిన పేరెంట్స్, టీచర్స్ కమిటీని ఏర్పాటు చేయాలని ముసాయిదా చట్టంలో పేర్కొన్నారు. ఇందులో ఐదుగురు పేరెంట్స్, నలుగురు టీచర్లు, ఒకరు కళాశాల యాజమాన్యం తరఫున ఉంటారు. ఫీజులను ప్రతీ రెండేళ్లకోసారి ఈ కమిటీ నిర్ణయిస్తుంది. కమిటీ నిర్ణయించిన ఫీజులను జిల్లాస్థాయిలో కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా ఖజానా అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీ ఖరారు చేస్తుంది. అలాగే రాష్ట్రస్థాయి త్రిసభ్య కమిటీలో రిటైర్డ్ న్యాయమూర్తి, ఆడిటర్, విద్యాశాఖలో జేడీ స్థాయి అధికారి ఉంటారని ముసాయిదా చట్టంలో పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టంలో పేర్కొన్నవిధంగా ప్రతీ ప్రైవేటు పాఠశాల మొత్తం సీట్లలో నాలుగోవంతు(25 శాతం) పేదలకు ఉచితంగా కేటాయించాలి. ఈ ఉచిత సీట్ల కోసం తల్లిదండ్రులు ప్రభుత్వానికి దరఖాస్తు చేస్తే ప్రభుత్వమే మంజూరు చేస్తుంది. వీటికి సంబంధించి ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని పేర్కొన్నారు. కాగా ప్రైవేటు జూనియర్ కళాశాలలకు ఇదే తరహాలో ఫీజు నియంత్రణ ఉండాలని ముసాయిదా చట్టంలో పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలపై సమావేశంలో పాల్గొన్న ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్య సంఘాల ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. అయితే విద్యార్థులు, తల్లిదండ్రులను ప్రలోభపెట్టే కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల తప్పుడు ప్రకటనలను ప్రభుత్వం నియంత్రించాలని తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం(ట్రస్మా) అధ్యక్షుడు మధుసూదన్, కార్యదర్శి రమేష్ రావు కోరారు. త్వరలో మరో సమావేశం నిర్వహించి చర్చించిన తర్వాత ఈ అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని శ్రీధర్ బాబు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.